# జ్యోతి

## నవంబర్ సంచిక విడుదలైంది

ఈ సంచికలో—

ధనికొండ, కానన్ డయల్, శార్వరి, రామచంద్రరావు, డి. [illegible]ధర్, రాంషా, శివం మొదలైన వారి కథలూ, భరద్వాజ నాటిక, పాపారావ్, భాస్కర్రావ్, పి. మోహన్, చందు, మునికన్నయ్య, మొదలైనవారి గేయాలు— గ్రంథ సమీక్షలూ, లోకసంచారం, చిత్రసీమ, ప్రశ్నలు—జవాబులు, ప్రజాభిప్రాయం, మొదలైన సినిమా విషయాలు, వ్యంగ్య చిత్రాలు, నవ్వుపువ్వులు, సుభాషితాలు— అవీ, ఇవీ, ఇంకాఎన్నో—

త్రివర్ణ ముఖచిత్రం: ఆర్టుపేట్లు

160 పేజీలు: విడిప్రతి 8 అణాలు.

సంవత్సర చందా: రూ 6-0-0

లేనిచోట్ల ఏజెంట్లు కావాలి.

**జ్యోతి కార్యాలయం,**

**4, బాలు మొదలి వీథి, మద్రాసు, 17.**

# అభిసారిక

సచిత్ర విచిత్ర మాస పత్రిక

సంపాదకుడు: ధనికొండ హనుమంతరావు

సంపుటి: 3 | నవంబర్, 1955 | సంచిక 5

ఈ సంచికలో 'సందేహాలకు సమాధానాలు' శీర్షిక కనిపించకుండటం చాలా మంది పఠితల్ని కలవర పెట్టవొచ్చు. పఠితల సందేహాలను తీర్చటం మా విధి అనే విషయాన్ని కాదనలేం, అనేకమంది సందేహాల్ని తీర్చేందుకు స్థలాభావమే కారణం కాని వేరు కాదు.

చాలమంది సందేహాలను తీర్చేందుకు డిసెంబర్‌లో ఒక సప్లిమెంట్ సంచికను వెలువరిస్తున్నాం. యీ కారణంగానే యీ సంచికలోనూ, పై సంచికలోనూ సందేహాల శీర్షికను తాత్కాలికంగా తీసివేశాము.

యీ సంచికలో 'మాతృత్వం సెక్సు' ఆఖరయింది. పై సంచిక నుంచీ హేవలాక్ ఎల్లిస్ రచన 'వివాహ చరిత్ర' వరుసగా ప్రచురించబడుతుంది. శాస్త్రీయంగా, సమగ్రంగా చర్చించబడిన యీ రచనపట్ల పాఠకులు, తప్పక కుతూహలాన్ని కనబర్చగలరని విశ్వసిస్తున్నాం.

★

# వార్తా ప్రపంచం

అమెరికను ఇన్సూరెన్సు కంపెనీల అంచనాల ప్రకారం అమెరికన్ పౌరులు బైబిల్‌లో పేర్కొనబడినట్లు సగటున సుమారు 70 సంవత్సరాల వయసు వచ్చే వరకు జీవించి వుండగలరని భావించవచ్చు. 1954 లో జన్మించిన అమెరికన్ పౌరుడు 69.8 సంవత్సరాలపాటు జీవిస్తాడని భావించవచ్చునని మెట్రోపాలిటన్ లైఫ్ ఇన్సూరెన్సు కంపెనీ తెల్పుతున్నది. అంటే, 1889 లో జన్మించిన వాని జీవిత కాలంకంటె ఇది రెట్టింపు కంటె ఎక్కువన్నమాట. ఈ కంపెనీ రికార్డుల ప్రకారం 1889 లో అమెరికన్ పౌరుని సగటు జీవిత కాలం 34 సంవత్సరాలు.

★

టెలివిజన్ సహాయంతో ప్రపంచంలోని డాక్టర్లు ఎవరైనా రోగి విషయంలో ఒకరితో మరొకరు క్షణాల మీద సంప్రతించుకోవడం కొద్ది కాలంలోనే సాధ్యపడవచ్చునని టెలివిజన్ల విషయంలో నిపుణుడైన డాక్టర్ ఆల్‌ఫ్రెడ్ గోల్డ్‌స్మిత్ భావిస్తున్నారు. ఏదైనా ఒక అరుదైన వ్యాధి ప్రపంచంలోని ఒక ప్రాంతంలో ఎవరికైనా వస్తే, ఆ వ్యాధి లక్షణాలను సూచిస్తూ టెలివిజన్ ద్వారా ప్రసారంచేసి, ఆ విధంగా అనేకమంది వైద్య నిపుణుల సలహాలను క్షణాల మీద పొందడానికి వీలు బహుశా – ఐదు మొదలు, పదిహేను సంవత్సరాలలో, సాధ్యపడవచ్చునని ఆయన అన్నారు.

★

రేడియో ధార్మిక ఐసోటోపులను ఉపయోగిస్తూ సోవియట్ వైద్యశాస్త్రజ్ఞులు సరికొత్త పరిశోధనా పద్ధతులలో సిద్ధహస్తులయారు. మెటబాలిజం, రక్తప్రసారం, ఉచ్ఛ్వాస నిశ్వాసాలు, ఆహారం

జీర్ణమవడం, శరీరంలో జరిగే యితర ప్రక్రియలను శస్త్రి చికిత్స అవసరం లేకుండానే పరిశోధించడానికి వీలు కలిగింది.

వైద్య అవసరాలకై డాక్టర్ల సహకారంతో ఇంజనీర్లు ఒక గామా యంత్రాన్ని నిర్మించారు. దీనివల్ల రేడియో ధార్మిక కోబాల్టు కిరణాలను సరిగ్గా అవసరమైన మోతాదుల్లో పొందవచ్చును. సోవియట్ దేశమంతటా నగరాలలోని ఆస్పత్రులల్లోనూ, క్లినిక్కులలోనూ యీ యంత్రాలు అమర్చబడ్డాయి. ధాతువులలోకే సరాసరి రేడియో పదార్థాలను పంపించి చికిత్సచేసే పద్ధతికూడా యిప్పుడు ఎక్కువగా అనుచరించబడుతూంది. ప్రత్యేకమైన సూదులతో రేడియో ధార్మిక పదార్థాలను సరాసరి గ్రంధుల ధాతువులలోకే ప్రవేశపెట్ట వచ్చును.

సోవియట్ దేశంలో అనతి కాలంలోనే అన్ని వైద్య శాఖల లోనూ అణుశక్తి వినియోగింపబడుతుందని రూఢిగా చెప్పవచ్చును.

★

నారింజ, నిమ్మ, కమలా పళ్లు కాస్తున్న చెట్లను కాకసస్‌లోని జార్జియా సమశీతోష్ణపు ప్రాంతాలలోవున్న సమిష్టి క్షేత్రాల, ప్రభుత్వ క్షేత్రాల పళ్ళ తోటల్లో చూడవచ్చును. ఇవి అసలు నారింజ చెట్లు. వీటికి నిమ్మ, కమలా కొమ్మలు అంటు కంటబడ్డాయి. ఈ చెట్లకు ఒకేసారిగా యీ మూడు రకాల పళ్లు కాశాయి.

నారింజ చెట్టుకు నిమ్మ, కమలా అంట్లు కట్టడంవల్ల పెద్ద పంటలు పండేయి. అంటు కట్టబడిన కొమ్మలు రెండు మూడేళ్ళలో ముదిరి కాపుకు వస్తాయి. పెద్ద కాపు కాస్తాయి, పళ్ళలో రసంకూడా ఎక్కువే. ప్రతి చెట్టుకూ వెయ్యికిపైగా పళ్లుపండేయి.

కొమ్మలు అంటుకట్టే కాలం మొదలైంది. ప్రత్యేక శిక్షణ పొందిన వందలాది కూలీలు పళ్ళతోటల్లో పని ప్రారంభించారు. గుల్‌రిప్‌షీ, బటుమీ, కోబులెటీ, మకరాడ్జె ప్రాంతాలలోని సమిష్టి క్షేత్రాల్లో, ప్రభుత్వ క్షేత్రాలలో కొన్నివేల కొమ్మలు అంటు

కట్టారు. ఈ ఏడాది మొత్తం 82000 నారింజ చెట్లకు నిమ్మ, కమలా చెట్ల కొమ్మలు అంటుకట్టబడతాయి. ఇది క్రాస్ బ్రీడింగ్ పద్ధతిలో ఆధునిక శాస్త్ర విజ్ఞానం కనిపెట్టగలిగిన లాభకరమైన కొత్త పద్ధతి.

★

లేబొరేటరీలో మొక్కలను ఎలాగ కావాలంటే అలాగ పెరిగేటట్లు చేసే పద్ధతి కనుగొనబడిందని ఒక విస్కాన్సిన్ శాస్త్రవేత్త తెల్పుతున్నాడు. మొక్కలలోని హార్మోన్‌లను జాగ్రత్తగా క్రమబద్ధం చేస్తే, పెద్దవై పోయిన మొక్కలు తిరిగి చిన్న మొక్కలులాగా పెరిగేటట్లు చెయ్యవచ్చు. మొక్కలో కొంత భాగం మాత్రమే ఆ విధంగా పెరిగేటట్లు చెయ్యాలన్నా చెయ్యవచ్చు. చిన్న కొమ్మకు సయితం ఈ పద్ధతివల్ల వేర్లు సృష్టించవచ్చు.

★

మేలు రకం ఔషధాలు తయారీ ఫలితంగాను, ఉత్తమ చికిత్సా విధానాల కారణంగాను అంటు వ్యాధులకు చికిత్స చేసే ఆస్పత్రులు న్యూయార్క్‌లో మూసివెయ్యబడుతున్నాయి. ఇప్పటికి 71 సం॥ వత్సరాల నుంచి పని చేస్తున్న విల్లర్డ్ పార్కర్ ఆస్పత్రిని ఈ సంవత్సరాంతాన మూసి వేయడానికి నిర్ణయమయిందని ఆస్పత్రుల కమీషనర్ డాక్టర్ బేసిల్ మిహ్లీన్ ప్రకటించాడు. 1954 నవంబరు నుంచి ఈ విధంగా మూసివెయ్యబడిన ఆస్పత్రులు ఇది వరకే మూడు వున్నాయి. ఇవి తుయ ఆసుపత్రులు.

★

బాధారహితమైన కాన్పుల విధానం ఇండియా అంతటా ప్రవేశపెట్టే సావకాశంలేదని భారత ఆరోగ్యశాఖా మంత్రిణి అభిప్రాయం. దేశంలోని కొద్ది ఆసుపత్రుల్లో యీ విధానం అమల్లో వుంది.

యీ విధానంలో తల్లికి ఇవ్వబడే శిక్షణను గూర్చి ఆమె ఓపిగ్గా అర్థంచేసుకోవాలి. మాతృత్వాన్ని వహించబోయ్యే స్త్రీలు చాలా పిన్న వయస్కులే కావటం వల్లా, స్వభావసిద్ధంగా కాన్పులో

ఉంటే బాధను ఏవగించుకోనందువల్లా శాధారహితమైన కృత్రిమ పద్ధ తులం అవసరం కనపించదని మంత్రిణి అభిప్రాయం.

★

కుటుంబ నియంత్రణలో పై సంవత్సరం భారత ప్రభుత్వం 6 కోట్ల రూపాయిల్ని ఖర్చుపెడుతుంది. 73 పట్టణాల్లోనూ, 485 టౌన్స్‌లోనూ, 50,000 పల్లెల్లోనూ యీ పద్ధతి అమలు జరిపే ప్రయ త్నాలు జరుగుతవి.

కేంద్ర ప్రభుత్వం ప్రతి పల్లెకూ రూ 4,000 సహాయం చేయ గలుగుతుంది. ఒకానొక అమెరికన్ మందుల వ్యాపారం చేసే సంస్థ, మాత్రల రూపంలో సరఫరాచేసే యీ పద్ధతిని ప్రభుత్వం ఆమోదిం చింది.

★

ఎలక్ట్రానిక్ శక్తితో కొన్ని రకాల గుడ్డితనాన్ని కుదర్చవొచ్చని అమెరికన్ వైద్యప్రముఖులు అభిప్రాయ పడుతున్నారు. కంటినరాలు తెగిపోకుండా ఉన్నట్లయితే, ఏ ప్రమాదంలోనో గుడ్డితనం సంభవిం చగా, అలాటి కేసుల్లో తిరిగి దృష్టిని ఇవ్వగల అవకాశాలున్నవని శాస్త్రజ్ఞులు అంటున్నారు.

★

తెల్లి చరీలో ఒక మొగ పిల్లవాడు, ఆడపిల్లగా మారుతూండ టాన్ని డాక్టర్లు శస్త్రచికిత్స ద్వారా అరికట్టారు. మరో ఆపరేషన్‌తో ఆ పిల్లాడు కోరుకుంటే స్త్రీగా మారే అవకాశంవుంది. అంబాలాలో పట్టభద్రురాలైన 20 సం.ల యువతి మొగవాడుగా మారుతోంది; ఇది జరగకుండా డాక్టర్లు తంటాలు పడుతున్నారు.

లక్నోలో ఒక కోడిపెట్ట మూడు సంవత్సరాల్లో పుంజుగా మారింది. మొదటి సంవత్సరంలో ఇది 5 గుడ్లు పెట్టింది. రెండోఏట ఒకటి; మూడో సంవత్సరంలో అసలు గుడ్లే పెట్టలేదు.

★

# ప్రతిక్రియ



రచన
వి. రామకృష్ణ

సరోజిని తనకు దక్కలేదని కాదు: దాసు దక్కించుకో గలుగుతున్నాడని వర్మగాడి ఏడుపు.

వర్మకు సరోజిని అంటే చాలా ఇష్టం. అంత కంటే ఎక్కువ కడుపులో మంట దాసు అంటే! దాసు, వర్మకు చేసిన అపకారం ఏమీలేదు. అలాగే ఉపకారంకూడా లేదు. ఆ దాసు లేకపోతే సరోజిని ఏనాడో తనకు దక్కేదని అతని విశ్వాసం, అతన్ని చాలా బలంగా బాధిస్తుంది. సాంఘికంగా తక్కువ స్థితిలోవున్న దాసు తన కంటే ఎక్కువ గౌరవాన్ని పొందడం సహించలేడు వర్మ. యిది కేవలం ఈర్ష్యతప్ప మరొకటి కాదనే సంగతి వర్మకు యిప్పట్లో తెలియదు. బహుశా యిక ముందుకూడా తెలియదేమో!

యిటువంటి స్థితిలోవున్న వర్మ సరోజిని తన కిచ్చిన స్వాతంత్ర్యాన్ని ఎలా వినియోగం చేసుకుంటున్నాడో అతనికి తెలియదు. తెలిస్తే యిటువంటి పనులు చేయడు. సరోజిని దృష్టిలో తన విలువ తగ్గిపోతున్నదనే విషయాన్ని వర్మ యింత వరకూ గుర్తించలేదు. గుర్తించినా తన విలువ తాను నిలబెట్టుకునే స్థితిలో లేడు. పోయిన విలువను తిరిగి పునరుద్ధరించుకోవడం సంగతి దేవుడెరుగు, కొత్త మందలింపులు జరక్కుండా కూడా కాపాడుకోలేక పోతున్నాడు.

ఇదంతా దాసు వల్లనే జరుగుతోందనీ, వాడే, సరోజినిచేత, తనను చీవాట్లు పెట్టిస్తున్నాడనీ, కడుపులోమంట. రోజూ రోజూకూ తగ్గిపోతున్న తన విలువ కంటే, పెరుగుతున్న దాసు విలువను అరికట్టాలనే ఈర్ష్య అతన్ని అనుక్షణం కొరుక్కుతింటోంది. సరోజినిని ఏకాంతంగా కలుసుకుని అనేక సంగతులు చెప్పాలని ప్రయత్నించేవాడు వర్మ. కాని,

ఎప్పుడూ కూడా, దాసు వెంట లేకుండా సరోజినిని కలుసుకోవడం అసంభవమయేది. సరోజిని ప్రక్కనవున్న దాసును చూస్తే, ఈర్ష్య పడగ విప్పేది; వొళ్ళు మండి పోయేది. ఈ స్థితిలో చెప్పదలచిన నాలుగు ముక్కలూ అడుగున పడిపోవడం, చెప్పదలచింది చెప్పలేక పోవడం సంభవించేది. చివరకు తెగించి, ఆమెతో 'సరోజినీ, నీతో కొంచెం మాట్లాడాల్సిన పనుంది, అటు వెళ్ళొద్దామా?' అన్నాడువర్మ, ఆ సాయంత్రం బీచిలో కలుసుకున్నపుడు.

సరోజిని కాస్త పరిశీలగా చూసి, 'ఏం, ఆయన వినకూడదా ?' అంది. వర్మ ఏమీ సమాధానం చెప్పలేక పోయాడు. సందేహాస్పదంగా చూసి ఊరుకున్నాడు. సరోజిని మనస్సు కాస్త కలుక్కుమంది. యింత కాలం నుంచీ లేని రహస్యాలు యిప్పుడెందుకు వొస్తున్నాయో, సరిగ్గా అర్థం కాక పోయినా ఛాయా మాత్రంగా వూహించ గలిగింది. ఈ విషయాన్ని గురించి వర్మకు లోగడ అనేకసార్లు చెప్పిచూసింది కూడాను. రహస్యాలంటూ ప్రారంభమయ్యాక యిక స్నేహితులుగా వుండడం మంచిది కాదంది. కాని వర్మ వినిపించుకోలేదు. వినిపించుకున్నా తన పద్ధతి మార్చుకోలేదు. ఆ విషయాలన్నీ జ్ఞాపకానికొచ్చి, ముఖం కాస్త చిట్లించి, దాసు నుద్దేశించి, 'సరే మీరిక్కడే వుండండి, రెండు నిమిషాల్లో వొస్తాను.' అని వర్మతో కలిసి బయల్దేరింది.

వర్మ కాస్త సంతోషించగలిగాడు. ఒక ప్రక్క దాసు నుంచి, వేరుపరచి తీసుకుపోగలుగుతున్నా ననే సంతోషం, మరో ప్రక్క, సరోజినిముఖంలోని కాఠిన్యం చూసేసరికి, వర్మకు దిగులు పుట్టింది. ఈ సంఘటనవల్ల సరోజిని నిజంగా బాధపడితే తను చెప్పదలచిన విషయానికి యిది సరైన సమయం కాదేమోనని కాస్త సందేహిస్తూ నడుస్తున్నాడు. వర్మ ఆలోచనలను భగ్నపరుస్తూ, 'ఊఁ అయితే మీరు మాట్లాడేదేవిటి?' అంది సరోజిని నడుస్తూనే.

'ఏం లేదు సరోజినీ! నీతో చాలా కాలంనుంచీ యిట్లా మాట్లాడాలనుకుంటున్నాను. నువ్వేమీ అనుకోకపోతే...'

'అనుకోవడం దేనికి? చెప్పేదేమిటో చెప్పండి.' అంది సంక్షిప్తంగా.

'దాసును గురించి, నీ అభిప్రాయమేమిటి?' అడిగాడు వర్మ.

'ఆ విషయం, మీకెందుకు?'

'అదికాదు సరోజినీ! నీ అభిప్రాయం తెలుసుకుందామని.'

'నా అభిప్రాయంతో అవసరం?'

'అదికాదు సరోజినీ! ఎదురు ప్రశ్న వేయకు, మరీ అంత కోపగించుకుంటూ వెందుకు?' జాలిగా అడిగాడు వర్మ.

సరోజిని లోపలి కోపాన్ని కాస్త అణచుకొని, 'మీరడిగే వాటికి నేనెలా సమాధాన మివ్వాలో, నా ప్రశ్నలకు మీరుకూడా అలాగే సమాధానం చెప్పాలి గదా ?' అన్నది.

'నువ్వడగాలే గాని, లక్ష ప్రశ్నలకయినా, సమాధానం చెప్పడానికేమీ అభ్యంతరంలేదు సరోజినీ! హృదయపూర్వకంగా అడుగుతున్న ఒక్కమాటకు సమాధానం చెప్పు. నేనంటే నీకేమీ కోపం లేదుగదా?' అనడిగాడు.

'ఏమీలేదు. మీరడిగేది ఏమిటో త్వరగా చెప్పండి. అవతల దాసు మన కోసం ఎదురు చూస్తుంటాడు' అంది సరోజిని.

దాసు ప్రసక్తి వొచ్చేసరికి వర్మకు మళ్ళీ కోపం వొచ్చింది. బీచిలో జనం చాలా వెనక పడ్డారు. నడవడం ఆపేసి, సరోజిని నుద్దేశించి, 'దాసుతో నీ స్నేహాన్ని గురించి యితరులు ఏమనుకుంటున్నారో నీ వెన్నడైనా ఆలోచించావా ?' అనడిగాడు.

సరోజినికి ఛర్రుమంది. తనను తాను సంబాళించుకుని, 'ఆ విషయాన్ని గురించి, మీ రెందుకు చింతించడం ?' అంది.

'నేను కాకపోతే మరెవరు చింతిస్తారు సరోజినీ ? ఎవరికి అభిమాన ముంటుందో వాళ్ళే బాధపడతారు. నేనిలా అడగడం మరో విధంగా భావించవని ఆశిస్తున్నాను.'

'నా భావన సంగతి అలా వొదిలెయ్యండి. మీరు అడగదలచిన దానికి పీఠికే యింతవుంటే, యింకా అసలు విషయం, మరో నాటికి వాయిదా పడాల్సొస్తుం దనుకుంటాను.'

'అపహాస్యం చెయ్యకు సరోజినీ, నిన్ను ఏకాంతంగా కలుసుకో గలిగాననే సంతోషంలో, ఉక్కిరిబిక్కిరై, ఏం మాట్లాడుతున్నానో, ఎలామాట్లాడుతున్నానో తెలియని, అవ్యక్తానందంలో మునిగిపోతున్నాను. కొస్త వూపిరి తీసుకోనియ్యి సరోజినీ!'

'సరే; వూపిరి తీసుకుంటూండండి. రేపు సాయంకాలం మళ్ళీ కనిపిస్తాను.'

ఈ మాటతో, వర్మకు వున్న మతి కాస్తా పోయింది. ఏడవలేక నవ్వేశాడు. అలా నవ్వుతూనే, 'అదికాదు సరోజినీ! నువ్వంటే నాకెంతయిష్టమో...' అని ప్రారంభించి, ఛీ, అరే; యిలా మొదలెట్టానేవిటీ? అనుకున్నాడు వెంటనే మనస్సులో.

ఆ మాట విన్న సరోజిని 'అలాగా? ఎప్పట్నించీ?' అనడిగింది. సరోజిని, విసిరిన ఆ కొసను అందుకుని వర్మ మళ్ళీ యిలా అన్నాడు. 'నీముందు ప్రమాణం చేసి చెప్తున్నాను సరోజినీ! నే నింతవరకూ ఎవర్నీ ప్రేమించలేదు. బహుశా యికముందు ఎవర్నీ ప్రేమించను కూడా. నువ్వు నిరాకరిస్తే...!'

'ఆగండి, ఆగండి. అటు సినిమాల్లోనూ, యిటు పుస్తకాల్లోనూ, చూడలేక, చదవలేక ఛస్తున్నాను. యింతకూ మీరు అనేది, ఘోరంగా ప్రేమించానంటారు. అంతేనా?' అన్నది.

'అతిశయోక్తిగా మాట్లాడకు సరోజినీ! నీ మీద నాకున్నటువంటి సదభిప్రాయాన్ని అర్థంచేసుకోలేక పోతున్నావ్. మనిద్దరం పరిచయస్థులమైనప్పటినుంచీకూడా, నీ మంచితనాన్ని సంపాదించడంకోసం, నీకు సంతోషం కలిగించడంకోసం, నే చేసిన ప్రయత్నమంతా, యిలా వ్యర్థమవుతుందనుకోలేదు. చివరకు దాసుకంటేకూడా హీనుణ్ణయి పోవాల్సొస్తుందనుకోలేదు. నీ మూలంగా, ఆ దాసుక్రిందకూడా, సినిమాలకు, నాటకాలకు, విలువైన వస్తువులకు ఎంత డబ్బు తగలెట్టానో నీకు తెలియదా? నిజానికి ఆ దాసుతో నాకు సంబంధం ఏమిటి? ఎందుకు అతని ఖర్చులన్నీ భరించాను? దాసు తోడులేకుండా నువ్వు రావు గనుక, నువ్వు రావడం

నాకు ప్రధానం కనుక. ఏనాటికైనా నువ్వు అర్థంచేసుకుంటావని ఆశించాను. కాంక్షించి మొహాన ఉమ్మేస్తావనుకో లేదు. కాని, ఒక్క విషయం మాత్రం జ్ఞాపకం పెట్టుకో సరోజినీ! మీ నాన్న గనుక మాజిస్ట్రేట్ గాకపోతే, అంత ఆస్థీ లేకపోతే, నీకే యింత అందమూ, చదువూ లేకపోతే ఆ దాసు నిన్ను కన్నెత్తి చూచేవాడు కాదనే సంగతి మాత్రం జ్ఞాపకంవుంచుకో. అతి వినయు లెప్పుడూ ధూర్తలక్షణ పూరితులైవుంటా రనే సంగతి నీకు తెలియంది కాదు. అయినా చెప్పడం మంచిది. ప్రేమ, అభిమానం, గౌరవం, కీర్తి, ప్రతిష్ఠా, యింతెందుకు మానవ జీవితపు సమస్త చర్యలన్నింటికీ కూడా అట్టడుగున వున్న కారణం ఆర్థిక ప్రాబల్యం అంటాడు మార్క్స్. యిదికూడా నీకు తెలుసు. తెలిసి కూడా యిలాంటి పొరపాటు ఎందుకు పడుతున్నావో ఆశ్చర్యంగా వుంది' అని ఆక్షేపించాడు ఆవేశంతో.

సరోజిని చిన్నగా నిట్టూర్చి, 'సరిగ్గా ఈ సమయంలో దాసు కూడా వుంటే చాలా బావుండేది. సరే కానివ్వండి. పాపం అతను మన కోసం ఎదురు చూస్తుంటాడు' అంటున్న సమయంలో దూరంగా వొస్తున్న దాసును చూసి, చప్పట్లు చరిచి, దగ్గరగా పిలిచి, 'యింకా మాట్లాడవలసింది వుంది. రాక్సీకి రేపు వెళ్దాం. మీరింటికి వెళ్ళి పొండి.' అని చెప్పింది.

దాసు మారుమాట్లాడకుండా, వెనక్కి తిరిగి, యిసుకలో బరువుగా అడుగులు వేసుకుంటూ వెళ్ళి పోయాడు.

★

'ఆఁ ఏమిటన్నారూ! నే పొరపడుతున్నానని కదూ!' అన్నది అతని ముఖంలోకి సాలోచనగా చూస్తూ.

'అవును సరోజినీ! క్షణికమైన ఉద్రేకాల్లో త్వరపడి ఓ నిర్ణయానికి రావడం, భవిష్యత్తులో చాలా కాలంగా పశ్చాత్తాప పడడానికి కారణమౌతుంది. అలాంటిది జరక్కుండా, చూసుకోమనే కోరేది!' అన్నాడు వర్మ, ఆశగా ఆమె తల్లోని పూలు చూస్తూ.

'మీరిచ్చిన సలహాకు సహస్ర ధన్యవాదాలు. ముందు మిమ్మల్ని మీరు సరి చేసుకోండి. మిస్టర్ వర్మా! మీ కింత సీరియస్‌గా సమాధానం యివ్వవలసి వొచ్చినందుకు కాస్త చింతిస్తున్నాను. అయినా చెప్పకతప్పదు. లోగడ చాలా సార్లు హెచ్చరిక చేసాను. అయినా మీరు గమనించినట్టు లేదు. సరే వెనకటి సంగతులు పోనివ్వండి. నా అంతరంగిక వ్యవహారాల్లో జోక్యం కలిగించుకోవాల్సినంత అవసరం, మీకేం లేదు. బహుశా యిందులో కొంత తప్పు నాదికూడా వున్నదని రుజువైంది. మనం పరిచయస్థుల మైనప్పట్నుంచీ కూడా నా మంచితనం సంపాదించడం కోసం, నన్ను సంతోష పెట్టడానికి మీ రింత శ్రమయాతన పడుతున్నారనుకో లేదు. దాసు కంటేకూడా హీనుణ్ణయ్యానని మిమ్మల్ని మీరే విమర్శించుకున్నారు. చాలా సంతోషం. మొదట్నుంచీకూడా మీ యిద్దరికీకూడా సమానమైన గౌరవాన్నే యిచ్చాను. దాసు తన గౌరవాన్ని నిలబెట్టుకో గలిగాడు; మీరు ఉన్నదాన్ని పోగొట్టుకున్నారు.

'మామూలంగా దాసు క్రిందకూడా ఎంతో డబ్బు తగలెట్టా నన్నారు. నిజానికి దాసుతో మీకేమీ సంబంధం లేని మాట నిజమే! అయితే యిందులో మీకు బోలెడంత స్వార్థం వుందని మీరే చెప్పుకున్నారు. మీ రాశించినట్టు నేను మిమ్మల్ని నిజంగానే పూర్తిగా అర్థం చేసుకున్నాను, కాని కాంక్షించి మోహాన ఉమ్మేయలేదు.'

'అదికాదు సరోజినీ...' అని ప్రారంభించిన వర్మమాటను పూర్తి కానివ్వకుండానే, సరోజిని మళ్ళీ ప్రారంభించింది. 'మా నాన్న మాజిస్ట్రేట్ అని గానీ, మా ఆస్థినిగురించి గాని, లేక నా అందచందాలనుగురించికాని దాసు నన్ను గౌరవించడం లేదనే సంగతి మీకంటే ఎక్కువగా నాకు తెలుసు. అనుభవాలకు దూరంగావుండి మాట్లాడ్డం వివేకవంతుల లక్షణంగా కాదనే సంగతి మీరుకూడా గుర్తుంచుకుంటే బావుంటుంది. యింత అధోగతిలోకూడా మార్క్స్ సూత్రం మీకు జ్ఞాపకం వుండడం కొంచం సంతోషంగావుంది నాకు. యిన్ని సంగతులు తెలిసివుండికూడా నేను పొరపడుతున్నానని మీరనుకుంటున్నారంటే నాకు ఆశ్చర్యంగా వుంది.'

'అదికాదు సరోజినీ! పోనీ దాసును నీ వెన్నడయినా మనస్ఫూర్తిగా ప్రేమించావా?'

'అదుగో మళ్ళీ మొదటికొస్తున్నారు. పారీస్ ఎవరంటే, నర్గీస్ చెల్లెలనే స్థితిలోకి దిగజారి పోతున్నారు.'

'పోనీ, నా తిరోగమనం సంగతి అలా వొదిలెయ్. నీ పురోగమనం సంగతి చెప్పు.'


ఘనతవల్లనే అగ్రస్థానం




ప్రతీ షాపులలోను దొరకును.


'యింకా వినాలనివుందా? వినండి. పరస్పరాభిమానం గలిగిన ఏ యిద్దరి వ్యక్తుల్ని ఏ సూత్రంతోనైతే విడగొట్టి సర్వ నాశనం చేయాలని అభిలషించారో, ఆ సూత్రంవల్లనే వాళ్ళిద్దరూ, మరింత ఆత్మీయులై, వాళ్ళ మధ్యవున్న నిజమైన ప్రేమాభిమానాలు స్థిరమైన రూపం దాల్చబోతున్నాయ్. దాన్నిక ఎవరూ ఆపలేరు. ఎవరివల్లా కాదు.' అన్నది సరోజిని ఆవేశంతో.

'అయితే దాసు నిన్ను పెళ్ళిచేసుకోవడం నిజమేనన్నమాట?'

'కాదు. దాసునే నేను పెళ్ళిచేసుకోబోతున్నాను. మరొక్క విషయం: మనం ఎంత అభ్యుదయాన్ని కాంక్షించేవాళ్ళమయినప్పటికీ, మన చుట్టూ సమాజం అనేది ఒకటున్నదనే విషయాన్ని మరచి పోగూడదు. నలుగురూ కాదన్న

పనిని అయిదవ వాడు చేయడం అభ్యుదయ మనిపించుకోదు. నిజమైన ప్రేమాను రాగాలకు స్థిరమైన రూపాన్ని యివ్వగలిగేది ఒక్క వివాహం మినహా మరే సాధనం లేదనే నా నమ్మకం. సమాజాన్ని త్రోసి రాజనడం నా కిష్టంలేదు. అలా అనుకోగలిగిన వాళ్ళకు, వెన్నెల రాత్రిలో అందం, సముద్రపుహోరులో ఆనందం ఉన్నతాధికారంలోవున్న గర్వం, సమాజంలో గౌరవం అనవసరం. వాళ్ళ కోసం, కొండలు, గుట్టలు, మహారణ్యాలు, దేశంలో పుష్కలంగా వున్నయ్.'

'పోనీ; నా సంగతి వొదిలెయ్. నా కోసం చెప్పడం లేదు. నేనంటే యిష్టం లేక పోయినప్పటికీ; నీ శ్రేయస్సు కోరి చెప్తున్నాను. నువ్వు కోరుకుంటే దాసు కంటే కూడా గొప్ప వాళ్ళను పెళ్ళి చేసుకోగలవు. కాస్త ఆలోచించి చూడు.'

'ఓహో మిష్టర్ వర్మా! ఎంత కాలానికి బయట పడ్డావు! అథో లోకంలో, కొన్ని మెట్లే దిగావనీ, ప్రయత్నిస్తే పైకి రావచ్చనీ ఆశించాను... కాని, యిక పైకి రాలేవు సరిగదా, అథో లోకంలో యిక నీకు దిగడానికి మెట్లుకూడా లేవు. యింత ఘోరంగా పతనమై పోయావని ఈ క్షణాన తెలుసుకున్నాను. శెలవు' అని లేచింది సరోజిని. ఆమెను కూర్చోపెట్టాలని చాలా బలవంతం చేశాడు; ప్రయోజనం లేక పోయింది. గత్యంతరం లేక వర్మకూడా లేచి, సరోజినితోపాటే నడిచాడు. దూరంగా వెలుగుతున్న ఎలక్ట్రిక్ దీపాల కాంతిలో నీడల్ని పొడుగు చేసుకుంటూ చాలా దూరం వెళ్ళిపోయారు.

★

సరోజిని చెప్పినట్లే దాసును వివాహం చేసుకుంది. వర్మకు మిగిలినదల్లా, సరోజిని తనకు దక్కలేదని కాదు, దాసు దక్కించుకున్నాడనే బాధ. చాలా కాలం మానశికంగా బాధపడ్డాడు. అంతకంటే మరేం చెయ్యలేకపోయాడు.

ఆ రోజు సాయంత్రం బీచిలో భార్యాభర్త లిద్దరూ కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ, నవ్వుతూ పోతున్నారు. వాళ్ళిద్దర్నీ చూసి వేణుగోపాలరావు నిజంగా హృదయపూర్వకంగా సంతోషించాడు. తన సంతోషాన్ని తోటి వాడితో పంచుకునేందుకు ప్రక్కనున్న వర్మతో; 'ఒరేయ్, భార్యా భర్తలంటే అలా వుండాల్రా! ఎందుకు మనమూ వున్నాం' అన్నాడు.

'ఎవర్రా?' అన్నాడు వర్మ దిక్కులు చూస్తూ.

'అదుగో. బ్లూజాకెట్ ...'

'అదా! దాని సంగతి నీకు తెలియదల్లేవుంది. యిలాంటి విషయాల్లో నువ్వు చాలా మైనర్‌విరా! దానిసంగతి కావాలంటే నన్నడుగు. ఒకప్పుడు, నేనంటే పడి చచ్చేది. 'యిప్పుడు అడగనివాడిది పాపం. మాజిస్ట్రేట్ సదాశివరామయ్య గారి కూతురు సరోజిని. క్వీన్ మేరీస్‌లో చదివింది...' అని ప్రారంభించి సరోజినీ, దాసు కథ చెప్తూ మిత్రుణ్ణి మరో వైపుకు దూరంగా తీసుకుపోయాడు వర్మ.

★




ర చ న:
జా క బ్స్

స్వేచ్ఛానువాదం ;
'దా సు'


కెప్టెన్ పోల్‌సన్ పద్దెనిమిది మాసాల సముద్ర ప్రయాణానంతరం ఇంటికి తిరిగొచ్చాడు. మనిషి మాంచి ఆరోగ్యంగా, ఉత్సాహంగా వున్నాడు. ఈ పద్దెనిమిది మాసాల ఓడ ప్రయాణంలో తన కెదురైన కష్టాలూ, చేసిన సాహస కృత్యాలూ విధీ విరామం లేకండా ఏకరువు పెట్టసాగాడు. ఎదురుగా కుర్చీలో కూచున్న అతడి చెల్లెలు జేన్, కొంచం పక్కగా తలవంచుకూర్చున్న కూతురు క్రిస్సీ మధ్యమధ్య నవ్వుతున్నారు.

'సరే, యిక యిక్కడి విశేషాలేంటో చెప్పండి.' అన్నాడు కెప్టెన్ పోల్‌సన్ తను చెప్పవలసిందంతా అయిపోయిందన్నట్టు.

'ఇక్కడ పెద్ద విశేషాలేం లేవు,' అంటూ జేన్, క్రిస్సీకేసి సాభిప్రాయంగా చూసింది. 'మెట్‌కాఫ్ చిన్న కొడుకు జాక్ వున్నాడే - అతడు తండ్రితో పాటు వ్యాపారంలో దిగాడు.'

'ఆ దుర్మార్గుణ్ని గురించి నాకేం చెప్పొద్దు.' అంటూ పోల్‌సన్ మొహం కందగడ్డలా చేసుకున్నాడు. 'ఈ పల్లెలో వున్న మర్యాదస్తుల్నిగురించి ఏమైనా విశేషాలుంటే వినాలనుకుంటున్నాను.'

'కోళ్ళను దొంగిలించినందుకు జోటాయికి అర్నెల్లు శిక్షపడింది. మిసెస్ పర్టన్ కవల పిల్లల్ని కన్నది. కంద దుంపల్లాగా ఎంత బావుంటా రనుకున్నావ్!' అన్నది జేన్ నవ్వుతూ.

'సరే, చావులేమైనా?' అన్నాడు పోల్‌సన్ చెల్లెలికేసి తలాడిస్తూ.

'ముసలి జెస్పర్ చనిపోయాడు. అక్కడా ఇక్కడా చేబదుళ్లు పుచ్చుకుని లండన్

నుంచి పెద్ద డాక్టర్ని రప్పించాడు. ఆట్టే కాలం బతికే ఆశలేదని చెప్పగానే, బతుకుమీద తనకూ అంత మమకారం లేదనీ, పోతే తను అంతగా ప్రేమించే వాళ్ళను యిక్కడ వదిలేసి పోవటమే బాధగావుందనీ అందరితో చెప్పాడు. డ్రెవర్, మేరీ హ్వ్యాసన్‌ని పెళ్లి చేసుకున్నాడు. జాక్ మెట్‌కాఫ్ కూడా...'

'అహాం, ఆ జాక్‌గాడుకూడా పెళ్లి చేసుకోబోతున్నాడన్న మాట!' అంటూ పళ్ళు కొరికాడు పోల్‌సన్. 'వాడికి దయ్యంలాంటిది దొరికితే బావుండును. ఇంతకీ వాణ్ని పెళ్లిచేసుకోబోతున్న మందమతి ఎవత్తె? జాగ్రత్త అని హెచ్చరించటం మంచిదనుకుంటాను!'

అప్పటివరకూ తలవంచుకూర్చున్న పోల్‌సన్ కూతురు క్రిస్సీ, తలపైకెత్తి, 'పెళ్ళి పేరంటంలాంటి వ్యవహారాల్లో యితర్ల జోక్యం కలిగించుకోవటం, సలహా లివ్వటం మంచి పద్ధతి అని నే నంగీకరించలేను' అంటూ మహాజ్ఞానిలా తల పంకించింది.

కూతురు పెద్ద తరహా మాటలువిని పోల్‌సన్ చికాకు పడ్డాడు.

'నీకీమధ్య కాస్త పెద్ద తరహా అబ్బినట్టుంది. ఫ్యాషన్ కూడా ముదిరింది. ఆం!' అంటూ కళ్లెర్రచేశాడు.

'ఐతే ఏం? అత్త స్వయంగా చెప్పాలనుకుంటున్నది, వినాలనివుంటే విను!' అంటూ క్రిస్సీ కుర్చీలోంచి లేచి బయలుదేరింది.

'ఉహుం నా కెందుకొచ్చింది, నే చెప్పను!' అన్నది జేన్.

'అదికాదే అత్తయ్యా! నువ్వు చాలా మంచిదానివి, నువ్వే చెప్పాలి. నేను గదికివెళ్ళి తలుపు బిడాయించుకుంటాను' అన్నది క్రిస్సీ, అత్తను భుజంపట్టుకుని ఊపుతూ.

పోల్సన్ పెదాలు బిగించి ఈ సంభాషణ వింటూ వూరుకున్నాడు. అసలు సంగతేమిటో అతడికేం అంతు చిక్కలేదు.

'కూచోవే అమ్మాయ్, కూచో! ఏమిటీ సంగతి?' అన్నాడు పోల్సన్.

'ఉహుం నే చెప్పను. నీకు అసలే కోపం ముక్కుమీద వుంటుంది,' అన్నది క్రిస్సీ కుర్చీలో కూచుంటూ.

కూతురు అలా అనేసరికి పోల్సన్ తికమక పడిపోయాడు. సంగతేమిటో అన్న ఆదుర్దా కలిగిందతడికి.

'నేను జాక్‌ను పెళ్లిచేసుకోబోతున్నాను,' అంటూ నిబ్బరంగా ప్రారంభించింది క్రిస్సీ. అంతలోకే గొంతుపట్టుకున్నట్టయిపోయి, 'అంతే... నేను... నాకోసం నువ్వు...నువ్వు జాక్‌ని గౌరవించటం నేర్చుకోవాలి. నాకోసం అతడూ నిన్ను గౌరవించటం నేర్చుకుంటాడు ..అంతే!' అంది.

పోల్సన్ గంతేసి మరీ కుర్చీలోంచి లేచి నిలబడ్డాడు. బోనులో చిక్కిన సింహంలా గదిలో అటూ యిటూ పచార్లు తీయసాగాడు. జేన్ బెరుకుగా అతడికేసి చూడసాగింది. క్రిస్సీమాత్రం కుర్చీలో అలాగే ముడుచుకూచుంది.

'నువ్వు...నువ్వుగనక నాకు కొడుకువై వున్నట్టయితే...ఇపుడు నిన్నేమి చేసివుండేవాడినో నాకు తెలుసు... తెలుసు!' అంటూ పోల్సన్ గుప్పెళ్ళు బిగించి కూతురుకేసి కోపంగా చూశాడు.

'నేను గనక అబ్బాయినయి వున్నట్టయితే, జాక్‌ని పెళ్లిచేసుకోవటానికి చచ్చినా వొప్పుకోవటం జరిగేదికాదు. నువ్వు వట్టి అసందర్భంగా మాట్లాడుతున్నావు నాన్నా!' అన్నది క్రిస్టీ అన్నిటికీ తెగబడినట్టు.

పోల్సన్ యీసారి చెల్లెలికేసి తిరిగి, 'జేన్! ఇదంతా ఏమిటి? నీభావం ఏమిటో నాకు అంతుపట్టటం లేదు' అన్నాడు.

అన్న రౌద్రాకారంచూచి జేన్ గడబిడ పడిపోయింది. ఆమె తడబడే గొంతుతో, 'ఇందులో నా ప్రమేయం ఏమీ లేదు. మొట్టమొదటగా ఆ జాక్ నా అందచందాల్ని గురించి మాట్లాడసాగాడు. ఈ మగాళ్ళ వేషాలు అర్థం చేసుకోగలదాన్ని కనుక నేను మోసపోలేదు. కాని...'

'చెప్పినంతవరకు చాలు,' అన్నాడు పోల్సన్, కాళ్ళతో నేలను గట్టిగా తడుతూ. 'ఆజాక్ గాడికి కాస్త డబ్బూ పలుకుబడీ వుండిపోయింది గాని, లేకపోతే యీ క్షణంలో వెళ్ళి వాడిని పచ్చడికింద కొట్టివుందును. సరే, క్రిస్టీకి పద్ధెనిమిదో ఏడేగదా? ఒక సంవత్సరం పాటు నాతో ఓడ ప్రయాణం చేస్తుంది. ఆ సముద్రం గాలికి బుర్ర పగుళ్ళు కాస్త మాటు పడొచ్చు!' అన్నాడు.

క్రిస్టీ జేబురుమాలు బయటికితీసి రంగంలోకి దిగింది. కనురెప్పల్ని పైకీ కిందికీ కదిలిస్తూ, గాద్గదికంగా, 'మగాళ్ళంటే నాకు మహా చెడ్డ అభిమానం. నీలాగా వాళ్ళని అసహ్యించుకోలేను. ముఖ్యంగా జాక్...అత్తయ్యా నీకూడా అతడంటే చాలా ఆప్యాయత కదా!' అని అడిగింది.

'అవును!' అన్నది జేన్ తెగించినట్టు.

'అలాగా? అయితే మీ యిద్దరూ నాతో ఓడప్రయాణం చేయబోతున్నారు!' అన్నాడు పోల్సన్ కఠినంగా.

'నీ మాటలు వింటూంటే నాకు ఏడుపొస్తోంది,' అంటూ క్రిస్టీ జేబురుమాలుతో కళ్లు తుడుచుకుంది.

'నీ బుర్ర బాగుపడేలోపల నువ్వు ఇలాంటి వాటికి అలవాటుపడక తప్పదు. ఈ లోపల ఆ జాక్‌గాడి రకం సరుకు యీ చుట్టుపక్కలకు వచ్చేందుకే వీలు లేదు!' అంటూ పోల్సన్ లేచి నిలబడ్డాడు.

క్రిస్టీ ఒక్కపరుగున వెళ్లి తండ్రి చేయిపట్టుకుని, అతడి భుజంమీద తలానించి వెక్కివెక్కి ఏడుస్తూ, 'నాన్నా, నువ్వు నన్ను పదిమందిలో అవమానం పాలు చేస్తావా?' అంటూ బావురుమన్నది.

పోల్సన్ ఏమీ చలించలేదు. 'నువ్వు మంచి పిల్లగా ప్రవర్తిస్తే నీకేబాధా వుండదు. హాయిగా నీగదిలోకి వెళ్ళి బొమ్మలతో ఆడుకో. నేను పార్సన్ ఇంటికివెళ్లి యిప్పుడే వస్తాను. బుద్ధిగా వున్నావో, మంచి తిమ్మిరి బిళ్ళలు కొని తెస్తాను.'

పోల్సన్ టోపీ, చేతికర్రా తీసుకొని రోడ్డుమీదికి వచ్చేశాడు. కొంతదూరం వెళ్ళేసరికి ఎదురుగా వస్తున్న ఒక యువకుడు సంకోచిస్తూ, 'గుడ్ యీవెనింగ్ కాప్టెన్ పోల్సన్!' అన్నాడు.

'ఓహో నువ్వా?' అంటూ తక్కున ఆగాడు పోల్సన్ 'నేను నీతో మాట్లాడదామనుకుంటున్నాను. మా అమ్మాయిని పెళ్ళిచేసుకోవాలని చూస్తున్నావు. నేను ఇంట్లో లేని సమయం చూసి గుట్టుచప్పుడుగా పని ముగిద్దామనుకున్నావ్, అవునా? సరే. ఇప్పుడు పెళ్ళాంకోసం మరెక్కడైనా వెతుక్కోవటం మంచిది. మా అమ్మాయిని నావెంట సముద్ర యాత్రకి తీసుకు పోతున్నాను.' అన్నాడు పోల్సన్ ఆజ్ఞాపించే స్వరంలో.

'నేనంటే మీకెందుకో అంత కసి నా కర్థంకావటంలేదు. మీరంటే నాకు ఏనాడూ గౌరవభావమే!' అన్నాడు జాక్ నంగిగా.

'నేనంటే నీకు గౌరవభావమన్న మాట? అయితే రెండేళ్ళక్రితం నాకు వ్యతిరేకంగా కంట్రాక్టర్ నెల్సన్ వైపున సాక్ష్యం ఎందుకు చెప్పావ్? ఆ కేసులో నాకు ఐదువందల పౌన్లు జరిమానా పడిందని నీకు తెలుసుగదా? తరవాత నేనింట్లో లేకుండాచూసి మా అమ్మాయిని అల్లి బుల్లి కబుర్లతో పెళ్ళాడాలని ఎందుకు ప్రయత్నిస్తున్నావ్?' అన్నాడు పోల్సన్ కోపంతో వుడికిపోతూ.

'గతాన్ని తవ్వటం ఎందుకు?' అన్నాడు జాక్ కాస్త ధీమా తెచ్చుకుని.

'గతమా? సరే నువ్వు చాలా తెలివిగలవాడివనే గర్వంతో బాధపడుతున్నావని నాకు తెలుసు. ఆరునూరైనా మా అమ్మాయిని చేపట్టలేవు. శక్తుంటే ప్రయత్నించు చూతాం!'

పోల్సన్ గిరుక్కున వెనక్కి తిరిగి యింటికి వెళ్ళాడు. కుర్చీలో కూచుని పైప్ వెలిగించి జరిగినదంతా చెల్లెలికీ కూతురుకీ చెప్పేశాడు.

జేన్ పాపం, మెత్తని హృదయంగలదేమో బావురుమని ఏడ్వ ప్రారంభించింది. క్రిస్సీమాత్రం జేబు రుమాలుతో కళ్ళు కప్పుకుని కుర్చీని కిరకిరలాడించింది.

ఆడవాళ్ళ యీ ధోరణి పోల్సన్‌కు చిరాకెత్తించింది. 'ఇద్దరూ నోళ్లు మూసుకుని వూరుకుంటారా లేదా?' అన్నాడు పళ్ళు కొరుకుతూ.

'ఊహుం నేనుమాత్రం ఏడవకుండా వూరుకోను. ఆకలిగావుందిగాని లేకపోతే...ఓడలోకూడా ఒక్క క్షణం విరామం లేకుండా ఎప్పుడూ ఏడుస్తూనే వుంటాను. దానితోగాని నీకు ప్రయాణీకులవల్ల జరగవలసిన అవమానం జరగదు!' అన్నది క్రిస్సీ గొంతెత్తి అరుస్తూ.

కూతురూ, చెల్లెలూ చేసేదంతా పోల్సన్‌కు వట్టి అఘాయిత్యంగా కనబడింది. తనకు బెంబేలెత్తించి తమ పట్టుదలేదో నెరవేర్చుకో చూస్తున్నారని భావించాడు. చెయ్యి చేసుకుందామన్నంత కోపం వచ్చిందికాని, అంతలోనే తమాయించుకున్నాడు.

కాసేపు కుర్చీలో కదలా మెదలక కూచుని యిద్దరాడవాళ్ళ కళ్ళనీళ్ళూ ఎండిపోగానే క్లబ్బుకు బయలుదేరాడు. అక్కడ అతడి వీపువెనక ప్రారంభమయిన గుసగుసలూ, నవ్వుల్తో, మరీ కలవరపడి పోయాడు. సూచన ప్రాయంగా ఒకళ్ళిద్దరు అన్నమాటల్తో క్రిస్సీ, జాక్‌ను పెళ్లాడేందుకు తప్పనిసరైతే లండన్

పారిపోయే ప్లానుకూడా వేసుకున్నదని వూహించాడు.

తరవాత రెండుమూడురోజులపాటు కూతుర్ని ఒకకంట కనిపెడుతూనే వున్నాడు. కాని తను పనిమీద బయటికి వెళ్ళాలిసి వచ్చినప్పుడల్లా పోల్సన్‌కు భయంగానే వుండేది. ఇకయిది పనికాదనుకుని మూడో రోజున తన స్టీమర్లో పనిచేసే టక్కర్ అనే కళాసును వెంటపెట్టుకుని యింటికి వచ్చాడు.

'ఇది మా అమ్మాయి, క్రిస్సీ! నువ్వు రాత్రనక, పగలనక యీ పిల్ని ఒక కంట కనిపెడుతూ వుండాలి.' అన్నాడు పోల్సన్, కళాసుకు క్రిస్సీని చూపుతూ.

'ఒకవేళ అమ్మాయిగారు నన్ను ఇంటికి వెళ్ళిపొమ్మంటే?' అని తన అనుమానాన్ని బయటపెట్టాడు టక్కర్.

'నువ్వు ఒకటోరకం వెధవాయివి!' అంటూ విసుక్కున్నాడు పోల్సన్. 'ఈవిడ ఏం చెప్పినా నువ్వు ఖాతరుచేయ నవసరంలేదు. ఒకే రూంలో వున్నప్పుడు తప్ప-తతిమ్మా అన్ని వేళల్లోనూ నువ్వు యీ విడకి మూడడుగుల కంటె ఎక్కువ ఎడంగా వుండకూడదు!'

'మూడడుగులా? నాలుగడుగులన్నా ఎడం లేందే ఎలా కేప్టెన్‌గారూ!' అన్నాడు టక్కర్ ఏడుపు మొహం పెట్టి.

'మూడడుగులంటే మూడడుగులే, తెలిసిందా?' అంటూ కళ్ళెర్ర చేశాడు పోల్సన్. 'ఆడపిల్లలంటే వట్టి కంత్రీ కోరులనుకో! ఇక మాఅమ్మాయి సంగతి ...అదంతా ఎందుకు—మూడడుగులు, అంకులో మార్పు లేదు.' అన్నాడు పోల్సన్ కటువుగా.

'అలా అయితే మీరు మరొకళ్ళను మాట్లాడుకోండి, నావల్ల కాదు.' అన్నాడు టక్కర్ చాలా వినయంగా.

'అదేం కుదరదు. నీకన్న నమ్మకస్తుడైన వాడెవడూ నాకు దొరకడు. ఇది ఆజ్ఞ. నీకు డిసిప్లిన్ అంటే ఏమిటో తెలుసుగదా?' అన్నాడు పోల్సన్.

టక్కర్ మరి నోరెత్త లేక పోయాడు. పోల్సన్ కూనిరాగం తీస్తూ బయటికి వెళ్ళి పోయాడు. క్రిస్సీ కుర్చీలో కూచుని పుస్తకం తెరిచింది-టక్కర్ సరీగా ఆమెకు మూడడుగుల ఎడంలో నించుని, టోపీని చేతుల్లో అటూయిటూ తిప్పుతూ, వెధవ మొహం వేశాడు.

ఒక్క పావుగంట సేపు అలా నుంచున్న తరవాత 'మిస్! యీ నౌకరీ కోసం నేను మీ నాన్నని ప్రాధేయపడలేదని మీకు తెలుసు గదా?' అన్నాడు టక్కర్.

'అవును,' అన్నది క్రిస్సీ పుస్తకం మీంచి దృష్టి మళ్ళించకుండానే.

'నేనెన్నడూ యిలాంటి నౌకరీల కోసం ప్రయత్నించను. అయినా నమ్మకస్తుణ్నన్న చెడ్డ పేరు రావటంతో ప్రతి సారీ నాకిలాంటి పనులే యిస్తూంటారు. స్టీమర్లో కోతుల మందను కాపలా కాయటం నా పని. నువ్వు వాటిని చూస్తే అదిరిపడి పోగలవు. నమ్మకస్తుడైన మనిషికి యీ లోకంలో ఎన్నెన్ని పాట్లు!' అన్నాడు టక్కర్.

'పాపం!' అంటూ క్రిస్సీ పుస్తకం మూసి లేచి నిలబడింది. 'ఇప్పుడు నేను కిచెన్‌లోకి వెళ్తున్నాను. చెలికత్తె నా వెంట రావటంలో నాకేం అభ్యంతరం లేదు' అంది.

'ఆఁ అలాగా మిస్...' అంటూ టక్కర్ గుటక వేశాడు.

'సుసాన్ నిన్ను అక్కడికి రానిస్తుందో లేదో నాకు తెలీదు. అయినా అదంతా నీ పని, నాకేం?'

క్రిస్టీ వెనకనే టక్కర్ బయలు దేరాడు. సరీగా కిచెన్ తలుపు దగ్గిరకు వెళ్ళే సరికి వంటావిడ సుసాన్ కను బొమలు పైకెత్తి ఆశ్చర్యంగా అతడికేసి చూసింది. ఆ చూపుతో టక్కర్ సగం చచ్చి పోయాడు.

'ఓఁ నీకిక్కడేంపని?' అంటూ సుసాన్ గుడ్లెర్ర చేసింది.

'కెప్టెన్‌గారి ఆర్డరు!' అన్నాడు టక్కర్ వణికిపోతూ.

'ఇక్కడ నేనూ కెప్టెన్ని! తెలిసిందా?' అంటూ సుసాన్ పెదాలు బిగించి ముందుకు వొచ్చింది.

'మహా బావుంది, చాలా బావుంది!' అంటూ టక్కర్ పళ్ళికిలించాడు.

'ఈ స్వరూపాన్ని నువ్వెందుకు వెంటేసుకొచ్చావ్?' అంటూ క్రిస్టీకేసి కోపంగా చూసింది సుసాన్.

'ఏం నా స్వరూపానికి?' అంటూ ఆశ్చర్యం ప్రకటించాడు టక్కర్.

'కావాలని పెంచుకున్నా నా యీ శరీరాన్ని, దేవుడిచ్చింది!' అన్నాడు కోపంగా.

'ఎవడిస్తే ఏం? ఆ కాయాన్ని యిక్కణ్ణుంచి కదిలించమని నేను చెబుతున్నాను. నేను ఆడదాన్ని కాదనుకోకు, అయినా మీ మగజాతంటే నాకు పరమ అసహ్యం!' అన్నది సుసాన్.

సుసాన్ అలా అనేసరికి టక్కర్ కాస్త స్థిమితపడి, 'అయితే మనిద్దరిదీ ఒకటే తత్వం అన్నమాట?' అన్నాడు నవ్వుతూ.

కథ అడ్డంతిరిగిందని గ్రహించిన సుసాన్, యజమానురాలికేసి తిరిగి, 'విన్నావా ఆ మాటలు? నాకోసం యీ అబ్బి వంటింట్లోకి వచ్చాడని ఎవరైనా అనుకుంటే - నాకు చచ్చినంత పనౌతుంది.' అంటూ గొంతులో జీర పలికించింది.

'కెప్టెన్‌గారి ఆర్డరు గనక యిక్కడి కొచ్చాను. అంతకంటే నాకు...ఆ ఆలోచనలేం లేవు. నీకోసం వచ్చానని ఎవరైనా అంటే.. అవ్వ, నన్నెరిగున్న వాళ్ళెవరైనా పొట్టచెక్కలయేలా నవ్వ గలరు!' అన్నాడు టక్కర్.

సంభాషణ యిదే ధోరణిలో కొంత సేపు నడిచింది. ఆ తరవాత రెండుమూడు రోజులు సుసాన్ ఎంత ప్రయత్నించినా టక్కర్ మాత్రం 'కెప్టెన్‌గారి ఆర్డరు' అన్న మాటలు పదేపదే ఏకరువు పెట్టసాగాడు. జీన్‌గాని, క్రిస్టీగాని అతడి సంగతి అంతగా పట్టించుకోలేదు. సుసాన్ టక్కర్‌లమధ్య వాగ్వాదం నవరసాల్లోనూ జరుగుతూండేది. పోతే క్రిస్టీ మాత్రం రోజుకు నాలుగైదు సార్లన్నా, జాకెట్‌కు పుత్తరాలద్వారా యింటి పరిస్థితి చెప్తుంటే-అతగాడు బయటి పరిస్థితులు తెలియపరుస్తూండేవాడు. ఈ నిర్వహణ భారమంతా సుసాన్ పాలబడింది.

సరీగా నాలుగో రోజున వాతావరణంలో పెద్ద మార్పువచ్చింది. క్రిస్టీ టక్కర్ మీద ఒకటి రెండు మందహాసాలు ప్రయోగించింది. ఇష్టంలేక

పోయినా, యజమానురాలితోపాటు సుసాన్ కూడా దరహాస చంద్రికల్ని వుపయోగించక తప్పలేదు. జేన్ తనచేత్తో స్వయంగా టక్కర్‌కి ఒక బీరు బాటిల్ యిచ్చింది. మూడురోజుల తేడాలో టక్కర్ పరాయివాడి స్థానాన్నుంచి, ఇంటి మనిషి స్థానానికి ఎగబాకి కూచున్నాడు. ఆ సాయంకాలం జేన్, క్రిస్సీకి జలుబుచేసిన సంగతికూడా టక్కర్‌తో చెప్పింది.

జలుబులాంటి వ్యాధుల్ని క్షణంలో కుదిర్చే కొన్ని చిట్కాలను టక్కర్ చెప్పాడు. ఉల్లి ఆవిరి, ఇటుకరాళ్ళను కాల్చి గొంగడిలోచుట్టి తల కిందపెట్టు కోవటం, శొంఠి గంధం, కర్పూరం... ఊహుం పీటిల్లో దేన్నీ జేన్ వొప్పలేదు. క్లోరోడైన్‌కన్న మంచి చికిత్స లేదన్నది. కాని ఆ మందు మోతాదు కాస్తంత ఎక్కువైతే కలిగిన ప్రమాదాల్నిగురించి కూడా ఆమె చెప్పింది. క్రిస్సీ పుస్తకం పట్టుకుని దూరంగా కూచుని యీ సంభాషణంతా వింటూనే వున్నది. కాసేపు తర్వాత జేన్, సుసాన్‌లు బయటికి పోగానే, అలమారులోవున్న క్లోరోడైన్ సీసా బయటికి తీసింది క్రిస్సీ.

టక్కర్ ఆమె కాళ్ళావేళ్ళా పడి బతిమాలాడు. అంత యింపుగా కనబడక పోయినా తను చెప్పిన చిట్కాల్లో ఏదో ఒకటి చేస్తే జలుబు యిట్టే మాయమవుతుందన్నాడు. క్రిస్సీ ఒప్పుకోలేదు. క్లోరోడైన్ సీసా మూతతీసి, ఒక గ్లాసులోకి వంచుతూ, 'ఒకటి .. రెండు... మూడు' అంటూ లెక్క ప్రారంభించింది. హఠాత్తుగా సీసాలోవున్న మందు ఒక్కసారిగా గ్లాసులోకి దొర్లింది.

'ఈ మాత్రం చాలనుకుంటాను!' అంటూ గ్లాసు పైకెత్తింది క్రిస్సీ.

'అయ్యో, వద్దు మిస్! చాలా ప్రమాదం. కావాలంటే నేను లెక్కపెడతాను. అంత మందు తాగటం...ప్రమాదం...ప్రమాదం!' అంటూ గుడ్లు తేలవేసాడు టక్కర్.

క్రిస్సీ, 'నా యిష్టం, ఫో!' అంటూ గ్లాసు ఎత్తి గడగడ తాగేసింది. టక్కర్ నోరు తెరిచి అలా చూస్తూ వుండి పోయాడు. గ్లాసు అలమారులో పెట్టి క్రిస్సీ పుస్తకం తీసుకుని కుర్చీలో కూచుంది. ఒకటి రెండు నిమిషాలు జరిగే లోపల ఆమె చేతులో నుంచి పుస్తకం తక్కున కింద పడిపోయింది. తల కుర్చీకి వేలాడబడింది. కళ్లు మూతబడినై.

టక్కర్ ఎగిరి గంతేశాడు. 'నాకు తెలుసు...నేననుకుంటూనే వున్నాను. ఈ కాలపు ఆడపిల్లలంతా యింతే! ఇలాంటి అఘాయిత్యాలకి పనికొచ్చే విషాలేవో వాళ్ళకి తెలుసు! మిస్ క్రిస్సీ, మిస్ క్రిస్సీ!' అని అరుస్తూ ఆమెను కుర్చీలో అటూ యిటూ కుదిపిచూచాడు. క్రిస్సీ కళ్ళు మూసుకుని స్థాణువులా వుండి పోయింది. టక్కర్ తలుపు దగ్గరకు పరిగెత్తి, 'సుసాన్, సుసాన్!' అని కేక వేశాడు. జవాబులేదు. అక్కణ్ణించి బయటికి పరిగెత్తాడు. అక్కడా ఎవరూ లేరు. తిరిగి గదిలోకి వచ్చాడు. క్రిస్సీ కదలా మెదలక వుండి పోయింది.

ఇప్పుడేం చేయాలి? పాపం, టక్కర్ బోటి కళాసుగాడికి రావలసిన సమస్యలు కావివి. తను డాక్టర్ కోసం వెళ్ళటమంటే, కెప్టెన్ యిచ్చిన ఆర్డరు ధిక్కరించట మవుతుంది. అట్లని వూరుకుంటే,

యిక్కడ అన్యాయంగా ఒక పిల్ల ప్రాణం ఎగిరి పోవచ్చు! ఏం చేయాలి? టక్కర్ మరో మారు క్రిస్సీని భుజాలు పట్టుకుని కుదిపి చూశాడు. బొక్కెన నిండా నీళ్ళు తెచ్చి ఆమె నెత్తిన పోశాడు. క్రిస్సీ కిమ్మనలేదు.

'ఇక యిక్కడ చేసేదేం లేదు, డాక్టర్ కోసం వెళ్ళాల్సిందే!' అంటూ టక్కర్ బయలు దేరాడు. తీరా వరండాలోకి వచ్చే సరికి అతడికి ఒకటో రకం ఉపాయం బుర్రలో కదిలినట్టయింది. అహాఁ అనుకుంటూ అతడు తిరిగి క్రిస్సీ వున్న గదిలోకి వచ్చాడు. క్రిస్సీ ఎప్పటి లాగే కదలా మెదలక కుర్చీలో పడి వుంది. ఆమెను గాజు సామానంత జాగ్రతగా చేతుల్లోకి ఎత్తుకున్నాడు టక్కర్. బయటి వరండాకేసి బయలుదేరాడు.

తీరా అక్కడికి వెళ్ళి తలుపు తీయ బోయే సరికి, యిట్టే తెరుచుకున్న తలుపు అంతలోనే ఠక్కున వెనక్కి పోయింది. క్రిస్సీ బరువుతో తికమకపడి పోతున్న టక్కర్‌కు, ఆ తలుపు అంత హఠాత్తుగా మూత బడడానికి కారణ మేమిటో వెంటనే అర్థం కాలేదు. మరో మారు రొప్పుతూ ఒక అడుగు ముందుకు వేసి తలుపు తీయబోయాడు. ఊహుఁ, కదల లేదు, కదలా మెదలక నిట్ట నిగుడుగా వున్న క్రిస్సీ శరీరంలో, ఒక్క కాలికి మాత్రమే కొంత చలనం వచ్చినట్టే కనబడింది. ఆ కాలు టక్కర్ తలుపు తీయబోయినప్పుడల్లా రవ్వంత ముందుకు పోయి ఠక్కున దాన్ని అదిమి పెడుతోంది.

టక్కర్ యీ వింతకు ఆశ్చర్య పోయాడు. అంతశరీరం కట్టెలా కదలా మెదలక వూరుకుంటే, యీ కాలుకేమి యీ అనవసరమైనపని అనుకున్నాడు. ఇలా ఆలోచిస్తూనే టక్కర్ మరికాస్త బలంగా తలుపుగుంజాడు. ఈసారి క్రిస్సీ రెండుకాళ్ళూ బలంగా తలుపును అదిమి పట్టినై. అప్పటికి కథ కాస్త అర్థమై తెల్ల బోతున్న టక్కర్ చెంపమీద, ఛెళ్ళుమని దెబ్బకూడా పడింది.

'ఛండాలుడా! ఏమిటీ నువ్వు చేస్తున్న పని?' అంటూ క్రిస్సీ అతడి చేతుల్లోంచి కిందకు జారింది. 'ఇంత చొరవా?' అంటూ కళ్లురిమింది. టక్కర్ చెంప సవరించుకుంటూ ఆశ్చర్యంతో మాట పెగలక నోరు తెరిచి అలా వుండి పోయాడు.

'నన్ను పలకరించావంటే...జాగ్రత! నువ్వు చేసినపని, ఆ చొరవా...నన్ను భుజాలమీదికి ఎత్తుకుని...ఎవరనుకున్నావ్?' అంటూ క్రిస్సీ పళ్లుకొరికింది.

'నేను నిన్ను డాక్టర్ దగ్గరకు మోసుకు పోతున్నాను. నీదంతా దొంగాటకం అని నాకెలా తెలుస్తుంది?' అన్నాడు టక్కర్ ఏడుపుమొహం పెట్టి.

'దొంగాటకమా?' అంటూ క్రిస్సీ ఆశ్చర్య పోయింది. 'నేను రోజూ సాయంత్రం వేళ యిలాగే నిదర పోతూంటాను,' అన్నది ముక్కుపుటాలు ఎగరేస్తూ.

టక్కర్ మాట్లాడకుండా తలవంచుకుని చిన్న చిరునవ్వు నవ్వుకున్నాడు. అంతా తెలుసులే అన్నట్టు నొసలు ఎగర వేశాడు. క్రిస్సీ వెళ్ళి కుర్చీలో కూర్చున్నది. తన తెలివితేటలకు తనే ఆశ్చర్య పడుతూన్న టక్కర్‌కి జేన్, సుసాన్‌లు

హడావిడిగా గదిలోకి రావటంతో ప్రాణం కడబట్టినంత పనైంది.

క్రిస్సీ వాళ్ళిద్దరికీ తనకు జరిగిన పరాభవమంతా ఏకరువు పెట్టింది.

'అన్నయ్యను రానీ...అంతా చెపుతాను. ఇంత పొగరా?' అన్నది జేన్.

'నాన్న అట్లా వాకిట్లోకి వచ్చేసరికి... ఎదురుపోయి, జరిగిందంతా చెప్పక మానను. అంత మదమా?' అన్నది క్రిస్సీ.

'నేనూ చెప్పక పోను! ఎంత తల బిరుసూ!' అన్నది సుసాన్.

టక్కర్ తల పంకించి జీరబోయిన గొంతుతో, 'నేనేమైనా తప్పు చేసి వుంటే అందరూ క్షమించాలి. ఏ పరిస్థితుల్లో, నేను అంత దుస్సాహసం చేయవలసి వచ్చిందో కెప్టెన్ గారికి నేనే నివేదించుకుంటాను,' అన్నాడు.

'నీ కాకమ్మ కథలు ఎవరు నమ్మతారు?' అన్నది సుసాన్.'

'మనుషుల్ని సామానుకున్నాడేమో యిటూ అటూ మోసుకు పోవటానికి?' అన్నది జేన్.

'ఇంతవయసొచ్చి కల్లిబొల్లికథలు చెప్పటం! వట్టి ఆడంగి రకం!' అన్నది క్రిస్సీ.

'మీరేగదా కెప్టెన్‌తో జరిగిందంతా చెపుతామంటున్నారు?' అంటూ టక్కర్ నివ్వెర పోయాడు.

'వెధవాయ్, దద్దమ్మ, దేభ్యం...' ముగ్గురూ వరసాగ్గా అనేశారు.

టక్కర్ అంతలో గుండె దిటువు చేసుకున్నాడు. 'ఇప్పుడు నాకు తెలుస్తోంది ... అర్థమవుతోంది,' అంటూ ప్రారంభించాడు. 'మీరు ముగ్గురూ కలిసి నన్ను ఇంటి బయటికి నడపాలని చూశారు! ఇదీ సంగతి!' అనేశాడు.

'మా నాయనే, ఎంత తెలివుందే నీ దగ్గిర; మొహంచూస్తే మొద్దబ్బాయ్ అనుకుంటారు గాని!' అంటూ సుసాన్ మెటికలు విరిచింది.

'నిండు కుండ తొణకదు!' అన్నాడు టక్కర్, సమయానికి ఆ సామెత గుర్తుకొచ్చి.

'ఎగిరే ఎద్దు ఎంత మోస్తుంది!' అన్నది క్రిస్సీ గుర్రుగా చూస్తూ.

టక్కర్ అప్పటికైతే పళ్ళికిలించి వూరుకున్నాడు గాని, తరవాత పరిస్థితంతా ఆలోచించుకుని బేజారెత్తి పోయాడు. అతడికి వొట్టికుండా, ఇత్తడి కుండా కథ గుర్తుకొచ్చింది. ఆ రాత్రి కేప్టెన్ రాగానే, కుండలు బద్దలు కొట్టినట్టు, తనని యిక్కణ్నుంచి స్టీమరు మీదికి పంపేయమని అడిగాడు. తన బుర్ర ఆడవాళ్ళని గురించి ఆలోచించేందుకు పనికి వచ్చేది కాదనీ, ఆ స్టీమరు మీదే ప్రాణం హాయిగా వుంటుందనీ చెప్పాడు.

'నీబుర్ర అమోఘం,' అన్నాడు కేప్టెన్ పోల్సన్ 'అటకలావున్న అంతపెద్ద తలకాయలో వుండవలసినంత మెదడు వున్నదని ఇప్పటిగ్గాని తెలిసిందే కాదు. బాధ్యత చక్కగా నిర్వహిస్తున్నావ్! నిజంగా నువ్వంటే నాకు ఎంతో గర్వంగావుంది' అంటూ ముగించాడు,పోల్సన్.

'మీ రప్పజెప్పిన బాధ్యత మగాడి వల్ల అయేది కాదు. ఏదైనా పొరపాటు జరిగితే నన్నుతిట్టి లాభంలేదు' అన్నాడు, టక్కర్

'పొరపాటులేమి జరుగుతై? ఎలానూ నాలుగైదు రోజుల్లో అందరం కలసి స్టీమరెక్క బోతున్నాం గదా! పైగా

ఇలాంటి బాధ్యత నిర్వర్తించేందుకు నీకన్నా నమ్మకస్తుడూ, సమర్థుడూ, నాకెవడు దొరుకుతాడు? నీ సంగతి మరిచిపోను... తెలిసిందా?' అని బుజంతట్టాడు పోల్సన్.

'అయితే సరే! పైవాళ్ళ ఆజ్ఞల్ని శిరసావహించటమేనా పని?' అన్నాడు టక్కర్ బిక్క మొహం వేసి.

ఆ మరసటి రోజు మామూలుగానే జరిగిపోయింది. ఏ హడావిడీ లేదు. రెండో రోజున క్తైెన్ పోల్సన్, పొరుగూరు పనిమీదపోతూ, బాధ్యతంతా టక్కర్‌కు ఒప్పచెప్పాడు.

పోల్సన్ అటువెళ్లగానే క్రిస్సీ టక్కర్ దగ్గరకువచ్చి, 'నేను కాస్త షికారుకు పోతున్నాను. నువ్వు నావెంట వస్తావా?' అని అడిగింది. టక్కర్ వెంటనే జవాబు చెప్పలేకపోయాడు.

అతడు మనసులోనే క్రిస్సీ వేస్తున్న ఎత్తులూ, వాటికతను ఎదురుఎత్తు వేసి భగ్నంచేయటం...అంతా ఆలోచించుకుంటున్నాడు.

క్రిస్సీ బయలుదేరింది. టక్కర్ హడావిడిగా టోపీనెత్తిన పెట్టుకొని ఆమె వెనుక నడవ సాగాడు. పెద్దబజారు దాటి, ఒకటి రెండు సందులు నడవగానే...ఇక అంతా పచ్చిక బయలు. క్రిస్సీ గబగబా నడవసాగింది. టక్కర్ ఆమె ననుసరించి రెండుమూడు మైళ్ళు నడిచేసరికి ఆయాస పడిపోయాడు. ఇక ఇంటికి తిరిగి వెళ్లడం మంచిదని క్రిస్సీకి చెప్పాడు.

'ఏం తొందర, యింకా బోలెడంత పొద్దుంది. ఆ కనబడే మైలురాయి చూసావా? కావాలంటే నీతో పందెం వేస్తా అక్కడకు నీకన్నా ముందుగానే చేరగలను' అంటూ క్రిస్సీ పరుగుచ్చుకుంది. ఏదో ఎత్తువేసింది అనుకున్న టక్కర్ కూడా పరుగుకు లంకించుకున్నాడు. మొత్తం మీద ఇద్దరూ ఒకేసారి ఆరాయి దగ్గరకు చేరారు.

క్రిస్సీ రొప్పుతూ, 'నువ్వు కూడా బాగా పరుగెత్తగలవ్ టక్కర్! సరే యీసారి చూద్దాం', అంటూ క్రిస్సీ వేగంగా నడువ సాగింది. కొంతసేపటికి మరో మైలురాయి కనబడగానే క్రిస్సీ పరిగెత్తేసరికి టక్కర్ కూడా, అలవాటు లేకపోయినా, రొప్పుతూ ఆమె వెనగ్గా పరుగెత్తాడు.

ఇలా మరి మూడు మైళ్ళు వెళ్ళేసరికి క్రిస్సీ పరిగెత్తే దల్లా హఠాత్తుగా కుంటుతూ ఆగిపోయి అక్కడున్న ఒక రాతిమీద కూలబడింది.

'ఏమైందీ, దెబ్బ తగలలేదు గదా?' అంటూ టక్కర్ ఆదుర్దాగా ఆమెదగ్గరకు పరిగెత్తుకువెళ్ళి అడిగాడు.


అభిస్సారిక

1954 జులైనుంచి, 1954 డిసెంబర్ వరకూ 6 సంచికల మొదటి బైండు రూ. 3-8-0.

1955 జనవరినుంచి, 1955 జూన్ వరకూ రెండోబైండు రూ. 3-8-0.

రెండు బైండ్లు ఒకేసారి కొంటే రూ. 6-0-0.

అభిసారిక కార్యాలయం,
మద్రాసు-17.

'అమ్మో, చీలమండ మెలి దిరిగింది! కంకర్రాయిమీద కాలువేశాను. అమ్మో బాధ!' అంటూ మూలిగింది క్రిస్సీ.

టక్కర్ ఏం చెయ్యాలో తెలీక కళ్లు మిటకరిస్తూ, పెదాలు చప్పరించాడు.

'నా చీలమండ విరగటానికి నువ్వే కారణం. అసలంత వేగంగా నువ్వెందుకు పరిగెత్తాలి?' అంటూ క్రిస్సీ కోపంగా టక్కర్ కేసి చూసింది. టక్కర్ జావగారి పోయాడు. 'ఏదోలే మిస్! పొరపాటు జరిగింది. నా భుజం పట్టుకున్నావంటే ఏదోవిధంగా యింటికి చేరుస్తాను.' అంటూ నీళ్ళు నమిలాడు.

క్రిస్సీ ఒకచేత్తో టక్కర్ భుజం పట్టుకుని బయలుదేరింది. దాదాపు ఒక మైలునడిచేసరికి, ఆమె ఎక్కడలేని ఆయాసంతో మూలిగి, రోడ్డుపక్కనే కూలబడింది. అంతలో బండిచక్రాల మోత విని బ్రతుకుజీవుడా అనుకుంటూ టక్కర్ అటుకేసి చూశాడు.

ఒక గుర్రపు బండీ అక్కడికి వచ్చి దిగింది. 'ఇంత యంగ్ లేడీకి, యీ అర్ధాన పడివిలో ఏం ప్రమాదంజరిగింది?' అన్నాడు బండివాడు.

'చీలమండ నెప్పి చేసింది. ఇంతకీ నీ బండి ఎటుకేసి పోతున్నది?' అని అడిగాడు టక్కర్.

'నేను అక్కనబడే ఊరికేపోతున్నాను. ఇది బాడుగ బండికాదు. మాయజమాని మకోర్ఫీ!' అన్నాడు బండివాడు.

'ఏం ఫరవాలేదు. మనం మనం సరిచేసుకుందాం' అన్నాడు టక్కర్ తెలివిగా.


క్రిస్సీ కుంటుకుంటూ పోయి బండి ఎక్కింది. టక్కర్ కూడా వెనక కూచున్నాడు. బండీ కదిలింది.

'మిస్టర్! నువ్వు కూచున్నచోట గడ్డి సరిగా లేదు. ఇదుగో యీ గోనెవేసుకూచో!' అంటూ బండీవాడు టక్కర్ కేసి ఒక గోనెపట్టా నెట్టాడు. టక్కర్ కొంచెం కదిలి, పట్టా పరుచుకునేందుకు ముందుకు వంగేసరికి, బండివాడి రెండు చేతులూ అతడి భుజంమీద బలంగాపడి, బండిలోంచి రోడ్డుమీదికి అతణ్ని గిరవాటువేసినై. మరుక్షణంలోనే గుర్రం సవారీ ఎత్తింది.

టక్కర్ రోడ్డుమీద బోర్లాపడి, వెంటనే కుప్పిగంతువేసి లేచి నిలబడ్డాడు. అప్పటికే బండి ఒక అర ఫర్లాంగు పరిగెత్తింది. తనను మోసగించేందుకు అంతా ప్లాను ప్రకారం జరిగిందని అతడు గ్రహించాడు. అయినా బాధ్యత...పరిగెత్తాలి తప్పదు.

టక్కర్ రొమ్ములు పడిపోయేలా పరిగెత్త సాగాడు. బండి కొంతదూరంవెళ్ళి తక్కున ఆగిపోయింది. ఏం జరిగిందా అని ఆశ్చర్యపోతూ టక్కర్ చూసేంతలో మరోవ్యక్తి బండి ఎక్కాడు. మొదట బండితోలుతున్నవాడు చర్నాకోలు ఆ రెండోవాడికిచ్చి, నవ్వుతూ వెనకకు వచ్చి క్రిస్సీ పక్కన కూచున్నాడు.

టక్కర్ తనలోవున్న సత్తువంతా వుపయోగించి పరిగెత్త సాగాడు. కాని బండిలోవున్న ముగ్గురూ అతడికేసి ఓ మారు చేతులువూపి, పక్కనవున్న మరో రోడ్డుకేసి బండిని పరిగెత్తించారు. కొద్దిసేపట్లో బండి టక్కర్ దృష్టికూడా ఆననంతదూరం వెళ్ళిపోయింది. దానితో కళాసు టక్కర్ బాధ్యతకూడా తీరిపోయింది! ★




ఈనాడు మనచుట్టూరా, అనేకపిల్లలు ఎందుకు పుట్టేరా అన్న ద్వేషంలో పెంచబడడం చూస్తాం. వీళ్ళందరూ కూడా, విముఖత, ద్వేషంలోవున్న తల్లుల సంతానమే అంటే అతిశయోక్తి కానేరదు. ఈ అంచంచలస్థితి, ఆ నాటి మానసిక చంచలత్వంవల్ల కల్గుతూ, ఓ విధమైన సృష్టిద్వేషం, అశాంతి, పగ అన్నవి మూర్తీభవించడం జరుగుతోంది. అంతర్గతంగా, విప్లవాత్మక భావాల్తో, సృష్టినాశనపు కోర్కెల్తో అటమటలాడే వాళ్ళందరుకూడా ఓ విపరీత సన్నివేశంలో ఉత్పన్నమయిన వారని చెప్పవచ్చు. ఈ నాటి విభిన్నపువృత్తుల్లో అంతర్గత పోరాటంతో కనిపించే భావాలన్నిటినీ సింహావలోకనం చేస్తే, ప్రాథమికంగానే ఓ అసహజ వాతావరణ గర్భజనితాలని తేలకమానదు. పైగా కురూపత్వం, లేక సరైన అవయవ నిర్మాణం లేక వుండడం తథ్యం. దీనివల్ల వాళ్ళకి ప్రపంచాన్నే, తమతోపాటు ద్వేషించడం అన్న బీజంతో వృద్ధిపొందడం జరుగుతోంది. వీటి కన్నిటికీ కూడా మూలవిరాట్టు, తల్లితండ్రులు సమభాగంగా సంతానం కోరుకోపోవడం అన్నది మర్చిపోకూడదు.

పైగా ఈ తల్లుల్లో, ఓ విధమైన భయం, ఆవేదన, గర్భధారణ అవగానే ప్రవేశించడం మన దౌర్భాగ్యం. ఆఖరుకు తల్లీ తండ్రీ, భర్తకూడా చెప్పని విషయాలు రహస్యంగా వుండి పోవడంతో, తన ఊహకు అందినంతవరకూ, చిలవలూ పలవలూ అల్లి ఇది ఓ గొప్ప ప్రమాదం అనుకోవడంవల్ల పతనం అవుతున్నాం.

'పదిహేను సంవత్సరాలు నా శరీరారోగ్యస్థితి ఏమీ బాగుండేది కాదు, ఈ సంవత్సర సంవత్సర కాన్పులవల్ల. ఒకటి పూర్తి అయ్యేసరికి రెండోది ప్రారంభించేది.'

'పురిటిరోజుల్లో యమలోకం అనుభవించాను. పది సంవత్సరాలు దాటిం తర్వాత ఈ స్థితి నాకు అక్కర లేదు జీవితంలో అనుకున్నా'

'మా అమ్మమ్మకి ఇరవై మంది సంతానం. అందులో ఎనమండుగురే జీవించేరు. ఇద్దరు మాత్రం షష్ఠిపూర్తి చేసుకున్నారు'

‘గర్భధారణ మొదలు, చెప్పేకష్టాలు ఇంతా అంతా కావు. వందలమంది స్త్రీలు చెప్పేమాటలవల్ల, ఇది స్త్రీ భరించవలసినది అనే నమ్మకంలోనే భరించేను. మూడు సంవత్సరాల్లో ముగ్గురు పిల్లలు, ఓసారి విచ్ఛిత్తి నాకు కల్గేయి’

ఈ విధమైన మానసిక భావాల్తో తల్లుల స్థితివుంది అంటే, వాళ్ళ సంతానంలో, కలిగే విచిత్రదృక్పథాలు వేరుగా చెప్పనక్కర్లేదు. ప్రతీ నరనరం, కణకణంలోనూ శిశువులో, ఓ విధమైన ద్వేషంతో బడబాగ్ని క్రిందనే వంశపారంపర్యం ఇవ్వడంతో, సంతానం దిగతుడుపుగా తయారవుతోంది. ఇది వొదులుతేనే కాని మనం బాగుపడలేమేమో?

రెండో విషయం పాలనుగూర్చి. ఈనాడు చూస్తే, నూటికి నలభైవంతులు తల్లుల్లో తప్ప తక్కిన వాళ్ళంతా కూడా అసహజ ఆహారాలమీద ఆధారపడవలసి వస్తోంది. ఎంత శాస్త్రోక్తంగా, జాగ్రత్తగా ఆ ఆహారాలు తయారు చెయ్యబడ్డా, తల్లిపాలతో సమానం కాదు. అయితే కొంతమందిలో, శిశువుకు కావలసినంత పాలు ఉండవు. అటువంటప్పుడు ఇచ్చినంత ఇచ్చి, ఇతరత్రా పాలు వాడడం మంచిది.

చెప్పాల్సింది, ప్రతీశిశువు తను శైశవం వదలందే, గాలికి విడవబడి, తర్వాత శిశుపోషణతో తల్లికి తీరుబడి లేకుండావుండడం కోరడు. సాధ్యమైనంతవరకూ, ఐదు సంవత్సరాల వయస్సు వచ్చేవరకూ, సంరక్షణ తల్లే చెయ్యాలన్న ఆశతోనే వుంటాడు.

పైగా ఈ కాలంలో నియమబద్ధంగా, పెంపు ఇవ్వడం ముఖ్యం. దీనివల్ల ఎదిగే శిశువుకు భావి జీవితంలో ఒక బాట ఏర్పడుతుంది.

మనం ఈనాడు, ఈ చిన్నతనంలో సరైన శుశ్రూషలేక, కోర్కెలు అణచబడి ఉండడంవల్ల, ఓవిధమైన ద్వేషంతో చూడ్డం ఉగ్గుపాలతో అలవాటవుతోంది. దానివల్ల వంశాంకురాలు కూడా పెడమార్గాలు త్రొక్కి, అధోగతికి దారి తీయటం జరుగుతోంది.

ఇది జరగకుండా ఉండడానికి శైశవ పెంపుదల కారణభూతం అవుతోందని, మాతృస్థానం వహించిన స్త్రీలు గుర్తించడం ఉత్తమం.

## శైశవం

చిన్నపిల్లలకు నీతులు చెప్పేసూక్తులు, కథలు, మనలో ఎన్నోవున్నాయి. ఇవి చెప్పడంవల్ల భావిలో వాళ్ళు మంచినడవడికకు అలవడుతారనే ఆశవుంది.

ఇతర విషయాలెల్లావున్నా, అన్నిటికి ఓ విధంగా ఆధారంగావుండే సెక్సుమీద ఉన్న అభిప్రాయం మాత్రం అజ్ఞానంలోనే వుండిపోవడం జరుగుతోంది. ఈ సెక్సు అన్నది, రేపు జీవితంలో వివాహం చేసుకునేటప్పుడు, స్త్రీల ఎడ దృక్పథం ఏర్పాటుల్లో, అటు వంశ పారంపర్యావచ్చే గుణం ప్రతి బింబించడమో, లేక చంచలత్వంలో అసలు జీవితాన్నే నిర్ణీతం లేక నడుపుకోవటమో జరుగుతోంది.

పెంపుదలలో కావలసినంత డబ్బు, సదుపాయాలుకల్గి, అవి ఇచ్చే సౌఖ్యాల్ని జల్సాలను పొందుతూ ఉండిన వాళ్ళల్లో, తల్లితండ్రులవల్ల తెలుసుకోలేక ఉండిపోయిన సత్యం ఈ విషయంలో కన్పిస్తుంది. ఇంక వాళ్ళకు గురువులుగా, ఏ

చెడిపోయిన తోడి కుర్రాళ్ళో, నౌకర్లో, చెప్పినవే వేదాంతాలుగా తీసుకొని ప్రవర్తించడం, అబద్ధాలు ఆడడం అలవడుతోంది.

దీనికితోడు, ఆ మిడిమిడి జ్ఞానంలో వుండగానే, వంశాంతపుద్వేషాలు, లోపాలు, విమర్శనలు ఎక్కువగా మాట్లాడడం వల్ల కొంతవరకూ సంతానం చెడిపోవడానికి కారణం అవుతోంది. ఈమాట్లాడే విషయాలు పెద్దలదృష్టిలో, చాలా చిన్న విషయాల క్రింద, యధాలాపంగానూ ఉండవచ్చు. ఓ విమర్శనలో, ఓ దృశ్యాన్ని మార్చాలన్న దృష్టిలో మనం తర్జనభర్జనలు చెయ్యడం, అల్లాగే ఈ వంశ పారంపర్యంలో ఎప్పుడో, ఎక్కడో ఏర్పడిన కుంటినడక, తరువాతి తరం వాళ్ళల్లోకి కూడా పాకటం జరుగుతోంది.

మనలోమనం మొట్టమొదట సారిగా అబద్ధం ఆడడం ఎక్కడ నేర్చుకున్నాం అనే ప్రశ్న వేసుకుంటే తేలే దేమిటి? తల్లి కాళ్ళమీద ఉన్నప్పుడే, జీవితంలో అబద్ధం ఆడడం నేర్చుకున్నాం అన్న సమాధానం రాకమానదు.

ఆ లేత వయస్సులో, శిశువుకు, బట్ట, ఆహారం, సౌఖ్యం, గురువు, అన్నీ కూడా తల్లే అన్న భావంలో వుంటాడు. అందువల్ల ప్రతీ చిన్న విషయానికి తల్లి ఏడుగడ అవుతుంది. దాంతోనే సమస్యల ప్రశ్నాపరంపర ప్రారంభం అవుతుంది. తల్లిని అనేక ప్రశ్నలు వెయ్యడం చూస్తాం. అన్నిటికీ ఏదోవిధమైన సమాధానం తల్లి జాగ్రత్త చేసుకునే వుంటుంది. కొంచెం వయస్సు ఎక్కువవగానే ఆనాన్నెక్కా దాచిన ప్రశ్న రావేస్తుంది.

'నన్నెక్కడనుండి తీసుకు వచ్చేవు?'

'ఎల్లా పుట్టేనే నేను?'

వీటి సమాధానం ఏ తల్లీకూడా సరిగ్గా ఇచ్చినట్లు కన్పించదు. దాంతోనే అబద్ధాలాడడానికి ప్రాతిపదికఅవుతోంది. 'నిన్ను డాక్టరుగారు సంచీలోంచి తీసుకు వచ్చేరు' 'దేవుడు నిద్రలో నా కిచ్చేడు' ఇల్లాంటివి చెపుతూనే, ఇంక కట్టుకథలకు దిగుతారు. ఈ కాకమ్మకథలు, మొదట్లో ఊకొట్టేటట్లు ఉన్నా, క్రమంగా నమ్మలేక, ఇంకొకళ్ళను అడగాలి, అడిగి తెలుసుకోవాలనే కుతూహలం చావదు. సాధారణంగా ఆ సమయంలో శిశువు, తను అడిగే ప్రశ్నకు, సదుత్తరమే ఆశిస్తాడు. దాన్ని అణకువతోనే గ్రహిస్తాడు. దాని సమాధానమే అబద్ధం అయితే ...ఇంకేం చెప్పాలి?

వంశం, పుట్టుక, వీట్లను గురించి తెలుసుకోవడానికి పడే ఆరాటన, శిశువుల్లో ఎక్కువగా కన్పిస్తుంది. ఈ పుక్కిటి పురాణ సమాధానం, సముచితం కాదన్న భావనకు అప్పుడే బీజం పడుతోంది.

దీనివల్ల, కూడావుండే, ఆయా, నర్సు, అత్త, అమ్మమ్మ, తాత వగైరాల సందరనూ ఈ ప్రశ్న వేయడం, వాళ్ళు చెప్పే సమాధానంకూడా విభిన్నంగా వుండడంతో, ఏది సత్యం అన్నది అన్న ఆలోచన వస్తోంది. దీన్నే తర్వాత జీవితంలో తర్జనభర్జనచేసినా, ప్రథమంగా అబద్ధం ఆడడం తల్లి దగ్గరనుండే నేర్చుకోవటం జరిగింది. ఒకక్కతల్లే కాకుండా తనను ఆత్మబంధువులందరూ మోసంచేశారు కదానని బాధ మిగులుతోంది.

ఈ విధంగా మన వాతావరణం కలుషిత మవుతోంది. జీవితాలు సక్రమ మార్గాల్లో పడక, పెడమార్గాలు పట్టి, అధోగతిలోకి వెళ్ళడం జరుగుతోంది. సంఘంలో, సెక్సు విషయం,—శరీరానికి గుండెలాంటిది-దీన్నిగూర్చి, విపులంగా, తెలిసేటట్లు, చెప్పడంలో పాపం, సిగ్గూ, న్యూనత, ద్వేషం ఏముందో తెలియటం లేదు. తెలుసుకోవడమే తప్పు అనుకుంటూ, ఆ పనినే చీకట్లల్లో చేస్తూ, సృష్టి సత్యాన్ని, అబద్ధాలుగా నేర్పుతూవుండే ఈ తల్లుల్ని ఏమనాలి? ఈ అబద్ధాలు తరతరాలుగా వొదలకుండా వెంటాడుతూనే ఉన్నవి.

ఈ నాటికి, ఈ సృష్టి రహస్యాల్ని చెప్పడం ఆలేత మనస్సులు తలిచేటంత మంచివి కావు అనే సమాధానం పొందుతాము. పైగా అవి వాళ్ళకు మానసిక సంచలనం కల్గిస్తుందంటూరు. కాని నిజం ఒప్పుకోవాలంటే, ఇది తప్పనాలి.

ఆ వయస్సులోని అమాయకత్వం, విజ్ఞానంలోని సత్యాన్ని యథాతథంగా నమ్మడం అనాలి. మూడు నాల్గు, ఐదు వత్సరాల వయస్సులో, ప్రపంచంలో కనిపించే ప్రతీదీ ఆశ్చర్యంగానే వుంటుంది. వాటి చైతన్యం యథాప్రకారమే స్వీకరించబడి నమ్మబడుతుంది. సత్యంతో కూడిన సమాధానాలు ఇవ్వడం వల్ల, వాటిని నమ్మడం, రేపు అదే సత్యాన్ని పలుచోట్లనుండి గ్రహించటంవల్ల, శిశువు సత్యాన్ని ఆచరణలో పెట్టటానికి అలవడుతాడు. ఆ కాలం వ్యక్తిత్వం, తలవంపు, తప్పూ ఒప్పూ అన్న విచక్షణా జ్ఞానమే వుండదు. ప్రపంచంలోని సృష్టి సత్యాలను యథాతథంగా స్వీకరించడమే తప్ప ఇంకొకటి ఉండదు.

ఈ కాలంలోనే తల్లి, శిశువును సంతృప్తిపరచి వుంటే, రేపు పెద్దయినా, ఆమెఎడ గౌరవభావం వదలుకోలేడు. సెక్సునుగూర్చి కూడా ఈ గురుభావం నిలబెట్టుకోడానికి, ఇతరత్రా తెలుసుకోనక్కరలేకుండానే, సరిపెట్టుకోగలడు; అంటే ఇతరులు బిడ్డను పెడమార్గాల పట్టించే అవకాశాలు ఉండవు. ఆదే యవ్వనారంభం అయిన తర్వాత, ఏదో తప్పిదం చేస్తున్నాం అనే బాధఉండదు; నిజానికి అది తప్పిదం కాదుగా!

ఈ చిన్నవయసులో ప్రతిబిడ్డా ప్రపంచాన్ని వెతకడం ప్రారంభిస్తాడు. అదంతా ఆతనికి ఓ ఇంద్రజాలంలా కన్పిస్తుంది. తనకాళ్ళు చేతులు, అవి కదలడం, రాళ్ళుపట్టుకోవడం, విసరడం, మన్ను తినడం, మొదలైనవన్నీ సహజమైనవిగా వుంటాయి. ఈ కాలంలో ప్రత్యేకంగా సృష్టి అంగాలవైపు కూడా మనస్సు తిరగడం సహజం. నిర్దుష్టంగా చెప్పాలంటే, రేపటి జీవితంలో స్త్రీ కాని, పురుషుడు కాని జీవిత దృక్పథం ఆ అంగాలమీద ఏ విధంగా వుంటుందో, ఆమె చెప్పే విపులీకరణ ఏమిటో, దానిమీదే ఆధారపడి వుంటుంది. ఏ పన్నెండో ఏడో వెళ్ళినతర్వాత ఒక్కసారిగా నూరిపోస్తే వాళ్ళకు మింగుడు పడదు.

అందువల్లనే ఏదో తెలియక బిడ్డ అడిగాడు; ఏదో వొక సమాధానం చెపితే తీరిపోతుం దనుకోవటం తల్లి బాధ్యతను ఏమరచటమేగాక, వేరొకరి బాటనవేలి కిందికి బిడ్డను వొదిలెయ్యట మవుతోంది. చిన్ననాటి భావాలు చాలా గాఢంగా

హృదయంలో హత్తుకుంటవి. కనుక నేబిడ్డ అబద్ధాలతో కాక, సృష్టిసత్యాలమీదనే పెరిగినట్లయితే, వాడి వ్యక్తిత్వంలో కూడా ఆ సత్యానికి తగినంత చోటు వుంటుంది.

అయితే ఈ చెప్పినదంతా వాళ్ళకు అర్థం అవుతుందా అన్న సంశయమూ కల్గవచ్చు. అది వాళ్ళకు అర్థంకాక పోవచ్చు. కాని దాని ప్రతిఫలం మాత్రం అక్కడ వుండనే వుంటుంది. మానసికంగా, శాస్త్రరీత్యా, ఈ చెప్పేవాళ్ళ ఎడ ఓ విధమైన గాఢనమ్మకం ఉండి పోవడంవల్ల, వాళ్ళు చెప్పినదాన్ని బట్టి, జీవిత విధానంవుండే అవకాశం ఏర్పడుతోంది. అందువల్ల ఈ నాటి అసత్యాల జ్ఞానమే అయితే, అది జీవితాంతం ప్రతిబింబించడానికి పునాది అవుతుంది.

దీని ఫలితంగా ప్రతీ తల్లీ గుర్తించవలసినది ఆ నాలుగు మొదలు ఆరు సంవత్సరాల వయస్సు వచ్చేవరకూ వుండేకాలం. బిడ్డ లేసే ప్రతీప్రశ్నకు సత్యంతోపాటు, అందంగా, అర్థం అయేటట్లు చెప్పడంలో, తల్లీ, తల్లిదండ్రుల బాధ్యత వుంది. సెక్సునుగురించి సిగ్గుపడవలసిన దేమీలేదు —సత్యం చెప్పడంలో వెనుదీస్తే, ద్రోహంచేసిన వారవుతున్నారని గుర్తుంచుకోవాలి.

పుట్టుక, సెక్సు అన్న విషయాంలోనే ప్రశ్నలు విచిత్రంగావస్తాయి. ఈ ప్రశ్నలకు ఏ విధంగా జవాబియ్యాలా అన్నది పచ్చి వెలక్కాయలా వుండవచ్చు. అయినా నిజం మాత్రం దాచకూడదు.

'అమ్మా నన్నెక్కడనుండి తెచ్చేరు?' ఈ ప్రశ్నే తీసుకుందాం. తల్లి ఈ సమయంలో, దాన్ని కప్పిపుచ్చడానికి ప్రయత్నించడం శిశువులోవున్న ఆతృత, సత్యాన్వేషణను క్రూరంగా నలిపివేయడం అవుతుంది.

'దేవుడు, నాన్నారు, నేను కలసి నిన్ను కావాలని, తయారుచేసేం' అనే సమాధానం ఇవ్వొచ్చు.

'దేవుడు సహాయంచేసేడా? ఒక్కడేనా—ఇంకా ఎవరేనా వున్నారా?'

'నువ్వూ నేను చింతగింజలు ఏరినపుడు నువ్వూ ఏరేవు. నేనూ ఏరేను. అన్నీ నువ్వు ఏరేవా? లేదు. నాకు సహాయం చేసేవు కాదూ?-నాన్నా, నేను కలసి నిన్ను తయారుచేయడంలో దేవుడు సహాయం చెయ్యమన్నాడు. అందువల్ల, మేం, నువ్వు నాకు సహాయం చేసినట్లే చేసేం'

ఆ విధంగా చెప్పవచ్చు. ఈ సమయాల్లో, ఆకాలాల్లో వాళ్ళు ఆడేఆటలు వగైరాలను ఉపమానంగా తీసుకురావడంలో, చెప్పింది తేలిగ్గా మనస్సుకు హత్తుకోవడానికి వీలవుతుంది. ఆ సమయంలో ఇంకో విషయంమీద మాటలు రావచ్చు. కాని వాళ్ళల్లో ఈ చెప్పిన దానిని గూర్చి ఆలోచన పోదు. మళ్ళీ ప్రశ్నవస్తుంది.

'అమ్మా, నేను ఎప్పుడు పుట్టేనే?'

'నీ పుట్టినరోజు ప్రతీ జనవరి నాల్గో తారీఖున వస్తుంది. ఇదే నువ్వు పుట్టిన సమయాన్ని జ్ఞాపకంచేస్తుంది. ఒక్కొక్క పుట్టినరోజుతో నువ్వు ఒక్కొక్క సంవత్సరం పెద్దవాడవు తున్నావ్'

'ఇప్పుడు నాకు ఐదేళ్లు-అవునా?'

'ఐదేళ్ళక్రితం, నీ పుట్టినరోజున పుట్టేవన్నమాట!'

'ఆ పుట్టుక పూర్వం నేను ఎక్కడ వున్నాను?'

'నీకు జ్ఞాపకంలేదూ, దేవుడు సహాయంతో నాన్నా, నేను నిన్ను తయారు చేసేం'

'అవును. అయితే ఆ పుట్టిన రోజూనే నువ్వు నన్ను తయారుచేసేవా?'

'లేదు. నిన్ను తయారు చెయ్యడానికి చాలా రోజులుపట్టింది'

'నేను తయారవడానికి ఎన్ని రోజులు పట్టింది?'

'చాలా కాలం. చిన్నపిల్లలు దేవతలు. వాళ్లు తయారవడానికి చాలా రోజులు పడుతుంది. త్వరగా తయారు చెయ్యలేం'

'ఎన్నిరోజులు పట్టింది?'

'రమారమి ఓ సంవత్సరం...'

'అయితే చిన్నపాపాయిలు అంత కాలం తీసుకుంటారా?'

'అవును'

'ఇప్పుడు నేను పెద్దవాడని కానూ?'

'అప్పుడు పాపాయివి. ఇప్పుడు పుట్టిన రోజులతో పాటు ఎదిగి పెద్దవాడి వయ్యేవు'

దీంతో సంభాషణ ముగియవచ్చు. కాని తల్లి మాత్రం మర్చిపోకూడదు— దీం తర్వాత ఇంకా ప్రశ్నలు వస్తాయని. అవి రాకమానవు కూడాను.

'పుట్టడం అంటే ఏమిటి?'

'ఈ ప్రపంచాన్ని, అమ్మనీ, నాన్ననీ, మొట్ట మొదటసారిగా చూడ్డం అన్న మాట. దేవుడు, నాన్నా, నేను ఆ తొమ్మిది నెలల్లోనూ తయారుచేసిన తర్వాత, నువ్వు ఈ ప్రపంచాన్ని చూడ్డానికి, కళ్లు తెరవడానికి సిద్ధమై వుంటావు. పాపాయిలా తయారవుతావు. అప్పుడు పుడతావు.

'అయితే నువ్వూ, నాన్నా, దేవుడు, తయారుచేసే టప్పుడు, పుట్టక పూర్వం ఎక్కడున్నాను?'

'అమ్మ నిన్ను ఎవళ్లూ చూడకుండా దాచేసింది'

'నన్ను ఎక్కడ దాచేసింది?'

'నువ్వు ఓ దేవలోకంలో దాచెయ్య బడ్డావు. అక్కడ చిన్నపాపాయిలే వుంటారు. వాళ్ళందరూ కూడా దేవుడు, అమ్మ తయారు చేస్తున్నపుడు అక్కడ దాచబడుతారు'

'ఎక్కడో చూపించు. నాకు మళ్ళీ అక్కడ దాక్కోవాలని వుంది'

'అక్కడకు నువ్వు వెళ్ళలేవు. నువ్వు తయారవుతూన్నప్పుడే అక్కడ వుండ గలవు. నీ మొదటి పుట్టినరోజు తర్వాత మళ్ళీ అక్కడకు వెళ్ళడం వుండదు'

'నేను ఎక్కడున్నాను?'

'నీకు తెలుసుగా—చిన్న పాపాయిలు తయారయ్యేటప్పుడు చాలా సుకుమారంగా వుంటారు. అందువల్ల, వెచ్చగా, మెత్తగా వుండేచోట వుంచాలి. పైగా ఎవరూ చూడకూడదు. వాళ్ళమ్మకి దగ్గరగా వుండాలి—కనపడకుండా.'

'నాన్నకు కూడానా?'

'అవును! నాన్న నిన్నుప్రేమిస్తుంటే అమ్మకి దగ్గరగా వుంటావు. అయినా పాపాయిని తయారుచేస్తున్నపుడు, దేవుడే, అమ్మకు దగ్గరగావుండి, అన్ని పనులూ చేస్తాడు. అందుచేత అమ్మంటే ఎప్పుడూ ప్రేమించాలి'

దీనివల్ల కొంతవరకూ శిశువు తృప్తి చెందవచ్చు. లేకపోతే...

'తయారవుతూన్నప్పుడు నేను ఎక్కడ వున్నాను?'

'ఎక్కడైతే వెచ్చగా, మెత్తగా, భద్రంగావుండే చోటో అక్కడ...నా గుండెలదగ్గరగా. అది అంతా ప్రేమతో నిండివుంది. నువ్వు తయారయ్యేటప్పుడు, నా గుండెలకు దగ్గరగా దాక్కొన్నావు.'

'గడియారంలా టిక్కు టిక్కు మంటుంది-దాని దగ్గరగానా?'

'అవును. ఇక్కడా?' అని తల్లి చెప్పడంతోపాటు చూపించడంకూడా ఉత్తమం అవుతుంది. 'దీనికి దగ్గరగా-లోపల, అమ్మ నిన్న దాచుకుంది. దేవుడు సహాయం చేస్తుంటే పెంచింది.'

ఈ ఉదహారణగా యిచ్చిన ప్రశ్నలు, దాని సమాధానంకూడా, శిశువుకు ఎంతో ఆనందంగా, ఆశ్చర్యంగా వుండవచ్చు. వీట్లమీద ఆలోచిస్తాడు. వాళ్లు ఆలోచించకుండా వుండనూ లేరు. దాని ఫలితంగానే 'అమ్మా! అయితే నేను నీలో వున్నానన్నమాట-అప్పుడు అంటూ తల్లిని కౌగలించకుని, ఆరాధనలో తల్లి వైపు చూస్తూ ప్రేమించడం జరగనూ వచ్చు. ఇంత కంటె తల్లి నేర్పే పాఠం లేదేమో?

అల్లా ఆలోచించటమే ఓ విధంగా గర్వకారణం అవవచ్చు. 'అందుకే నువ్వంటే నాకు ప్రేమ' అని తల్లి ఒళ్లో కూర్చుని చిన్న చేతుల్తో ముద్దు పెట్టుకోవచ్చు.

దీంతోపాటు క్రమేణా ఈ రహస్యం గూర్చి ఎవళ్ళతోటీ చెప్పకూడదని, ఇంకా ఏమైనా కావలిస్తే తననే అడగాలని, ఏ అనుమానాల్ని అయినా, నాన్నను కాని అమ్మని కాని అడిగి తెలుసుకోవాలని చెప్పవచ్చు.

అయితే శిశువు మానసిక పరిణామం విచిత్రంగా వుండటం వల్ల, ఈ ఆశ్చర్యంలో, అవే ప్రశ్నలు విభిన్నంగా రావడం తథ్యం. అయినా ఓర్పుతో వాటికి సత్య దూరం కాకుండా, సమాధానాల్ని కేంద్రీకరించడంవల్ల, బిడ్డ మనస్సుమీద హత్తుకోడానికి తావువతుంది. ఇన్నిసార్లు చెప్పడం ఏమిటని, సర్వ సాధారణంగా, కాకమ్మ పిచికమ్మ కథలు చెప్పడం ప్రారంభిస్తారు. అయినా ఆ సమయంలో శిశువుకు, జన్మ హక్కులాగే, ఈ పుక్కిటి కథలు, సత్యం అన్న విషయాల విచక్షణ ఏర్పడివుంటుందనే విషయం మర్చి పోకూడదు.

ఈ వయసు హెచ్చయిన కొలదీ ఆ చిన్ననాటి ప్రాతిపదికమీద, అనేక రకాల ప్రశ్నలు వస్తాయి. పన్నెండు వత్సరాల వయసులో వేసే ప్రశ్నలు, దాంతర్వాతవి కూడా, ఓనాటి సత్య ప్రణాళికకు ప్రాతిపదిక అవడంవల్ల, వాటిని విస్మృతంగాచేసి చెప్పడం, ఓ మంచి దారిలో వాళ్ళని వొదలడం వల్ల, తప్పు, సిగ్గు అనేవి కల్పించకుండానే, సర్వ సాధారణమైన విషయాలుగా చెపితే, ఇతర అనుమానాలుండవు.

ఒక్క విషయంమాత్రం గుర్తుంచుకోవాలి. సెక్సు విషయంలో మాత్రం ఎంతవరకూ సత్య సంధతనే అనుసరించటంవల్ల, అందులోని నిగూఢతను అర్థం చెయ్యడంవల్ల, జీవితాలు సరైన పంథాలోకి వచ్చుటకు ఎంతైనా అవకాశం వుంటుంది. కాని, దాచిపెట్టడంవల్ల, మనస్సులు కుళ్ళి, వెడమార్గాలు పట్టడం తథ్యం.

ఈ శైశవంనుండే, అడిగే ప్రశ్నలకు, రహస్యం, సిగ్గూ అన్నవి లంకె పెట్టకండి. పెట్టేరో, మీ సంతానానికి మీరే

ఊరిగ్రాడు తగులుతున్నారన్నది మాత్రం మర్చి పోకండి.

ఇప్పటికైనా కళ్లు తెరుస్తారా?

★

## శిశు మరణాలు

మూడు తరగతుల జీవనాలను సమీక్షిస్తే, పాటక జాతి జనంలో శిశు మరణాలు ఉన్నత, మధ్య, తరగతుల్లో కంటె ఎక్కువగా వుందంటే అతిశయోక్తి కాదు. పైగా శిశు సంపత్తి కూడా సరాసరి తీసుకుంటే, ఈ ఆఖరి వర్గపు జనంలోనే ఎక్కువగా వుంటుంది. బీదరికపు జీవనం, శ్రామిక వర్గం అవడం మూలాన్ని, అర్ధాకలిలో కొందరు, పరిశుభ్రత లేక వ్యాధుల్తో కొంతరు, ఏటేట కాన్పులవల్ల తగినంత పోషణ లేక మరి కొందరూ, ఆ వర్గంలో మృత్యువాత పడుతున్నారు. సరాసరిగా ఈ శ్రామిక వర్గంలో ఒక్కొక్క శిశు మరణంవల్ల, ఆ కుటుంబం ఎంత నష్ట పడుతోంది అన్న విషయాన్ని పరిశీలిస్తే, తిండి బట్టల లేమితో దిన బత్యం గడవక ఒకపక్క కుటుంబీకు లందరూ బాధపడుతూనే వుంటారు. యీ ఉన్న వారికే తగినంత తిండి లేనప్పుడు, కొత్తగా కుటుంబంలోకి దిగుమతయ్యే వారికి ఆహ్వానమంటూ ఉండదు సరికదా, ఏవగింపుకూడా ప్రారంభమౌతుందంటే ఆశ్చర్యమేమిటి? ఇక తల్లి మాత్రం, తగినంత పాలులో శరీర దారుఢ్యాలు సన్నగిల్లి, ఆరోగ్యం కోల్పోయి, వ్యాధులకు క్రమేణా గురి అవుతూ వుంటుంది. వొద్దనుకుంటూనే లొంగి పోతున్నారు. కారణాలు-అజ్ఞానం, భర్త ఎడ వుండే, భయం, పైగా తెలుసుకోవాలన్న ఇచ్ఛవున్నా ప్రక్రియ తెలియందిగానే వుండిపోయింది. అందువల్ల, ఈ వ్యాధులు సంక్రమించిన భర్తలవల్ల అణచపడి వుండడం మరో కారణం అవుతోంది.

ఇంకో విధంగా తృప్తిపడదామని డాక్టర్ల దగ్గరకు పోయినా, సుఖవ్యాధుల సంగతి దాచిపుచ్చి, సంసారాలు చెయ్యమని చెప్పడంతో సమాప్తి అవుతోంది.

అయితే వీట్లనుతగ్గించే మార్గం ఏమిటి అంటే, సెక్సును గురించి, రహస్యంగా వుంచుకున్నంత కాలం, ఆరోగ్య సూత్రాలు అవలంబించనంతకాలం, ఈ క్రూరశాపం మనకు తప్పనిసరి అవుతోంది. అందువల్ల, ప్రభుత్వం, కళాశాలల్లో, ప్రచారంద్వారా శాస్త్ర విజ్ఞానాన్ని పల్లెపల్లెల్లోకి, వెళ్లేట్లు చెయ్యడం, తల్లి కాబోతూన్న సంసారికి ఆరోగ్యవంతంగా సంతతి కల్గుటకు ఉపయుక్తంగా, వాయిదాలమీద చెల్లించుకునేటట్లు అప్పులివ్వడం, శిశువు సంవత్సరం వయస్సువచ్చేవరకూ ప్రభుత్వ పోషణలోవుంటూ, నెలనెలా పరీక్షించబడి, కావలసిన సదుపాయాలు పొందడం, ఊరూరా శిక్షణ పొందిన మంత్రసానిని వుంచుతూ, ప్రత్యేకంగా ఈ మాతృత్వాన్ని పొందే తల్లుల్ని చూస్తూ వుండడానికి ఏర్పాట్లు, భార్యాభర్తల్ని పరీక్షించి సంసారానికి తగుదురా అన్న విచక్షణ చెయ్యడం, మొదలైనవన్నీ ఎదురుచూస్తున్న ఈనాటి ఆశలు. అవి సఫలం అవుతాయా లేదా, సఫలం అయేటట్లు చూడ్డం, యీనాటి అభ్యుదయ

భావాలు కల యువతీయువకుల లక్ష్యం. ఈ చైతన్యం వొస్తుందన్న ఆశను మాత్రం ఒదులుకోలేం; కళ్ళారా శిశు మరణాల ఆవేదనలు చూస్తే, గుండెల మీద కుంపటిలాగనే వుండిపోయింది.

ప్రభుత్వంకూడా బాధ్యత వహించి, దేశాభ్యుదయానికి నడుం కట్టవలసిన అవసరం ఎంతైనా వుంది.

★

## పుట్టుక

ఇంత వరకూ, గర్భధారణ, అంగాంగాల పోషణ, కష్టాలు, సమస్యలు, చైతన్యం వగైరా విషయాలను గురించి చర్చించుకున్నాము. ఇంక పుట్టుక అన్న విషయంలోకి వద్దాం.

పురుడులో ఉన్న కష్టాలు, ఆ స్త్రీ ప్రవృత్తి, ఆకృతినిబట్టి వుంటాయి. రెండో ప్రకరణంలో (సంయుక్తత) చాలా వరకు పీటి విషయం చెప్పబడినట్లుగా, స్త్రీ మీద ఇది ఎక్కువగా వుంటుంది. అది ఆ సమయంలో భరింపరానిదిగానే వుంటుంది. అనేక పుక్కిటి పురాణాలు ఈ బాధా నివృత్తి కొరకు చెప్పబడి వున్నాయి; అయితే వాటివల్ల తల్లి పడే బాధలు ఏ విధంగానూ తగ్గవు.

శాస్త్ర విజ్ఞానం పెంపొందిన కొలదీ, ఈ నొప్పులు, బాధలు లేకుండా కాన్పులు, వాటికి మందులూ జనించేయి. మొట్టమొదటగా క్లోరోఫారం ఇచ్చి పురుడు పోయడం. ఇందువల్ల, శరీరం పూర్తిగా చైతన్య రహితమై నిర్జీవత్వంలోకి వెళ్ళడం జరుగుతోంది. పైగా దీని ఉపయోగం, ఆ అంత్య దశకు ముందుగా రెండు మూడు రోజులు ఇవ్వడం, కష్టసాధ్యం కూడాను. ప్రత్యేకంగా దీనివల్ల స్పృహ లేక పోయినా, ఘంటల తరబడి ఈ చికిత్స, మానసికంగా, ఓ అష్ట దిగ్బంధనం చేసినట్లుగా వుంటుంది. ఈ మత్తు కొంతమందిలో భరించరానిదికూడా అవుతోంది.

సర్వ సాధారణంగా, బాధారహితమైన కాన్పు కావాలని ప్రతీ స్త్రీ కోరుకుంటుంది. అది ఆశించడం సృష్టి సహజం. డాక్టర్ ఏలిస్ స్టాక్‌హామ్, తేలిక కాన్పులకు, ఎక్కువగా ఆ నవ మాసాల్లోనూ, పళ్ళు, బియ్యపు ఆహారం, చాలా సహాయపడగలదనీ, ఆ నొప్పులను సాధ్యమైనంత వరకూ సులభసాధ్యం చెయ్యడంలో ఉపయుక్తమవుతుందనీ, అయితే సృష్టి సహకరణలూ, శిశువు తల మాత్రం ఆ ఎముక (పెల్విక్) కైవారం కంటె పెద్దదిగా వుంటే అది దుర్భరంగానే తయారవుతుందనీ అంటోంది.

ఒక్కొక్కప్పుడు పురుడు, ఏ విధమైన రక్త స్రావం లేకుండానే కలగడానికి ఆస్కారం వుంది అని శాస్త్రం చెప్పినా, అది ఉదాహరణ పూర్వకంగా ఎక్కడా జరిగినట్లు కన్పడటం లేదు.

'గోధూళికా వేళ నిద్ర (Twi-Light Sleep) అన్నది ఈ మధ్య కనుగోబడినదే అయినా, దానివల్ల గర్భవతికి చాలా ఉపయుక్తంగావుంటుంది. అయితే ఇది ఆచరణలోకి వచ్చేసరికి, ఏ నర్సింగ్ హోమ్ లోనో వెళ్ళితేనే కాని సాధ్యం కాని విషయం. ఈ నిద్ర, విశ్రాంతి కావాలని కొంత మంది మందులు వాడడం అలవాటు చేసుకుంటున్నారు. ఇల్లాంటివి తత్కాలికంగా నిద్రనిచ్చినా, శిశువు

మీద భిన్నంగా ప్రవర్తించి ఆరోగ్యం పాడు చెయ్యడానికి దోహదం అవుతు న్నాయి.

పురుడు పోసుకోవడంలో ఇంకో విధానంగూడా వుంది. మెత్తటి శరీర భాగంలోంచి, ఆ ఎముకనుండి కాకుం డా, శిశువును బయటకు తియ్యడం. దీన్నే సిజేరియన్ ఆపరేషన్ అంటారు. ఇందు లో ఒక్క పొత్తి కడుపు భాగం కాకుండా, యోని గోడులనుకూడా చీల్చ వలసి వస్తోంది. అందువల్ల ఈ పెల్విక్ ఎముకయొక్క ద్వారం ఎవరిలో చాలా చిన్న వ్యాసంతో వుంటోందో వాళ్ళకు ఈ విధమైన కాన్పు తప్పనిసరి అవు తోంది. ఇదే ఆపరేషన్ పద్ధతిలో పురుడు పోయడం.

బ్రిటిష్ మెడికల్ జర్నల్ ఓ సారి ఓ విచిత్రమైన కాన్పునుగూర్చి వ్రాసింది. ఓ స్త్రీ, ఆమె గర్భవతి అని తెలియ గానే, ఆ కాన్పు సమయానికి అతి స్వనా యాసంగా శిశువును కని కూర్చుంది. అంతకాలం ఆమె, ప్రతి నెలా బహిష్ఠు అవుతూనే వుంది; ఆమె పెల్విక్ రంధ్రం ఎక్కువ పెద్దదిగా వుండడంవల్లా— బహిష్ఠు అన్నది, సర్వ సాధారణంగా గర్భోత్పత్తి అయినప్పటినుండి కనిపిం చకపోయినా, ఈ చిహ్నం అసహజం కూడా కాదు కనుకా తెలియకనే ఉంటూ, అతి సులభంగా పురుడుపోసు కోడానికి ఆస్కారం కలిగింది!

ఒక్క పిచ్చిపుల్లాయి వేదాంతం, నమ్మకం మనలో ఇంకా వుంది. కాన్పు లో ఆ యమలోక బాధను పూర్తిగా పొందితేనేకాని, శిశువుమీద పూర్తి ప్రేమ ఆమెకు ఏర్పడదు అన్నది...ఇది వట్టి మూఢ నమ్మకం అనాలి. శిశువుమీద ప్రేమ అన్నది, ఆవిడ మనసా, వాచా, శిశువు కావాలన్న కోర్కమీద ఆధార పడివుంది. పైగా ఆ నెలల్లో ఆ భావన ఉద్దీపనలో వుంటుంది.

సర్వసాధారణంగా ఈ గ్రుడ్డు పొదగ బడడం, బహిష్ఠు అయిన వారంరోజుల్లో జరుగుతోంది. ఇదే తర్వాత జరిగివుంటే, ఆ మోసేనెలల కాలంకూడా ఎక్కువవు తోంది. బహిష్ఠు ఆగిన ఆ వారంరోజు ల్లోనూ గ్రుడ్డు, గర్భంలోని పైభాగంలో, పురుషబీజం కోసం నిరీక్షిస్తూ వుండడం జరుగుతుంది. ఇదే రెండువారాల తర్వాత జరిగివుంటే, తారుమారుగా, పురుషబీజం గర్భంలో ప్రవేశించి గ్రుడ్డుకొరకు వేచి వుండడం జరుగుతోంది. అందువల్ల ఇటు వంటి గర్భధారణల కేసుల్లో, మోసే నెలల కాలం ఎక్కువగా వుండడం సహజం అవుతోంది.

గ్రుడ్డు వయస్సు నిర్ణయం చేయుటకు, సాధారణంగా గత బహిష్ఠు ఆఖరిరోజు లగాయితు లెక్కపెట్టడం ఉపయుక్తం.

ఏది ఎల్లావున్నా సరాసరి మీద ఈ కాలం 280 రోజులు (40 వారాలు) పడు తుంది అనాలి. ఆ మొదలు పొదగబడిన దగ్గరనుండి,భూపతనం అయ్యేవరకూ, ఇది ఆ బహిష్ఠు మొట్టమొదటి రోజునుండీ లెక్కవేస్తే. సంయుక్తత జరిగి నప్పటి నుండీ లెక్కవేస్తే 269 రోజులకాలం పడుతుంది.

ల్యాకొర్టు అనే ఆయన ఆ కాన్పుల సరాసరి రోజులను సమీక్షించేడు. అం దులో ప్రత్యేకంగా వివాహమై కాపు రం చేస్తున్న కేసుల్నే తీసుకుంటే, 275 వ రోజు పురుళ్ళు ఎక్కువ శాతంలో

వున్నాయని, దాంతర్వాత వీటిలో తగ్గుదల కొన్పించి, 293 వ రోజున మళ్ళీ హెచ్చుగా వున్నాయని చెప్పేడు. దీని వల్ల, ఏరోజు పురుడు వస్తుంది అన్న విషయం నిర్ధారణగా చెప్పుటకు వీలు కాని విషయంలా కన్పిస్తోంది. ఈ విషయంలో ఒక్కొక్కసారి తల్లి చెప్పే రోజునే పురుడురావడం, డాక్టర్ల మాట వమ్ము అవడంకూడా తథ్యం.

నిర్ధారణగా ఏరోజు పురుడు వస్తుంది అన్న విషయం తెలుసుకోడానికి, బహిష్టు అయినతేదీ తర్వాత, మొదటి రతి జరిగిన తేదీ గుర్తుంచుకొని, దాంతర్వాత నెలలో బహిష్టు లేకపోతే, ఆ తేదీనాడే గుడ్డు పొదగబడినదని నిర్ధారణ చేసుకోవడం మంచిది. దానినుంచి ఫాపీస్, గాలబిన్ ఆధారంగా తయారుచేసిన లెక్క ప్రకారం, పుట్టే తేది నిర్ధారణకు సులభ సాధ్యం అవుతోంది. అదే ఈ క్రింద పొందుపరచబడింది.

| చివరిబహిష్టు తేదీ | | కాన్పు తేదీ |
|---|---|---|
| జనవరి, 1 | ... | అక్టోబర్, 5 |
| ఫిబ్రవరి, 1 | ... | నవంబర్, 5 |
| మార్చి, 1 | ... | డిసెంబర్, 3 |
| ఏప్రిల్, 1 | ... | జనవరి, 3 |
| మే, 1 | ... | ఫిబ్రవరి, 2 |
| జూన్, 1 | ... | మార్చి, 5 |
| జులై, 1 | ... | ఏప్రిల్, 4 |
| ఆగష్టు, 1 | ... | మే, 5 |
| సెప్టెంబర్, 1 | ... | జూన్, 5 |
| అక్టోబర్, 1 | ... | జులై, 5 |
| నవంబర్, 1 | ... | ఆగష్టు, 5 |
| డిసెంబర్, 1 | ... | సెప్టెంబర్, 4. |

ఈ లెక్కలు ఉజ్జాయింపుగా ఎదురుచూడవలసినవే కాని ఖచ్చితమని చెప్పలేము. అనేక కారణాలవల్ల గర్భ ధారణ కాలం తగ్గనూవొచ్చు; హెచ్చనూవొచ్చు.

★

## వంశం

తల్లి దండ్రుల అన్యోన్యానురాగంతో వృద్ధి పొందుతూ, శిశువు భావి, వంశం నిలబడ్డానికి ఆధారమవుతోంది. ఒక్క సంతానం కలిగింది అన్న దానితోనే అంత్య మవక, వాడి పోషణ, పెంపు, వృద్ధి అన్నీకూడా క్రమంగా వచ్చే సమస్య లవుతాయి. పైగా ఓ గురుతరబాధ్యత దానికి తోడుగా, సరియైన పోషణకు తట్టుకోవడం, సరిపడని సంగతులవడం ఈనాడు మనం చూచే విషయం. వచ్చే జీతాలు, కూలి, సరిపోక, పెంపు ఇవ్వక, ఆఖరుకు శ్రామిక వర్గంలో పదో సంవత్సరం రాకుండానే కూలికి దిగడం, ఇక మధ్య తరగతిలో చదువు అసంపూర్తిగానే వుండి, చేసేదేమీలేక, ఏ కొద్ది జీతానికో బానిసత్వానికి దిగడం, సాధారణ విషయం. అయితే దీనికి ప్రత్యామ్నాయంగా ధనికులు పిల్లలకోసం అటమటించడంకూడా చూస్తూనే వున్నాం.

ఇదైనా ప్రతీ భార్యాభర్త కోరుకున్న ఉన్నతా అంటే—కాదు. ఆ కల కలగానే వుండి, కాలం గడిచిన కొలదీ పటాపంచలై ఆఖరుకు పొట్టనింపుకోవడం అన్నదే సమస్య అయిపోయి, సంసారం నిస్సారమై పోతోంది.

ఆర్థికంగా తక్కువస్థాయిలోవున్నా సంతానం మాత్రం, వందలూ వేలల్లోకి విజృంభిస్తూ, బానకడుపుల్తో పాటు

కాళ్ళతో, రుగ్మతపూరితులై స్మశానాల్లో సగానికిపైగా సమాధులు కట్టుకుంటూ, మిగిలిన సగం, ఆస్పత్రుల్లో మ్రగ్గుతూ, తిరిగితిరిగి వంశాభివృద్ధి చేస్తూనే వున్నారు. ఇటువంటివాళ్ళ సంతానం, దేశానికి వెన్నెముక కాకుండా, బాకు పోటవుతోంది. ఇంక ఈ ఉదరపోషణార్థం, ప్రక్కదారులు తొక్కుతూ, జైళ్లల్లోకి చేరడమో, లేక పెట్టుబడిలేని వ్యాపారంలా ముష్టివాళ్ళక్రింద తయారవడమో జరుగుతోంది.

ఇంక ప్రథమ వర్గపు సంతానాలు తిండి తినలేక, తినకల్గినా వ్యసనాలకు లోబడి, ఆఖరుకు పతనమై జీవితాన్ని గడుపుతూ వ్యాధిగ్రస్థుల్ని కనటంగా పరిణమిస్తోంది.

ఇదేనా, దేశం ఉన్నతికి కావలసింది అంటే, ప్రతీవాళ్ళూ కాదంటారు. నాయకులు వేదికలు ఎక్కి, కంఠం బొంగురుపోయేవరకూ వాగ్ధాటితో కుస్తీ పడతారు. కావలిస్తే మన పూర్వుల చరిత్రలు స్మరించుకోమంటారు. అశోకుని కాలం ఆదర్శం అంటారు. ఆరోగ్య సూత్రాలు అమల్లో పెట్టాలంటారు...కాని మనం అల్లాగే వున్నాం.

కారణం ఎవరూ?

ప్రభుత్వం, ఇంతవరకూకూడా, వంశాంతరంలోని విలువను, అది సంఘం మీద నిలిపే శక్తినికూడా సరైన దృక్పథంలో సమీక్షచేసి ఇవ్వవలసినంత విలువ ఇవ్వలేదు. వంశం అన్నది వర్గాల విభిన్న దృక్పథాల శరణ్యం అనుకోకుండా, సమిష్టి కుటుంబపు హక్కు అన్న అభిప్రాయంలో వుండడం మంచిది. అందువల్ల ఈ సమిష్టి ఉన్నతికి, వర్గ విభేదాలు లేకుండా, ఆదర్శప్రాయమైన, ఆరోగ్యమైన సంతతి అన్నది ముఖ్యం. అందువల్ల అనారోగ్యపు సంసారం, సంతతి బడయకుండా చూడడంకూడా సమిష్టి కుటుంబపు బాధ్యత అవుతుంది. మానసికంగా లోపభూయిష్టమైనవాళ్లనుకూడా ఈ పై జాతిలో జమచేయవలసి వుంటుంది. అల్లాగే ఈ సుఖవ్యాధులు కలవాళ్ళనుకూడాను.

పూర్వకాలంలో తల్లి దండ్రుల ఎడ, గురుతరభావం ఏర్పడ్డం ప్రాథమికంగా వుండేది. ఇది రానురాను, ఈనాటికి వాళ్ళంటే, తనకు అన్ని విధాలుగానూ సౌఖ్యం, తిండీ, బట్టా ఇవ్వలేని వాళ్ళగా చూడ్డం, వాళ్ళను ద్వేషించడంతో సమాప్తి అవుతోంది. అందువల్ల తల్లితండ్రులను ద్వేషించే సంతానం, వంశాలు అనుక్రమణిక అవుతున్నాయి.

ఈ నాటి తల్లీ తండ్రీకూడా, చిన్నపిల్లప్పుడు పాలుపట్టేం, అన్నం తినిపించేం, బళ్ళో వేసేం, ఫెయిల్ అవకుండా చదువుకుంటున్నాడు అన్న భావనలో వుండి, తృప్తిచెందడంతో, ప్రాతిపదికగా వేయవలసిన పునాదుల్ని మర్చిపోవడం జరుగుతోంది. ఏ మహత్తర కాలంలో, జీవితాన్ని మలచడం జరుగుతోందో, ఆ కాలం వృధాచెయ్యబడి, నిర్జీవంగా వుంచడం అవుతోంది. ఏదో పెద్దయి స్వశక్తి వచ్చిన తర్వాత, తన విలువతానే గుర్తిస్తాడు అనుకోవడం, అది పొందకుండా, ఉండడంతో, ఇటు తల్లిదండ్రు లిద్దరూకూడా, దోషులయి పూరుకుంటున్నారు.

ఈ జైళ్ళు, సంస్కరణలు, ఉచిత పాల దానాలు, గాలివెలుతురూ ఉన్న ఇళ్లు, వివాహచట్టంలో క్రొత్త నిబంధనలు, ఆఖర్కు తల్లీదండ్రుల పాఠశాలలు,

ఎన్ని స్థాపించినా వంశంలోని మచ్చలు కదలడం లేదు. వంశం అన్నది ఇసుక పునాదుల్లో పెంచబడడంతో గాలిదుమారాల తాకిడి తప్పటంలేదు. ఒకోసారి పూర్తిగా కూలిపోతోంది కూడాను.

పరిశీలించిచూస్తే ఒక్క పెద్దలోపం కన్పిస్తుంది. మాతృస్థానపు విలువ ఈ నాటికీ తల్లి గుర్తించటంలేదు. ఆమెలో వున్న సృష్టి శక్తులు, మైకంలోవుండడం జరుగుతోంది. కనక అవి మేల్కొనే వరకూ కూడా మోక్షం లేదనాలి.

ఏ తల్లేనా, తన సంతతి అన్నది, దాని పెంపు అన్న దాన్లోని ఆనందం, తనది అన్న భావనలో ఉండే విశిష్టత, ఏ విధమైన శక్తికికూడా అతీతం.

ఈ శక్తిని అర్థంచేసుకుని సంతతి నివ్వడంలో సమిష్టి కుటుంబపు ఆస్థికి మెరుగులుదిద్ది నట్లవుతుంది.

అయితే ఈ శక్తిని అర్థంచేసుకోకుండా పనిచేసేవి ఏమిటి అంటే, మొట్టమొదటగా ఈ శక్తి ఉన్నట్టే తెలియక పోవడం. పైగా పెరిగి, పెద్దయిన వాళ్లకు ఈ మధురభావనను చెప్పడం ఓ హాస్యాస్పదంగా తయారవుతోంది. అంతవరకూ నేర్చుకున్న (మూడుపంతులు ఊహించుకున్న నిర్ణయం) జ్ఞాన సంపుటాలలో ఇది ఉండనే వుండదు. చెప్పగలిగే వాడు వుంటే ఈ జ్ఞానం అతీతంకాదు. అది ఈ నాటి భర్తలబాధ్యత అనటం అతిశయోక్తి కాదు.

ఇక ఈ నాటి పతనస్థితిలోని అజ్ఞానం, మూర్ఖత్వం, అచంచలత్వం, కుంచితదృక్పథం ఉండనేఉన్నవి. వీట్లతో ఏర్పడ్డ సంకుచితసంఘభావాలు, ఇల్లాంటి వాళ్లు, తిండీబట్టావుండి, ఇంకతమవంతు పిల్లల్ని కనడం అన్న దృష్టిలోవుండి, డజన్లకొద్దీ బానకడుపులు, సొట్టకాళ్లు, పెద్దతలల్తోటి, జనాభాని వృద్ధిచేస్తూ సంఘంమీదపడి పీక్కుతినమనే రాబందులవుతున్నారు. చివరకు అందులోనే అంతమయి రూపుమాసి పోవడంతో సమాప్తమవుతారు. వీళ్ళను ప్రభుత్వం నిరంకుశంగా కట్టుబడి చేయడంకన్న ఇంకో మార్గంలేదు; ఎంచేతనంటే ఇంకోపద్ధతి చెవిటివాడి ముందు శంఖమూదినట్లే అవుతుంది కనుక.

ఈ నాటి పరిస్థితినిచూస్తే, శాశ్వత గర్భనిరోధనకు ఆపరేషన్ పద్ధతి చాలా మందికి తెలియదేమో అనాలి. ఒక్క ఈ పద్ధతి అర్థం చేసుకోలేక పోవడమే కాకుండా, దాన్ని ఒప్పుకోవడం కూడా జరగటంలేదు. చాలామంది, ఈ చికిత్సను, ఖోజాలుగా తయారుచెయ్యడం అనుకోవడంకూడా వుంది. అందువల్ల ఓ విధమైన భయం, భీతికూడా ఆక్రమించి వున్నాయి. పురుషత్వం పోతుందని, శరీరంలో నిస్సత్తువ ఎక్కువవుతుందనే పిచ్చి భావాలను పెట్టుకుంటూ వున్నారు. ప్రత్యేకంగా పితృస్థానం ఆక్రమించుటకు అనర్హులందరూకూడా ఆపరేషన్ చేయించుకోవడం ముఖ్యం. దాన్ని నిర్దాక్షిణ్యంగా వాళ్ళమీద ఆంక్ష విధించడంలో వంశం భావి ఉన్నతస్థాయికి వెళ్ళగలదు. ఈ ఆపరేషన్లో చాలా బాధపడవలసి వుంటుందన్న వాదన నిరాధారం. ఇది చాలా చిన్నది. చేయించుకున్నందువల్ల, వారి దాంపత్యంలో ఏ విధమైన మార్పూ ఉండదు. గర్భోత్పత్తికి మాత్రం వీలుండదు-కావాల్సింది కూడా అదేకదా!

ఈ నాడు శాస్త్రం అభివృద్ధి చెందు

తూ కేస్తుండి ఎక్స్‌రే కిరణాలవల్ల కూడా ఈ చికిత్స పొందుటకు వీలవుతోంది. ప్రత్యేకంగా స్త్రీలల్లో ఈ ఆపరేషన్ కష్టసాధ్యం కనుక, ఎక్స్‌రే ఆపరేషన్ వాళ్లల్లో సులభంగా చేసుకొనుటకు వీలవుతుంది. పైగా ఈ చికిత్సవల్ల శాశ్వత గర్భనిరోధం ఒక్కొక్కప్పుడు జరగవచ్చు; లేక అది అశాశ్వతంగా, తాత్కాలికంగానే వుండనూ వచ్చు.

ప్రభుత్వం ఈ నాడు, భావిపునాదుల కోసం కృషి చెయ్యాలంటే, శాసనాల ద్వారా, ఈ చైతన్యం కల్గించాలి. అంతవరకూ మనకు ముక్తిలేదు. ఆస్పత్రులు ఈ చికిత్సలకోసం పెట్టి, సాధ్యమైనంతవరకూ, శిశుజననాలను తగ్గించాలి. దంపతుల్లో మధురభావనను పెంపొందించడానికి కృషి చెయ్యాలి. కాని, ఈ నాడు ఉచిత పాలు పంపకం, సంస్కారణలు చెప్పేచదువుల మార్పులవల్ల, జెన్ని మూకల్ని సరిచేద్దామనుకోవడం ఒట్టి మౌఢ్యం. అది రాదు. దానివల్ల వస్తుందనుకోవడం కూడా ఒట్టి దౌర్భాగ్యం అనుకోవాలి.

ఈ నాటికైనా దాంపత్యం అన్నది ఓ ఉత్కృష్టపీఠం, సంతతి అన్నది మధుర ఫలాలు అన్నది గుర్తిస్తారా?

ఆశ అన్న దానిమీదనే ప్రపంచం నడుస్తోంది. మానవజీవితాలు ఆ ఆశ ఆధారంగానే సాగుతున్నాయి.

యీ ఆశతోనే నవోదయంకోసం, నిత్యజీవిత విజ్ఞాన సాధనకోసం ఎదురు తెన్నులు చూడటం అభ్యుదయకాముల కనీస కర్తవ్యమనక తప్పదు.

—ఐపోయింది.

ఏకాంత పఠనానికి



కొక్కోక శాస్త్రం: వశీకరణము, వివిధ రతి భంగిమలు, అత్యంతోపయుక్తమైన అనేక ఇతర వ్యాసాలతో, ఇదివరకెన్నడూ మీరు చదివిఉండని విషయాలతో నిండివుంది.

పడక గది చిత్రాలు: స్త్రీత్వం లోని సౌందర్యాన్ని వివిధ భంగిమల్లో చూడదలుచుకుంటే, 50 ఫోటోల సెట్టుకు నేడే ఆర్డర్ చేయండి.

పై రెండూ కలిపి రూ 6/-


H. H. STORES (J M.)
Post Box 51, Meerut [U.P.

అభిసారిక

ముఖచిత్రాలుగా వెలువడిన త్రివర్ణ చిత్రాల తాలూకు మైక్రోకలర్ బ్లాకులు, దాదాపు 30 సెట్లు అమ్మకానికి సిద్ధంగా ఉన్నవి. అతి సరసమైన వెలకు విక్రయించబడుతవి. క్యాలెండర్లకు కానీ, పుస్తకాల ముఖ చిత్రాలుగా కానీ ఉపయోగించుకోవొచ్చు.

వివరాలకు:

అభిసారిక కార్యాలయం,
మద్రాసు-1.




ధర్మయ్యగారు డాబా ముందు బంగాళీ పెంకు వరండాలో శివం ఎత్తినట్టు పిచ్చిగా పచార్లు చేస్తున్నాడు. తీవ్రమైన మధ్యాహ్నపు ఎండ తాలూకు ముమ్మరం - ఆయనలోని కోపాన్నీ, చిరాకునీ అధికపరుస్తూంది. ఆయనగారి భార్య, అంటే సుందరమ్మ వంటగదిలో కాఫీ వ్యవహారం చూస్తూంది. ముండమోపి పుట్టింట్లో రాణివాసం చేస్తూన్న వెంకటలక్ష్మి దక్షిణపు గదిలో పందిరి మంచం మీద పడుకొని ఒక ప్రేమ కథ చదువుకొంటూ ఉంది.

ధర్మయ్యగారి కోపానికీ, చిరాకుకూ కారణం టెయిలర్ వీరభద్రయ్య దగ్గరకు వెళ్ళిన జీతగాడు ఇంకా రాకపోవటమే! ఆయన కోపం కేవలం జీతగాడి మీదే కాదు - ప్రొద్దున పదిగంటలకు రెండు చొక్కాలు కుట్టియిస్తానని చెప్పి మధ్యాహ్నం ఒంటిగంటైనా ఇవ్వని టెయిలర్ వీరభద్రయ్యమీద కూడాను.

జీతగాడు వొచ్చాడు, వొట్టిచేతులతో. ధర్మయ్యగారు ఎగిరి పడ్డారు.

'నన్ను ఏం చేయమంటారండీ-ఆ భద్రయ్య చొక్కాలు కుట్టనిదే! 'వెంకటయ్య చొక్కాలు కుడుతున్నాను, ఆ తరువాత మీ దొర చొక్కాలు కుడతాను' అంటున్నాడు. మా దొరగారు అర్జంటుగా ఊరికెళ్ళాలయ్యా అని నెత్తీ నోరు మొత్తుకున్నా వినిపించుకోలేదు' అని సంజాయిషీ చెప్పుకున్నాడు జీతగాడు.

కాని ధర్మయ్యకు హృదయంలో హోమ గుండం మండిపోతోంది. వాడు తన చొక్కాలు కుట్టకుండా ఆ వెంకటయ్య చొక్కాలు కుడతాడా? ఎంత అతను ఇంట్లో మిషన్ పెట్టుకుంటే మటుకు—ఎవరిది తొందరో గ్రహించక్కర్లేదూ? ఊరంతటికీ ఒక్కడే దర్జీ కావటం మూలాన వాడికి పొగరు తలకెక్కింది... వెంకటయ్య తన విరోధి.

అతను గుడ్డలు ముందు కుట్టి—తరువాత తనవి కుట్టటమా? పది గంటలకే కుట్టి యిస్తానని వాగ్దానం చేశాడుగా? అయితే యేం వెంకటయ్య గుడ్డలు ఇచ్చి 'ముందు నావి కుట్టు' అని శాసించి వుంటాడు. అయితే మాత్రం తన వాగ్దానాన్ని వాయిదా వేయటమా? తను సహించ రాదు...

ధర్మయ్యగారు వెంటనే జీతగాడి చాత వీరభద్రయ్య దగ్గర్నుంచి గుడ్డలు తెప్పించాడు. షావుకారూ, ఊళ్లో పేరుగలవాడూ ధర్మయ్యగారు కావటం వలన, వీరభద్రయ్య భయపడుతూ వొచ్చి ఆలస్యానికి కారణాల్ని వివరించు కున్నాడు. వెంకటయ్యగారు రెండు చొక్కాలిచ్చి అర్జంటుగా కుట్టమన్నారట. ఆయన ఇంట్లో మిషన్ పెట్టుకున్న కారణాన ఆయన ఆజ్ఞను కాదనలేక పోయాడట. ఆ సంజాయిషీని ధర్మయ్య గారు లక్ష్యపెట్టలేదు.

ఆ మధ్యాహ్నమే ధర్మయ్యగారు పెట్టె అడుగున ఉన్న చొక్కా ధరించి తన పనిమీద మరోగ్రామం వెళ్ళారు. మరునాడు వస్తూవస్తూ ప్రక్కన మైలు దూరంలో ఉన్న పాలెంనుంచి టెయిలర్ మస్తాన్‌ను తీసుకువచ్చాడు ధర్మయ్య. అతన్ని తన డాబా ముందుగదిలో మిషన్ పెట్టుకోమన్నాడు; తన పలుకుబడిలో ఉన్నవారి అందరి చాతా పుష్కలంగా గుడ్డలు యిప్పిస్తాననికూడా చెప్పాడు. టెయిలర్ మస్తాన్ ఎగిరి గంతేసి, మరునాడే ఒంటెద్దు బండిమీద మిషన్ తీసి కొనివొచ్చి ధర్మయ్యగారి డాబాలో చేరాడు. ముందుగా ధర్మయ్యగారి ఆ రెండుచొక్కాలే కుట్టాడు. ధర్మయ్య గారు అప్పుడు మీసాలు సవరించు కుంటూ, వీరభద్రయ్య అహంకారానికి తగిన శాస్తి జరిగిందని గర్విస్తూ, విరోధి వెంకటయ్యమీద పగదీర్చుకున్నానని తృప్తిపడుతూ - ఆనంద పడ్డారు.

★

కొత్తగా వొచ్చిన టెయిలర్ మస్తాన్ చాల కొద్ది కాలంలోనే పాత టెయిలర్ వీరభద్రయ్యకు వొత్తిడి తగ్గించాడు. మస్తాన్ ఆడవాళ్ళ జాకెట్లు, పిల్లల గౌన్లూ కొత్త ఫ్యాషన్సుతో కుట్టడం చాత—అవి చాల మందిని ఆకర్షించాయి. మగవాళ్ళకు కూడా బుష్ షర్టులూ, ఓపెన్ షర్టులూ, అమెరికన్ జాకెట్‌లూ కుట్టడం మొదలెట్టాక హైస్కూలుకు పోయే విద్యార్థులంతా మస్తాన్ మీదనే మోజు పడ్డారు. ఊరు చిన్నది కావడం చాత అంతకు ముందు వీరభద్రయ్య ఒక్కడే టెయిలర్. అతను పూర్వ కాలపు వాడు. నవీన ఫ్యాషన్లు పెట్టి కుట్టటం అతనికి బాగా రాదు. కనుక మస్తాన్ ఖ్యాతి త్వరలోనే ఊరంతా పాకింది. వెంకటయ్య ముఠాలోని వాళ్ళుకూడా, కొంతమంది పిల్లకాయలు తమ తల్లి తండ్రుల మాటల్ని వినకుండా, మస్తాన్‌కే గుడ్డలు ఇవ్వ సాహసించారు.

ధర్మయ్యగారికి తను చేసిన పని ఎంతో ఉత్తమంగా అగపడుతూంది. ఆయన అప్పుడప్పుడూ తీరిక ఉన్న సమయాల్లో మిషన్ దగ్గిర కూర్చుని కబుర్లాడుతూ ఉంటాడు.

మస్తాన్ రోజూ సాయంత్రం తన

ఊరు వెళతాడు. మరునాడు ఉదయం భోజనంచేసి, మధ్యాహ్ననికి టిఫిన్‌లో భోజనం తెచ్చుకొని తింటాడు. సుందరమ్మగారు కూర, మజ్జిగ యిస్తుంది.

రెండుమాసాలు గడిచేప్పటికి మస్తాన్ ఆ పల్లెకు బాగా పాతబడ్డాడు. అతనికి రాబడి చాల సంతృప్తి కరంగా ఉంది.

అప్పుడప్పుడూ మధ్యాహ్నం వేళలో ధర్మయ్యగారి కూతురు వెంకట లక్ష్మి మస్తాన్ గదిలోకి వొస్తుంది. మస్తాన్ గుడ్డలు కత్తిరిస్తూంటే చూస్తూ వుంటుంది. 'ఆ జార్జిట్ సిల్కు గుడ్డ ఎవరిది? ఆ పట్టు పరికిణీ డాక్టరుగారి చిన్న కూతురిదా? ఆ చుక్కల రవికె మునసబుగారి భార్యదా? ఆ ఖద్దరు సిల్కుషర్టు ఎవరికి? ఆ నల్ల ప్యాంటు గుడ్డ మునసబుగారి కొడుక్కా?'- మొదలైన ప్రశ్నలు వేస్తూ, మస్తాన్ చాత తగిన సమాధానాలు చెప్పించుకుంటూ వుంటుంది. అప్పుడప్పుడూ మస్తాన్‌ను నవ్విస్తుంది. తానూ నవ్వుతుంది.

ఆరోజు మధ్యాహ్నం వెంకటలక్ష్మి ఏమీ తోచక మస్తాన్ మిషన్‌దగ్గరకు వొచ్చింది. మస్తాన్ బడలికచాత చాప మీద పడుకొని నిద్రపోతున్నాడు. వెంకటలక్ష్మి ద్వారంలో నిలబడి అట్లాగే రెండు నిమిషాలపాటు పరీక్షగా మస్తాన్ వంక చూసింది - గంగానదీ తీరాన్ని స్ఫురింపజేసే అతని హృదయవైశాల్యమూ, నిండుగా, నిశ్చింతగా, ఆకర్షణీయంగా, అందంగా ఉండే అతనిముఖమూ - ఆమెను అమితంగా ఆకర్షించాయి. తనకు తెలీని ఒక విధమైన మోహంలాంటి ఆవేశం ఆమె శరీరాన్ని ఆవరించింది. విధి విలాసం వల్ల అణచబడ్డ ఆమెలోని యవ్వనపు కోర్కెలు రెక్కలు విప్పుకొని, త్రాళ్ళు త్రెంచుకొని విముక్తి పొందేందుకు ఉధృతంగా పోరు సల్పనారంభించాయి.

మస్తాన్ ఎంత అందమైనవాడు! అతని ముఖమూ, అతనిజుట్టూ, అతని రొమ్ములూ—ఎంత ముచ్చటగా ఉన్నాయి! మనిషి ఎంత నిర్మలం!

అతనివంకే చూస్తూ వెంకటలక్ష్మి సింగర్ మిషన్ ప్రక్కనే కూర్చుంది.

ఒక్కమూలుగు మూలుగుతూ మస్తాన్ అటు కదలి పడుకున్నాడు. ఏదో తియ్యని ఆలోచనలో ఉన్న వెంకట లక్ష్మి స్టూల్ మీద నుంచి చివుక్కున లేచింది. గదిలోంచి వెళ్ళబోయింది. ఆమె తడబడే కాళ్ళకు ఆయిల్ కేన్ తగిలి చిన్న శబ్దం కావడం చాత మస్తాన్ లేచాడు. గదిలోంచి వెళ్ళే వెంకట లక్ష్మిని చూసి నిద్ర మత్తుతో త్రాగిన వాడి స్వరంతో- 'ఎవరది?' అన్నాడు.

'నేనే!' అంటూ వెంకటలక్ష్మి మళ్ళీ గదిలోకి వొచ్చింది.

మస్తాన్ కళ్లు నులుముకొని 'కూర్చోండి' అని గుడ్డలు కత్తిరించనారంభించాడు. 'ఎవరిదా జాకెట్టు?' అన్నది వెంకటలక్ష్మి -

'రామయ్యగారి కోడలిదండీ'

'ఆర్గండీ వాయిల్ లాగా ఉంది.'

'అవునండీ!'

ఇట్లాగే వాళ్ల సంభాషణ సాగుతూ వుంటుంది రోజూ. అప్పుడప్పుడూ ఆ ఆ గొందిలోని ఆడవాళ్ళు ఒకళ్ళు ఇద్దరు తమ పిల్లల జడగుడ్డల నిమిత్తం వొచ్చి- మస్తాన్‌తో కబుర్లాడి పోతూంటారు.

క్రమేపీ మస్తాన్ ధర్మయ్యగారి

కూతురు వెంకట లక్ష్మి చేష్టల్ని గమనిస్తూ రాసాగాడు. ఆమె తన వంక చూసే చూపుల్లోనూ, మాటి మాటికీ తన గదిలోకి వొచ్చి తనని మాట్లాడించే విధానంలోనూ, తన ఎదుటే కూర్చుని నిర్లక్ష్యంగా నవ్వటంలోనూ, పైట జారిన విషయంకూడా గమనించకుండా తనని నవ్వించటంలోనూ, ఏమైనా పిండివంటలు చేసుకుంటే తనకి చిన్న జీతగాడి చాత పంపించటంలోనూ - మస్తాన్ గ్రహించిన దేమిటంటే,-తన మీద ఆమెకు అదో రకమైన మోజు ఉన్నదని. పైపెచ్చు ఆమె విధవనే విషయంకూడా తెలుసుకున్నాడు.

వెంకట లక్ష్మి మెరపు తీగలాంటి మనిషి. ఆమె అందానికి తగిన అవయవ సౌష్టవం, ఆమె నిత్యమూ ధరించే మామిడి పిందెల నెక్లెస్ ఆమె సహజ సౌందర్యాన్ని ద్విగుణీకృత పరుస్తుందనటంలో అతిశయోక్తి ఏమీలేదు. ఆమెను చూడటంతోనే మస్తాన్‌కుకూడా వొళ్ళు పులకరించటం జరుగుతూన్నది; కానీ ధర్మయ్యగార్ని చూసీ, ఆయన తనకు కల్పించిన జీవనాధారాన్ని గుర్తించీ, ఆయనకు ఊళ్లో పెద్ద మనిషిగా, మర్యాదస్తునిగా, గౌరవ కుటుంబీకునిగా ఉన్న ప్రతిష్ఠను తెలుసుకొనీ,—ఆమె విషయంలో 'సాహసం' తలపెట్టేందుకు జంకుతున్నాడు.

కాని ఎలప్రాయపు జవ్వని కనుసైగ జేసీ, చిరునవ్వునవ్వీ, వొళ్లు విరుపువిరచీ, ప్రణయ సౌఖ్యానికి కాలుదువ్వుతూంటే—పురుషత్వంగల ఏ మగవాడు,— సంఘమూ, నీతి, పరువూ, మర్యాదా, అపచారమూ, భయమూ, తప్పూ అనుకుంటూ కళ్ళుమూసుకొని వెనక్కి పారిపోతాడు? స్త్రీ కనుచూపులోని తీపికోసం, స్త్రీ సాంగత్యంలోని స్వర్గంకోసం, స్త్రీ చిరునవ్వులోని కైపుకోసం- ఎంతమంది రాజ్యాలు ఒడ్డలేదు? ఎంతమంది తమ జీవితాల్ని అంకితం చేయలేదు? ఏమైనా తను వెంకట లక్ష్మినుంచి అనుభవాన్ని సంపాదించ వలసిందే! తనని వాంఛించి, తనకోసం అనుక్షణమూ తపిస్తూ, తనను పొందేందుకు ఆమె అట్లా ఆరాట పడుతూంటే — తను అమాయకునిలా, ఏమీ చాతగానివాడిలా, పురుషత్వం చచ్చిన దద్దమ్మలా తప్పించుకు తిరగడం ఏం సబబు? స్త్రీ చేత 'చవట' అనిపించుకోవడం కంటె మరొక అవమానం పురుషుడికి ఏముంది? ధర్మయ్యగారు తనని ఏమైనాచేయనీ, లోకం తనని ఎట్లానైనా నిందించనీ, — తను మటుకు వెంకటలక్ష్మి దృష్టిలో 'చవట'గా తయారు కాకూడదు—అనుకున్నాడు మస్తాన్.

ఆ మధ్యాహ్నం వెంకటలక్ష్మి తనను రాచుకుంటూ పోతూంటే - వెనగ్గా వెళ్ళి, మస్తాన్ కౌగలించుకున్నాడు. వెంకట లక్ష్మి ఆ స్పర్శకు లోకాన్ని మైమరచింది.

మస్తాన్ తనలో ఉద్రేకపు తుఫాన్ చెలరేగటంతో—తన ఆనందానికి అనువుగా ఆమెను కౌగిలిలో ఇముడ్చుకొని, పెదాలు కమిలిపోయేట్టు ముద్దుపెట్టుకున్నాడు.

ఆ ప్రణయసౌఖ్యంలో ఇంకో మెట్టు ఎక్కేందుకు మస్తాన్ ఆ ఉద్రేకపు పిచ్చిలో ప్రయత్నించేలోగా — వెంకట లక్ష్మి, అది పన్నెండుగంటల పట్టపగలని తెలుసుకొన్నదై ఆ విపరీత సాహసా

నుంచి తప్పించుకొని బయటపడింది. తాత్కాలికంగా మస్తాన్ నిరాశ చెందాడు. ఎర్రనైన కోర్కె చప్పగా జారిపోవాల్సినస్థితి ఏర్పడేప్పటికి అతనినరాలు అఘోరకమైన బాధకు గురి అయినాయి.

కాని ఆ మరునాడు మధ్యాహ్నం, టెయిలర్ మస్తాన్ వెంకట లక్ష్మి నుంచి నిజమైన అనుభవాన్ని పొందాడు. ధర్మయ్యగారు పొలం వెళ్ళారు. ఆయన పెద్ద కొడుకూ పోలాన ఉన్నాడు. రెండో కొడుకు హైస్కూలుకు వెళ్ళాడు. సుందరమ్మగారు మునసబుగారింటికి 'అప్పడాలు' చేయటానికి వెళ్ళింది. పోతే ఇంట్లో ఒక్క వెంకటలక్ష్మి!

మస్తాన్ సాహసం చేశాడు. వెంకటలక్ష్మి ఆ ఇంటి గౌరవాన్నీ, పరువునూ తన కోర్కెకు బలిగా సమర్పించింది.

'తన బ్రతుక్కి ఇంత సౌఖ్యమా?' అనుకున్నాడు మస్తాన్.

★

'నీ మెడలో నెక్ లెస్ ఏమైందే?'

'రాత్రి స్నానంచేస్తూ గదిలో డ్రాయరు సొరుగులో పెట్టానమ్మా.' అన్నది వెంకట లక్ష్మి.

'అటువంటి ఖరీదుగల వస్తువులు డ్రాయర్లో పెట్టుకుంటారటే?' ఆశ్చర్యపోయింది సుందరమ్మగారు.

'దక్షిణపు గదిలోకి పోవటానికి బద్ధకం వేసి అక్కడ పెట్టానమ్మా!'

సుందరమ్మగారు వెంటనేవెళ్ళి, ముందు గదిలోని డ్రాయర్ను పరీక్షించింది. డ్రాయర్లో నెక్ లెస్ లేదు. ఆవిడ గుండెలు దడ దడ లాడినై. ఒక్క గంతున వెంకట లక్ష్మి దగ్గరకు వొచ్చింది.

'ఏమే నెక్ లెస్ డ్రాయర్లో లేదే!'

'ఆఁ! నిజంగానే!' వెంకట లక్ష్మి పరుగెత్తుకుంటూ వెళ్ళి డ్రాయరంతా వెతికింది. అల్మరాలోనూ లేదు.

'నీ బుద్ధి మండి పోనూ! అసలు అక్కడ ఎందుకు పెట్టావే? అది పదిమంది నడిచే గది కదే! నీకు మతి ఎట్లా లేక పోయిందే..?' అని తల్లి కేకలు వేస్తూంటే, గుడ్లు అప్పగించి చూస్తూ వూరుకుంది వెంకట లక్ష్మి.

ఆ విషయం కొస్తా ధర్మయ్యగారి చెవినకూడా పడింది. అది పన్నెండువందల రూపాయల విలువ కలది. ఎవరి మనస్సు చివుక్కుమనదు? ధర్మయ్యగారి అభిప్రాయం-దొంగ ఎవరో కనుక్కొని గట్టిగా శిక్షించాలి.

ముందుగా అందరి కళ్ళూ చిన్న జీతగాడైన రాముడిమీద పోయినాయి. వాడికి ఆ గదిలోకి నిరభ్యంతరమైన ప్రవేశం ఉంది. అంతకు మినహాగా ఎవర్నీ అనుమానించేందుకు ఆస్కారం అగపడలేదు. ఆరు గంటలు కాకముందే టెయిలర్ మస్తాన్ ఆ ఇంట్లోంచి వెళతాడు. వెంకటలక్ష్మి రాత్రి ఎనిమిది గంటలకు కానీ స్నానం చేయలేదు. అయినా మస్తాన్ ప్రవర్తనమీద ఆ ఇంట్లో ఎవ్వరికీ ఏ విధమైన దురభిప్రాయం లేదు.

చిన్న జీతగాణ్ణి పిలిచాడు ధర్మయ్యగారు. 'ఏరా, నెక్ లెస్ ఎక్కడ దాచావురా?' అని గర్జించాడు ధర్మయ్య.

'నె.. క్... లె...స్!'

'అమ్మాయి, ముందు గది డ్రాయర్లో పెట్టిందట రాత్రి. ఉదయం నువ్వు ఆ గది పొచివూడ్చావు కదూ?'

తల ఆడించాడు భయంతో, వాడు.

'నువ్వు తీయలేదూ ఆ నెక్ లెస్? నిజం

చెప్పు. లేకపోతే నిన్ను నిలువునా పాతి పెడతాను. అది పన్నెండు వందలరూపాయల విలువ కలది. చెప్పు. నిజం చెప్పు. లేకపోతే 'పసుపుబియ్యం' పెట్టించి నీచేత నిజం కక్కిస్తాను. అబద్ధం చెప్పావా కడుపుఉబ్బి చనిపోతావు. లేకపోతే పోలీసులకు అప్పగిస్తాను. వాళ్ళే లాఠీలతో నీచేత నిజం చెప్పిస్తారు'

'నాకేమీ తెలియదండీ! నేనేం చేసుకుంటానండీ?' అన్నాడు వాడు ఏడుస్తూ.

అట్లాగైతే వాడు నిజం చెప్పడని ధర్మయ్యగారు చింతబరిక చేతిలో పట్టుకున్నాడు. కాని రాముడు ఒకేమాట మీద ఉన్నాడు. ధర్మయ్యగారు ఈత చువ్వలు తెప్పించాడు. చువ్వలు విరిగేట్టు కొట్టాడు. ఆ దృశ్యం చూడలేక వెంకటలక్ష్మి పడమటి ఇంట్లో కూర్చుంది. పెడబొబ్బలుపెట్టి ఏడుస్తూ రాముడు చివరకు—'నిజం చెబుతాను' అన్నాడు.

ధర్మయ్యగారు కొట్టడం ఆపివేశాడు.

సుందరమ్మగారు భర్తవంక నెక్ లెస్ దొరికినంత ఆశగా చూసింది.

రాముడు సాధ్యమైనంత వరకు ఏడ్పు దిగమింగుకున్నాడు. నిజం చెప్పటానికి సాహసించాడు.

'నిన్న...నిన్న సాయంత్రం అమ్మాయిగారు...ఆ నెక్ లెస్ మెడలోనుంచి తీసి...మస్తానుకు యిస్తూంటే నేను కిటికీలోంచి చూశాను...'

'ఆఁ!' ధర్మయ్యగారు అదిరి పోయారు. సుందరమ్మగారికి గొంతులో పచ్చి వెలక్కాయ ఇరుక్కున్నట్టయింది.

ధర్మయ్యగారు గజగజ లాడిపోయారు. చేతిలోని ఈత చువ్వతోనే పడమటి ఇంట్లోకి, అమ్మాయి దగ్గరకువెళ్ళాడు, ప్రళయరూప రుద్రుడై — సుందరమ్మ భర్త పాదాల్ని చుట్టవేసికొంది.

'అది పసిపిల్ల. తెలియక చేసింది. దాని మీద మీరు చేయి చేసుకుంటే—నేను బావిలో పడతాను' అందా ఇల్లాలు.

ధర్మయ్యగారు ఏం చేయలేకపోయారు. కోపాన్ని అణచుకొని చిన్న జీతగాడు రాముడికి పదిరూపాయల కాగితం ఇచ్చి, కొట్టిన దెబ్బల్ని మర్చిపొమ్మని గంభీరంగా అన్నాడు. 'ఈ విషయం నువ్వు ఎవ్వరిదగ్గరా అనవొద్దు. అన్నావంటే నీ ప్రాణాలు ఎగిరిపోతాయి. జాగ్రత్త!' అని హెచ్చరించాడు. రాముడు తల ఆడించాడు—ఎవ్వరితోనూ చెప్పనని.

మస్తాన్ మళ్ళీ ధర్మయ్యగారి ఇంటికేసి రాలేదు. ధర్మయ్యగారు ఆ నెక్లెస్ కోసం మస్తాన్ ను వెతికి పట్టుకోనూ లేదు. ఆయనగారు చిన్న జీతగాడు రాముడిమీదే తగిన శ్రద్ధ తీసుకున్నారు.

వెధవచొక్కాలు సకాలానికి రాలేదనీ, మస్తాన్ లాటి వాడికి జీవనాధారాన్ని కలిగిస్తే జరిగింది—ఇది! ఎవరిమీదనో కని తీర్చుకోబోయి, తనకన్న తనే పొడుచుకున్నాడు...ఇంకా నయం—వెంకటలక్ష్మికి ఏ కడుపో రాలేదు. తాను చేసిన తప్పుకు ఆ పన్నెండొందల పదీ అపరాధం అని సరిపెట్టుకున్నాడు.

మస్తాన్ మళ్ళీ ఆ ఊరు రాకపోవడాన్ని గురించి పుకార్లు చెలరేగినాయి గానీ—ఆ పుకార్లు వెంకటలక్ష్మి పాతివ్రత్యపు విలువకు ఎటువంటి న్యూనతనూ కలిగించలేదు. కాని ఆ రహస్యం ఇంకా బయట పడలేదు; పడదు కూడాను. ఎందుకంటే, ఆ మరుసటి సంవత్సరమే మసూచికం వొచ్చి రాముడు చనిపోయాడు. ★



# బహిష్టు చిత్రవిచిత్రాలు

స్త్రీ ఆరోగ్యంలో సక్రమ బహిష్టు ప్రముఖ స్థానాన్ని ఆక్రమించుతుంది. బహిష్టు క్రమం తప్పటం ఏదో పెద్ద మార్పు—గర్భధారణకు కావొచ్చు-లేదా ఇతర కారాణాలవల్ల ఇది జరిగినట్లయితే ఆమె ఆందోళనకు గురికావటం, డాక్టర్లను దర్శించటం పరిపాటి. సక్రమ బహిష్టులేనిదే మాతృత్వం కూడా అనుమానాస్పదమవుతూ వుంటుంది.

ఒక్క మానవుల్లోనూ, కోతుల్లోనూ, మాత్రమే యీ బహిష్టు కనిపిస్తుంది. అండకోశంలో పక్వమైన గుడ్డు, విడుదలై, పురుష బీజంకోసం వేచివుండి, అది దొరకనందువల్ల పతనమై పోవటమే బహిష్టు; అంటే ఒకో బహిష్టు నిరాశగా మారిన ఒకో గర్భధారణ అనొచ్చు; ప్రకృతి తన ఓటమిని ఒప్పుకోవటం లాటిది; ఒకో బహిష్టు ఒకో చిన్న గర్భస్రావం లాటి దన్నమాట.

అండకోశంలో ఒకపక్క గుడ్డు పక్వ మవుతూంటే ఇదే సమయంలో గర్భకోశంలో సన్నని, మెత్తని పొర వొకటి తయారవుతూ వుంటుంది. గుడ్డు పొదగబడి పిండమైనట్లయితే, దాన్ని పెంచేందుకే, గర్భకోశంలోని పొర ఉపయోగపడుతుంది; యీ పొరే తర్వాత 'మాయ' గా కూడా రూపొందుతుంది. గుడ్డు పొదగబడనట్లయితే, గుడ్డుతో పాటు, యీ పొరకూడా యోనిద్వారా బైటికి నెట్టివేయ బడుతుంది. అంటే బహిష్టు, కొత్తగా గర్భధారణ జరిగే సన్నాహాలకు నాంది ప్రస్తావన లాటిదని కూడా చెప్పుకో వొచ్చు; ఎందుకంటే తిరిగి గర్భకోశంలో కొత్తపొర ఏర్పడ నారంభిస్తుంది. యీ విధానం ఆడపిల్ల రజస్వలైనప్పటినుంచీ ఆరంభమై, సరిసమాన కాలపరిమితిలో వొస్తూ వుంటుంది;.గర్భధారణ జరిగినప్పుడూ, పురుడు పోసుకున్నాక కొన్ని నెలలవరకూ మాత్రమే బహిష్టు ఉండదు; ఇందువల్ల ప్రకృతి కొన్నాళ్లపాటు, స్త్రీకి విశ్రాంతి నిస్తోంది. ఆ తరువాత స్త్రీ ఏ 40-వ ఏటనుంచో మరి బహిష్టు లేకుండా, మాతృత్వ బాధ్యతలనుంచి శాశ్వతంగా విముక్తురాలవు తోంది.

యీ సాధారణ పద్ధతినుంచి విభేదించటం చాలా సందర్భాలలో జరుగుతూ వుంటుంది. యోనినుండి కలిగే ప్రతి రక్తస్రావమూ సరిసమాన కాలపరిమితిలో వొస్తూన్నప్పటికీ బహిష్టు కాదు.

యీ స్రావాలు చాలా చిన్నతనంలోనే ఆరంభమవటం, వయసు మళ్ళాకకూడా ఉండటంకూడా కద్దు. యీస్రావం సర్వసామాన్యంగా గర్భకోశంనుంచి వొస్తూన్న దైనప్పటికీ, కొన్ని సందర్భాలలో ఇతర అంగాల ద్వారా రావటం కూడా వైద్యచరిత్రలో కనిపిస్తుంది.

రీసస్‌జాతి కోతులలో నెలానెలా బహిష్టు ఉన్నప్పటికీ, ఒక ఋతువులో సాంగత్యం జరిగినా, గర్భధారణ జరగకుండటం గమనించ బడింది. దీనికి కారణమేమిటని పరిశోధిస్తే, ఆ ఋతువులోని బహిష్టు స్రావం గుడ్డు విడుదలకు సంబంధించింది కాదని తేలింది. ఉండటానికి మామూలు బహిష్టువలెనే ఉన్నప్పటికీ, భేదం తెలుసుకోవటం కష్టమే. మూఢగర్భం(False Pragnancy)లాగే, ఇదీ మూఢ బహిష్టు (False Mensuration) అనొచ్చు.

కాపరాలుచేస్తూ, సక్రమ బహిష్టు వున్న స్త్రీలలో ఎన్నాళ్ళకూ గర్భధారణ జరగకపోయిన కారణాల్ని పరిశీలించగా, చాలామందిలో కనిపించే యీ సక్రమ బహిష్టు, అండకోశం పక్వమైన గుడ్డును విడుదలచేయటానికి సంబంధించి ఉండలేదని తేలింది. గర్భాన్నిధరించే స్త్రీలలో కూడా యీ విచిత్రం నూటికి తొమ్మిది మందిలో సరాసరిన కనిపిస్తుందని తేలింది.

ఇలాంటిది సర్వసామాన్యంగా చాలా చిన్నవయస్సులోనూ, లేదా వయసు మళ్ళాకనే కనిపిస్తూవుంటుంది. యవ్వనారంభంలోవున్న చాలామంది ఆడపిల్లల్లో సక్రమంగా బహిష్టుస్రావమంటూ, కనిపించినప్పటికీ, అండకోశం పక్వమైన గుడ్డును విడుదల చేయటమనేది మరికొంత కాలయాపనతో - ఒకోసారి సంవత్సరంపైనకూడా పట్టొచ్చు—జరుగుతూ వుంటుంది. ఇలాంటిది ఎప్పుడో, ఎక్కడో జరిగేదనుకోవటం పొరపాటు; సర్వసాధారణమైనదేమోనని కూడా పరిశోధకులు చెప్పగలుగుతున్నారు. కారణాల్ని చూస్తే, ప్రకృతి, స్త్రీ మాతృత్వాన్ని పొందేందుకు తగిన శక్తి సామర్థ్యాలు వొచ్చే వరకూ వేచి వుంటుందేమోనని పిస్తుంది. యీ కారణంగానే దంపతుల్లో ఏ లోపమూ కనిపించనప్పటికీ, దాంపత్యారంభంలోనే స్త్రీ గర్భాన్ని ధరించకుండటం జరుగుతోంది.

ఇద్దరు జర్మన్ శాస్త్రకారులు 36 మంది ఆడపిల్లల లైంగిక జీవనాన్ని గూర్చిన పరిశీలనలు చేశారు. యీ ఆడపిల్లలు తమ 16-వ ఏట నుంచే విశేషంగా రతిలో పాల్గొనటం, అదీ ఒకరికన్న ఎక్కువ మంది ప్రియులతో జరపటం వుంది; ఐతే వీరిలో తొమ్మిది మంది మాత్రమే గర్భవతులయ్యారు. అందరిలోనూ సక్రమ బహిష్టువున్నప్పటికీ, గర్భధారణ జరగని కారణమల్లా, ఆమె బహిష్టు స్రావం పక్వమైన గుడ్డుకు సంబంధించింది కాకుండటమే ... బాల్య వివాహాలు అమల్లోవున్న ప్రదేశాల్లో ఆడపిల్ల ఏమూడుసార్లో రజస్వలకాగానే శోభనపు గదిలోకి పంపబడటం పరిపాటి. ఆమె దాంపత్య జీవితంలో ప్రవేశించినప్పటికీ, ఏ మూడేళ్ళ తర్వాతనో కాని గర్భవతి కాకుండటం సర్వసామాన్య విషయం. దీన్నిబట్టి స్త్రీ రతికి ఉపయుక్తంగా తయారవటానికీ, మాతృత్వానికి అర్హతను పొందటానికీ ప్రకృతి కొన్ని

నిబంధనల్ని తయారు చేసిందేమోననిపించక పోదు.

ఇదిలా ఉండగా ఆడపిల్ల రజస్వలవగానే, దాంపత్యంలో పాల్గొని, మొదటి కలయికలోనే గర్భవతి ఐన సందర్భాలూ అనేకం ఉన్నవి. ఉదాహరణగా జార్జ్ టవున యూనివర్శిటీ హాస్పిటల్‌లో పురుళ్ళు పోసుకున్న 634 మంది యువతుల్లోనూ, నూటికి 85 మంది అవివాహితలు; వీరి వయసులు 15 సం. లకు కాస్త పైన, దీనికి కారణం చెప్పాలంటే యీ ఆడపిల్లల్లో బహిష్టు, నిజమైన బహిష్టే! మరి కొంతమందిలో తగినంత బహిష్టు స్రావం కూడా కనిపించ లేదంటే, పక్వమైన గుడ్డు విడుదలవటానికి ముందు, అండ కోశం నుంచి విడుదలయే ఇతర పదార్థాలు కనిపించటం జరిగిందనాలి. యీ పైన చెప్పుకున్న కేసుల్లో ముగ్గురు ఆడపిల్లల వయసు 12 సం.లు మాత్రం! ఇంత చిన్న వయసుల్లో వీరు మాతృత్వాన్ని ధరించారంటే ఆశ్చర్యమే! మరో విచిత్రం ఏమంటే యీ ఆడపిల్లలు రజస్వలలే అవలేదు! ఐతే ఇదెలా సాధ్యమనే ప్రశ్న వొస్తుంది. శాస్త్రీయంగా చెప్పాలంటే వారిలో బహిష్టుకు సంబంధించిన బాహ్య చిహ్నాలు కనిపించనప్పటికీ, వారి అండ కోశం పక్వమైన గుడ్లను విడుదల చేసింది. శరీరాంగాలు రతికి అనుకూలంగా పెరిగినవి. గర్భధారణకు ఇంకేం కావాలి?

స్త్రీకి మూల్లెండి పొయ్యేందుకు ముందు కూడా యీరకం బహిష్టు కనిపిస్తుంది. ఒకటి రెండు సంవత్సరాలకు ముందు నుంచీ బహిష్టు స్రావం పరిమాణంలో తగ్గటం, బాహ్యచిహ్నాలు కనిపించినప్పటికీ, నిజానికి, అది పక్వమైన గుడ్డు పతనానికి సంబంధించింది కాకుండటం వల్లనే, యీ సమయంలో గర్భధారణ సర్వసామాన్యంగా జరగదు. సెక్సుయంత్రాంగమంతా సక్రమంగా ఉన్నట్లు కనిపించినప్పటికీ దాంపత్య నిర్వహణలో గర్భవతులు కాని స్త్రీలలో యీ అంతర లక్షణానికి సంబంధించిన కారణం సరాసరిన 16% అని పరిశోధకులు అంచనా వేయగలిగారు.

ప్రతి 300 మంది ఆడ పిల్లల్లోనూ, ఒకర్తెరు, పుట్టిన వారంలోగానే యోని నుంచి కొద్ది రక్తాన్ని స్రవించటం, ఇది ఒకటి రెండు రోజుల వరకూ ఉండటం కలకాలంగా గమనించ బడుతోంది. ఒకొక్కొక్కప్పుడు పుట్టిన వెంటనే కనిపించటం, సర్వసామాన్యంగా, 6 లేదా 7-వ రోజున కలగటం, మళ్ళీ తిరిగి రజస్వలయే వరకూ రాకుండటం జరుగుతోంది. దీనికి కారణ మేమిటి?

తల్లి గర్భవతిగా ఉన్నప్పుడు ఎస్ట్రోజిన్ అనబడే హార్మోనుల్ని విపరీతంగా విడుదలచేస్తుంది; యీ హార్మోనులు పిండాన్నికూడా జేరుతవి. బిడ్డపుట్టిన వెంటనే యీ హార్మోనులు అకాత్తుగా ఆపివేయబడటంతో, ఆ బిడ్డ గర్భకోశం కొద్ది రక్తాన్ని విడుదల చేస్తుంది. వయసులోవున్న స్త్రీలకు ఎస్ట్రోజిన్ హార్మోనుల్ని ఇంజక్షన్లుగా ఇస్తూ, అవి ఆపివేయబడిన 4, 5 రోజుల్లో బహిష్టు స్రావం కనిపించటం లాటిదే, ఆడ శిశువుల్లో కలిగే స్రావంలాటిదని చెప్పుకోవొచ్చు. తల్లి తాలూకు ఎస్ట్రోజిన్ హార్మోనుల ఉనికే, శిశువు రొమ్ముల్లో కనిపించే

పాలనుబోలిన తెల్లని ద్రవం. ఇది మొదట్లో పలచగానూ, నీళ్ళవలె ఉన్నప్పటికీ, తరు వాత పసుపు రంగుకు మారి, పాలవలెనే ఉంటుంది.

కొంతమంది ఆడపిల్లలు చాలా చిన్న వయస్సులోనే బహిష్టు కావటంకద్దు. ఆడ పిల్ల 2, 3 నెలల వయస్సులోనే బహిష్ట యిన కేసులు వైద్య చరిత్రలో ఉన్నవి. యీ బహిష్టు 8, 9 సం. ల వయస్సుల్లో కనిపించటం అసహజంగానే భావించ బడుతోంది. కారణం ఏమిటి?

కొన్ని సందర్భాలలో మెదడు వ్యాధి గ్రస్తమై ఉండటం, లేదా ఏదన్నా కణితి ఉండటం, అండకోశాల్లో కణితి ఏర్పడ టంవల్ల విపరీతంగా సెక్సు హార్మోనులు విడుదలై, లైంగికయంత్రాంగంలో విపరీత మైన పెరుగుదల కనిపిస్తుంది. ఇది నూటికి ఏ పదిమందికో సరిపడే సత్యం.

మిగతా 90 మందిలోనూ, సాధార ణంగా ఆడపిల్ల రజస్వలయే వయస్సే, తక్కువదిగా ఉండటం జరుగుతోంది. అంటే ఇది అసహజమైనది కాకుండా, చాలా సహజమైనదిగానే ఎంచబడుతోం ది. ఇది ఆయా వ్యక్తుల వంశపారంపర్యత మీదా, తత్వాలమీదా ఆధారపడి శరీ రంలో తగినంత పరిమాణాల్లో సెక్సు గ్రంధులు విడుదలవటం జరుగుతోంది. పైన చెప్పుకున్న కారణానికీ, స్వభావ సిద్ధమైన యీ కారణానికీ వున్న భేదం గమనించ దగ్గది.

ఏ కణితి కారణంగానో చాలా చిన్న వయస్సులోనే రజస్వలవటంలో, అండకోశం పక్వమైన గుడ్డును విడుదలచే యదు కనుక, రతిజరిగినా గర్భధారణ జర గదు. తత్వరీత్యా తక్కువ వయస్సులోనే రజస్వలవటంలో అండకోశం మామూలు గానే పక్వమైన గుడ్డును విడుదలచేస్తుంది కనుక, రతి జరిగినట్లయితే, గర్భధారణ జరిగే అవకాశం వుంటుంది. యీ రకం 310 మంది ఆడపిల్లల్లో 70 మందిలో 14వ సంవత్సరానికి పూర్వమే గర్భధారణ జరి గింది. 5-10 సం. ల వయస్సుల్లో గర్భ వతులైన వారు 18 మంది!

అన్నిట్లోనూ అతి విచిత్రమైన కేసు పెరూ దేశనివాసి లీనా మెడినాది. ఆమె 8-వ నెలనుంచే బహిష్టు కానారంభించిం ది. 3-వ ఏడు వొచ్చేప్పటికే ఆమె లైంగిక యంత్రాంగం పరిపూర్ణంగా పెరిగింది. ఆమె 4 సం. ల 10 నెలల వయస్సులో గర్భవతి అయింది; ఇంతకన్న తక్కువ వయ స్సులో గర్భవతైన వారు ప్రపంచంలో లేరు. 5 సం. ల 7 నెలలప్పుడు ఆమె పురుడు పోసుకుంది. ఆపరేషన్ ద్వారా బిడ్డను బైటికి తీయవలసి వొచ్చింది. బిడ్డ బరువు 6½ పౌనులు. తల్లీ పిల్లాడూవున్న వీరి బొమ్మ పక్క పేజీలో వేస్తున్నాము.

యీ చిన్నపిల్లల్లో లైంగిక యంత్రాం గం పరిపూర్ణంగా పెరిగినప్పటికీ, వీరిలో కామవాంఛ తలెత్తకుండటం సర్వసాధా రణమైన విషయం. తమ యీడు పిల్లల వలెనే వీరూ అమాయకంగా వుంటారు. తగిన వయస్సు వొచ్చేవరకూ దాంపత్యా నికి సుముఖులవరు. ఐతే కొద్ది వయస్సుల్లో కూడా రతికి సుముఖులైన ఆడపిల్లలు కూడా ఉంటారనేది కాదనలేం.

ఎంత చిన్నవయస్సులో బహిష్టు కని పించే అవకాశంవుందో, అదే విధంగా అంతపెద్ద వయస్సులోనూ మొట్టు ఎండని



వార్నిగూర్చి వైద్య చరిత్ర రికార్డు చేసే వుంది. 60, 70 సం.ల వయస్సులోనే గాక 93 సం. వయస్సులోకూడా సక్రమంగా బహిష్టవటం గమనించబడింది. ఏతే యీ బహిష్ఠు అండకోశం పక్వమైన గుడ్డును విడుదల చేయటమేనా అనేది సందేహాస్పదం. సర్వసాధారణంగా అండవాహికలో ఏర్పడే కణితివల్ల, లేదా లైంగిక యంత్రాంగంలో కలిగిన లోపాలవల్ల సంభవించవొచ్చు; అంటే ఇది స్వభావసిద్ధమైనది కాదు; వ్యాధి గ్రస్థత కూడా వి ఉండొచ్చు.

ఇలా వయసు మళ్ళాక కూడా బహిష్టవుతూ, గర్భాన్ని ధరించటం జరుగుతే అది స్వభావసిద్ధమైనదిగానే భావించాలి. 72 సం.ల వయసులో సక్రమంగా బహిష్ఠవుతూ గర్భాన్ని ధరించిన ఒక కేసు వైద్య చరిత్రలో వుంది. ఏమైనా వయసు మళ్ళాక బహిష్ఠవటం చాలా అరుదు; పై వయసులో స్త్రీల లైంగిక యంత్రాంగంలో కాన్సర్ ప్రవేశించే అవకాశం వుంది కనుక, ముట్లెండాక తిరిగి రక్తస్రావం కనిపిస్తే డాక్టర్ను చూడటం మంచిది.

ఇక యీ బహిష్టు స్రావం గర్భకోశం నుంచే బహిర్గత మౌతుందని మనకు తెలుసు. అలా కాకుండా శరీరంలోని ఇతర అంగాల నుంచికూడా యీ స్రావం రావటం కద్దు. మూడో వొంతు కేసుల్లో గర్భకోశం నుంచి కాకుండా, ముక్కు, కడుపు, ఊపిరితిత్తులు, చర్మం ద్వారాకూడా స్రావం వెలువడటం గమనించబడింది. ఐతే స్వభావసిద్ధమైన బహిష్టుతోపాటే, వేరొక శరీరాంగంనుంచి రక్త స్రావం వెలువడటం జరుగవొచ్చు; ఇలా కాకుండా బహిష్టు రోజుల్లో కాక, యీ స్రావం వేరు వేరు రోజుల్లో కనిపించినా కనపడొచ్చు.

1870 - 1920ల మధ్యవున్న వైద్యచరిత్ర చూస్తే ఇలాటి విచిత్రమైన కేసులు 225 కనిపిస్తవి. వీటిల్లో 167 కేసుల్లో (అంటే 70%) బహిష్టుతో పాటే ఇతర శరీరంగాల స్రావం కూడావుండేది; మిగతా వాటిల్లో బహిష్టుతో సంబంధం లేకుండానే వుండేది. యీ రెండో రకాన్ని బహిష్టు అనలేము. లైంగిక యంత్రాంగంలోని హార్మోనుల విడుదలకు సంబంధం లేకుండా, తిరిగి తిరిగి రక్త స్రావం కలగటంగా భావించ వొచ్చు.

బహిష్టుతో పాటే గర్భకోశం నుంచే కాకుండా వేరొక అంగంనుంచి కూడా రక్తం స్రవించటానికి శాస్త్రీయమైన కారణాన్ని తెలుసుకోవాల్సివుంది. అండకోశం విడుదలచేసే ఎస్ట్రోజిన్ అనబడే హార్మోను వల్లనే ఇది జరుగుతోంది. రీసస్ కోతులమీద చేసిన పరిశోధనల్లో ఎస్ట్రోజిన్ హార్మోను ఏ ముక్కుదగ్గర్నో వున్న మెత్తని చర్మంమీద (మ్యూకస్ మెమ్ బ్రేన్) ప్రయోగించటం వల్ల, లోని రక్తనాళాల్లోకి ప్రవేశించి, రక్తాన్నితోడి తేవటం జరిగిందని నిర్ధారణ చేయబడింది. బహిష్టుకు ముందు అండకోశం ఈ హార్మోనుల్ని విపరీతంగా విడుదల చేస్తుంది; హార్మోనులు దగ్గర్లోవున్న ఇతర అంగాల మీద దాడిచేసి, రక్త స్రావాన్ని కలుగజేయటం జరుగుతోంది. ఇది శారీరకమైన మార్పు. కాని మానసికంగాకూడా ఇది సాధ్యం. మెదడు కంట్రోల్ చేయగలిగిన యీ హార్మోనులు, మానసిక పరిణామాల ఫలితంగాకూడా విడుదలవటం కద్దు. ఒకానొక కేసులో కామవాంఛలు తీరక బాధపడే స్త్రీ, ముక్కు ద్వారానూ, ఒకోసారి బాహుమూలల ద్వారానూ రక్తాన్ని స్రవించటం జరిగింది. ఈ కేసు ఆధారంగా కేవలంమానసిక పరిణామమే యీ రక్త స్రావానికి కారణభూతమౌతోందని ఖచ్చితంగా చెప్పగలం.

గర్భకోశం ద్వారా కాకుండా, వేరొక అంగంనుంచి రక్తం స్రవించటానికి మరో కారణాన్నికూడా చూపవచ్చు. బహిష్టు స్నానమయాక, గర్భకోశం తిరిగి కొత్తగా సన్నని మెత్తని పొరను తయారుచేస్తూ, నెల తిరిగేప్పటికి, గుడ్డు పొదగబడినట్లయితే, దాన్ని పెంచేందుకు సిద్ధంగా తయారవుతూ వుంటుందని లోగడ తెలుసుకున్నాం కదా? ఒకొకప్పుడు యీపొరలు గర్భకోశపు కండరపు గోడల నుంచి విడివడి, రక్త ప్రవాహంలో కొట్టుకొనిపోయి, ఇతర శరీరాంగాల్లో స్థావరాల్ని ఏర్పరుచుకుంటవి; అండకోశం ఎస్ట్రోజిన్ హార్మోనుల్ని విడుదల చేసినప్పుడు, గర్భకోశంలో ఎలాంటి మార్పులు జరుగుతవో, పైన చెప్పిన సన్నని పొర స్థావరాల్ని ఏర్పరచుకొన్న ఇతర అంగా

లలో కూడా అలాటి మార్పులే జరిగి, రక్తస్రావం కనిపిస్తుంది; యీ కారణంగానే బహిష్టుతోపాటే, మరో శరీరాగంకూడా రక్తాన్ని స్రవించటం జరుగుతోంది. ఒక వేళ యీ రక్తానికి బైటపడే సావకాశం లేనట్లయితే, అది గడ్డకట్టి, కణితిగా తయారై, శస్త్రచికిత్సను ఎదురు చూడవలసి వుంటుంది.

కొన్ని సంవత్సరాల క్రితం 19 సం. ల వయసున్న కుర్రవాడు వైద్య పరీక్షకు తీసుకొని రాబడినాడు. అతని శారీరక లక్షణాలన్నీ పురుషత్వాన్నే చూపుతున్నవి; కాని, రొమ్ములు మాత్రం ఆడపిల్లలోవలె బాగా పెరిగినవి. అతనిలో తగినంత స్త్రీవాంఛవుంది. ఐతే అతని 15-వ ఏట నుంచీ నెలనెలా పురుషాంగం నుంచి రక్తస్రావం జరుగుతూనే వుంది; ఇది సరిగ్గా స్త్రీలో కనిపించే బహిష్టును పోలివుంది. పరీక్షించగా అతని బీజాల సంచిలో ఒక్క బీజమే వుంది; రెండో ప్రక్క కాళీగావుంది. తీరా శస్త్రచికిత్స చేస్తే, ఒక చిన్న గర్భకోశమూ, అండవాహిక, సక్రమంగా పనిచేస్తూన్న అండకోశమూ కనిపించినవి. యీ వ్యక్తిలో అటు పురుషచిహ్నాలూ, ఇటు స్త్రీచిహ్నాలుకూడా ఉన్నవి. ఇలాటివి చాలా అరుదు. క్రోమోజోముల కలయికలో ప్రకృతి అతని సెక్సును నిర్ణయించ లేక కాలయాపన చేసిందని చెప్పుకోవొచ్చు. యీ వ్యక్తిలో కనిపించిన రక్తస్రావం సరిగ్గా బహిష్టే! ఎందుకంటే యోని మినహాగా స్త్రీకి ఉండవలసిన లైంగిక యంత్రాంగమంతా వుంది కనుక.

ఆడ, మగ రెండు లక్షణాలూ ప్రస్ఫుటంగా కనిపించే వ్యక్తుల్లో చాలా మంది స్త్రీవలెనే నెలనెలా రక్తస్రావాలకు గురవుతూ వుంటారు. మరి కొంత మందిలో అటు స్త్రీకో, ఇటు పురుషునికో సంబంధించిన ఒకే ఒక్క బీజం—అండకోసం కానీ, బీజంకానీ—కలిగివుండి, మిగతా లక్షణాలన్నీ విరుద్ధజాతిని సూచించేవిగా ఉంటాయి. వీరిలో అండకోశం వున్నవాళ్ళే సక్రమంగా రక్తస్రావానికి గురవుతూ వుంటారు. కారణం ఇది: ఎప్పుడైతే అండకోశమంటూ వుందో, అది ఎస్ట్రోజిన్ అనబడే హార్మోనుల్ని విడుదల చేస్తుంది; ఫలితంగా రక్తస్రావం స్వభావసిద్ధంగానే జరిగితీరాలి. ఐతే వీరిలో యోనికి మారుగా పురుషాంగం ఉండటం వల్ల యీ స్రావం దానిగుండానే బైటపడుతూంటుంది.

యీ కారణంగానే యవ్వనారంభంలో కొంతమంది మొగపిల్లల్లో నెలనెలా పురుషాంగంనుంచి రక్తం స్రవించటం కద్దు; అలాటివారిని శస్త్రచికిత్స చేసినప్పుడు, కడుపులో బాగా పెరిగిన అండకోశం ఉండటం తథ్యం. ఇదే విధంగా బాహ్యలక్షణాలన్నీ ఆడపిల్లకువలె ఉండి, ఎంత వయస్సువొచ్చినా బహిష్టు కనిపించని వారున్నారు.

ఇలాంటి ఒక కేసు—ఆమె వయస్సు 30 సం. లు. 22-వ సం. లో వివాహమాడి, దాంపత్య జీవితంలో ప్రవేశించింది. రతి సౌఖ్యాన్ని పొందుతుంది; రొమ్ములు సాధారణంగా పెరిగినవి. కాని ఎన్నడూ బహిష్టు నెరగదు; రతిలో ఎలాటి బాధా లేదు సరికదా, ఆమె రత్యానందాన్ని కూడా పొందుతోంది. తీరా వైద్య పరీక్షలు జరిగి, శస్త్రచికిత్స జరిగినప్పుడు ఆమె కడుపులో గర్భకోశంకానీ, అండ

కోశాలు కానీ కనిపించలేదు; వీటికిమారుగా బీజాలసంచీ, బాగా పెరిగిన రెండుబీజాలతో సహాఉన్నవి. నిజంగా 'ఆమె' ఆమె కాదు; 'అతను'. ఐతే అంతర్లక్షణాల్లో, అతను ఐనా, బాహ్యలక్షణాలన్నీ 'ఆమె' గానే ఉండిపోయినవి. ప్రకృతి నిర్ణయంలో చేసిన తాత్సారమే యీ విచిత్రానికి కారణం.

మరి కొంతమంది స్త్రీలలో అండకోశాలూ, గర్భకోశం వున్నప్పటికీ, తగిన వయస్సువొచ్చినా రజస్వలలు కాకుండటం చూస్తూనే వున్నాం. కారణాలకు వొస్తే అండకోశం తగినంత పరిమాణాల్లో ఎస్ట్రోజిన్ హార్మోనుల్ని విడుదల చేయకుండటమేనని చెప్పుకోవాలి. ఇది జరగనంతకాలం బహిష్టు అసంభవమైనదిగానే వుండిపోతుంది.

కొంతమంది పురుషుల్లో వారి 30-40 సం. ల మధ్య పురుషాంగం ద్వారా బహిష్టు కావటం కూడా జరుగుతోంది. ఐతే వీరిలో పురుషలక్షణా లున్నప్పటికీ అంతరాంతరంగా స్త్రీ లైంగిక యంత్రాగం పనిచేస్తూవుందని అనలేము; ఇలా అనాలంటే ఇన్నాళ్ళూ కనిపించని యీ బహిష్టు లక్షణం పై వయసుల్లో ఎందుకు బైటపడాలనే ప్రశ్న వొస్తుంది కదా! అదీగాక వీరు తృప్తికరంగా దాంపత్యాన్ని నిర్వహించటమేగాక, బిడ్డల తండ్రులయ్యారు కూడాను; అంటే వీరి లైంగిక యంత్రాంగం పురుషునికి సంబంధించే వుండి, చాలా సక్రమంగా పనిచేసిందనాలి. మరి కారణమేమిటి?

యీ రక్తస్రావం, పురుషాంగం ద్వారా జరుగుతూన్నప్పటికీ, స్త్రీ లైంగిక యంత్రాంగానికి సంబంధించిందని చెప్పలేము. కాని యీ స్రావం యురేత్రా నుండి జరుగుతోందని మాత్రం నిర్ణయించగలం; మూత్రద్వారాల్లోనూ, మూత్రపిండాల్లోనూ వ్యాధిఏదన్నా ప్రవేశించటం, లేదా కణితి ఏర్పడటంవల్ల దాని తాలూకు చెడురక్తం పురుషాంగం ద్వారా బహిర్గత మౌతూండాలి; ఐతే ఇందువల్ల బాధ కనిపించకా పోవొచ్చు. ఇది ఉండి ఉండిరావటం కద్దు; ఒక్కొక్కప్పుడు దాన్నిగూర్చే ఆలోచించటం వల్ల, మానసిక కారణాలవల్ల, సరిసమాన కాలపరిమితిలో బైటపడుతూన్నట్లయితే, బహిష్టుగానే భావించబడే అవకాశం ఏర్పడుతోంది.

లోన ఏదన్నా అండకోశం వున్నదేమో తెలుసుకునేందుకు శస్త్రచికిత్సే అవసరం అనుకోవటం శుద్ధ పొరపాటు. ఎందుకంటే బహిష్టు రక్తానికీ, ఇతరత్రా వెలువడే రక్తానికీ చాలా భేదంవుంది. ముఖ్యంగా బహిష్టు రక్తం గడ్డకట్టదు. దుర్భిణికింద పరీక్షచేస్తే బహిష్టు రక్తం, మామూలు రక్తంలో వుండవలసిన అనేక చిహ్నాలను కలిగివుండదని తేలుతూంది. బహిష్టు రక్తంలో తెల్ల రక్తకణాల సంఖ్య అధికమే కాకుండా, గర్భకోశం విడుదలచేసే మ్యూకస్ మెంబ్రేన్ అనబడే సన్నని, మెత్తని పొరతాలూకు చిన్న చిన్న ముక్కలు స్పష్టంగా కనిపిస్తవి.

చరిత్ర తిరగేస్తే స్త్రీ బహిష్టవటాన్ని గూర్చి మానవుడు మొదట్లో చాలా భయపడ్డాడు. రక్తమంటే వుండే భయమే దీనికి కారణం. ఇది స్వభావసిద్ధమైన క్రియాకాండని తెలుసుకోలేక అసలు స్త్రీనే

బహిష్కరిద్దామనుకున్నాడు; కాని స్త్రీ లేకుండా జీవితమే నిస్సారం కనుక కొన్ని ఆంక్షల్ని విధించాడు. అనేక నియమాలు - బహిష్టు స్త్రీని గూర్చినవి, రకరకాలుగానూ అనేక మానవ సమాజాల్లో కలకాలంగా ఆచారాలుగా ఉంటూన్నవి. (చూ॥ హేవలాక్ ఎల్లిస్ ఋతు ధర్మాలు.)

బహిష్టు రక్తం విషసమానమనీ, అన్ని రకాల జీవరాసుల్నీ అది సర్వనాశనం చేయగలదనీ, చివరకు దానిగాలి తగులుతేనే పంటలూ, పూలమొక్కలూ మాడి పోతవనే నమ్మకం అనేక నాగరికజాతుల్లో సైతం నేటికికూడా ఉన్నది. ఐతే ఇదంతా తెలిసే పూర్వీకులు యీ ఆచారాల్ని ఏర్పరిచారని యీ నాడు అనలేము. వాళ్లు భయపడిన కారణాలు లేరు. ఉన్నదాన్ని గోరంతలు కొండంతలుచేసి కట్టుకథలు కల్పించి, ప్రచారం చేశారు. మరి శాస్త్రీయమైన వాదన ఏమిటనే ప్రశ్న రాకమానదు.

బహిష్టు రక్తాన్ని గూర్చిన కథలు, కేవలం కట్టుకథలే కాదనీ, కొంతవరకూ నిజంకూడా ఉన్నదనే సంగతి ఆమధ్యనే శాస్త్రకారులు నిర్ణయించారు. ఒక దశాబ్దం క్రితం ఒకానొక శాస్త్రకారుడు మానవ శరీరం బహిర్గతంచేసే చెమట, ఉమ్మి, రక్తం, ముఖ్యంగా బహిష్టు స్రావం — వృక్షజాతులకూ, కొన్ని క్రిములకూ విషసమానమేనని రుజూచేశాడు. కొద్ది సంవత్సరాల తర్వాత బహిష్టు రక్తం చాలాకొద్ది మోతాదుల్లో ఎలుకలకూ, కుందేళ్ళకూ ఇంజక్షన్ చేస్తే, కొద్ది కాలంలోనే అవి చచ్చినవి.

సూక్ష్మంగా పరిశీలించగా బహిష్టు స్రావంలో ఒకానొక రసాయనిక పదార్థం (Menstrul toxin) ఉన్నదనీ, ఇది గర్భకోశం నుంచికానీ, వేరొక అంగం నుంచికానీ నెత్తురు కక్కేట్లు చేయగలదనీ, ఆ కారణంగానే ఇది విషసమానమనీ తేలింది.

యీ రసాయనిక పదార్థం ఇతర జీవాలకు ఇంత ప్రమాదంగా పరిణమిస్తూంటే, మరి స్త్రీ ఆరోగ్యానికి ప్రధాన లక్షణంగా ఎందుకు ఉన్నదనే ప్రశ్న వొస్తుంది. బహిష్టుస్రావంలోని రసాయనిక పదార్థం, నిజానికి కొంత కొంత భాగంలో ఆమె రక్త ప్రవాహంలో కలిసిపోక తప్పదు. ఇది పిట్యూటరీ గ్రంధినిజేరి, తిరిగి బహిష్టు అయేందుకు, అంటే అంతకు ముందుగా అండకోశం మరో గుడ్డును పక్వంచేసేందుకు గాను ఉద్రిక్తపరుస్తుంది. అంటే స్త్రీ ఆరోగ్యం చెడదు సరికదా, సృష్టి విస్తరణకు యీ రసాయనిం పదార్థం ప్రముఖపాత్రను వహించ గలుగుతోంది.

మరోముఖ్యమైన విషయాన్ని ఇక్కడ తెలుసుకోవాలి. కోటానుకోట్ల జీవరాసుల్లో బహిష్టు ఒక్క కోతుల్లోనూ, మానవుల్లో మాత్రమే ఉండటానికి కారణం ఏమిటి? చివరకు స్తన జాతులన్నిటిలోకూడా ఇది కనిపించదు-ఎందుకని?

దీనికి శాస్త్రకారుల జవాబిది: ఇతర జీవరాసుల్లో బహిష్టు కనిపించక పోయినా, అవి ఎద అయే సమయమంటూ, ఒక ఋతువు అంటూ ఉంది; మానవుల్లోని బహిష్టు కామోద్రేకాలకూ, సృష్టి విస్తరణలకూ ఒక హెచ్చరిక లాటిదనీ, ప్రకృతి ఏర్పరిచిన ఒకానొక స్వభావసిద్ధమైన అవ

సరమనీ అనుకునేట్లయితే, తక్కువ రకం జీవరాసుల్లో ఇదే వేరొకరూపంలో కనిపిస్తుంది. ఐతే మానవుని ఆధిక్యతఏమిటి? యీ బహిష్టు మానవుల్లో ఉండటంవల్ల ప్రకృతి కొత్తగా సాధించే దేమిటి?

సృష్టిలోని జంతు జాలానికంతకూ మానవుడు చక్రవర్తి ఐనాడంటే, కారణం అతని మెదడే! మిగతా శరీరాంగాలు ఎంత బలవత్తరమైనప్పటికీ, జంతుజాలాన్ని పరిపాలించి తన బొటనవేలుకింద ఉంచుకోగలగటం మెదడులేనిదే కుదిరేదికాదు. ఇక యీ మెదడు, శరీరంలోని ప్రతి అంగాన్నీ తన అధీనంలో ఉంచుకోగలుగుతోంది. ముఖ్యంగా సెక్సు యంత్రాంగంమీద దీని పలుకుబడి చాలా గొప్పది.

'బుర్రలోని బుద్ధి పుడకల్తోతప్పపోదు' అనే సామెతలోని సత్యమే దీన్ని రుజూ చేయ గలదు. బుర్రలో ఆలోచనలేనిదే కామానికి ఆకారమే రాదుకదా! ఇంత ఆలోచనలున్న బుర్రకు తగినట్లుగానే శారీరకంగా జరిగేమార్పులు బుర్రకు ఉపారిస్తూ, దాన్ని స్టిమ్యులేట్ చేయవలసిన అవసరం ఎంతైనావుంది. పైన చెప్తున్న బహిష్టు స్రావంలోని రసాయనిక పదార్థం మెదడుకుకూడా కొత్త ప్రోత్సాహాన్నీ, ఉత్సాహాన్నీ ప్రసాదిస్తోంది. ఏ కారణంవల్లనన్నా శరీరంలో హార్మోనుల సరఫరా తగ్గినట్లయితే, వాటిని పూరించేందుకు వివిధ గ్రంధులకు ఉపయుక్తంగా ఉండే కర్మకాండ కొంత అవసరం అనుకుంటే, దాన్ని పూరించేందుకే బహిష్టు అనే సమాధానం వొస్తుంది.

సృష్టిలోని ఏ జీవరాశి నశించనీ, మానవుడు మాత్రం స్వజాతిని విస్తరిస్తూ కలకాలం బతికి ఉండటమే ప్రకృతి లక్ష్యం. ప్రకృతికూడా మానవుణ్ని మించిన జీవిని తయారుచేయులేదు కనుక, మానవుణ్ని కాపాడేందుకు సర్వవిధాలా ప్రయత్నిస్తోంది. బహిష్టును ఏర్పరిచి, సృష్టి కార్యకలాపాలకు కొత్త ఉత్సాహాన్నిచ్చింది. విశాల భావంతోచూస్తే సృష్టి విస్తరణలో బహిష్టుకు చాలాగొప్పస్థానం వుందని అర్థంకాక పోదు. ★



# నపుంసకుల మనస్తత్వాలు



కామ వాంఛలు తగ్గుముఖం పట్టటంవల్ల పురుషుల్లో మానసికమైన అనేక మార్పులు రావటం తథ్యం. రెండు సంవత్సరాలుగా కామవాంఛలు సన్నగిల్లుతూ వొచ్చిన 50 కేసుల్లోని రోగుల మీద పరిశోధనలు జరిగినవి. ఇలాంటి పురుషుల ప్రవర్తన చిత్ర విచిత్రాలుగా యీ కిందచూపిన విధంగా వుంది.

1. తాగుడుకు అలవడటం... 14 మంది
2. భార్యమీద తిరగబడటం .. 7
3. విడాకులు పొందటం... 6
4. విరాగులవటం... 4
5. మందులకు అలవడటం... 2
6. భార్యలకు కానుక లివ్వటం... 2
7. ఆత్మగౌరవాన్ని కోల్పోవటం... 2
8. జూదగాళ్ళవటం... 2
9. ఆత్మహత్యా ప్రయత్నాలు... 1
10. కుదరని వ్యాధిగ్రస్థుడయ్యాననే బాధతో ఉండటం... 10

యీ పైన చూపిన వ్యక్తుల ప్రవర్తన మానసిక యంత్రాంగంలో కలిగే మార్పుల ఫలితమేనని చెప్పవలసి వుంటుంది. ఇక యీ ప్రవర్తనను విశదీకరించి చూద్దాం.

## 1. తాగుడుకు అలవడటం

జీవితపు వొత్తిడినుంచి తప్పించుకొనేందుకు తాగుడు చాలావరకు ఉపకరిస్తుందనే విషయం కలకాలంగా అనుభవజ్ఞులు రుజూ చేస్తూనే ఉన్నారు. ప్రస్తుతానికి ఆమత్తులో యీ ప్రపంచపుబాధలు తప్పుతవని వారి భావన. దీనికి తోడుగా తాగటంవల్ల కామవాంఛలూ, పురుషత్వం పెరుగుతవనే నమ్మకంకూడా వుంది. ఐతే ఇది పొరపాటే! తాగుడువల్ల అప్పటికి మానసికంగా వేధిస్తూన్న భయాలు తొలగి, తాత్కాలికంగా పుంసత్వం పెరిగినప్పటికీ, దీనివల్ల నిజానికి పుంసత్వం పెరుగుతుందటం భ్రమ.

దాంపత్య జీవితంలో, అసంతృప్తి కలగటం, తమ భార్యలకు రతి సౌఖ్యాన్నివ్వలేని స్థితి ఏర్పడినట్లు భావించి, మానసికాందోళన ఫలితంగానే చాలా మంది పురుషులు తాగుడు అలవాటు చేసుకోవటం జరుగుతోంది. ఇందువల్ల తాము ఎదుర్కొని జయించవలసినదాన్ని మరిచిపోయి వాయిదా వేయగలుగుతున్నామనీ, ఉత్తరోత్రా తమ పుంసత్వం పెరుగుతుంది కనుక, భార్యల్ని తృప్తిపరచగలమనే నమ్మకంలో ఉంటున్నారు. కాని నిజంగా జరిగే దేమంటే తమ పుంసత్వం అనే సమస్య అలాగే ఉండిపోయి, యీ తాగుడు దురభ్యాసానికి ఎరకావటమనే క్రొత్త సమస్య ఎదురవుతోంది. ఇదివరకటి ఒక సమస్య, రెండు సమస్యలుగా పరిణమిస్తూన్నది.

## 2. భార్యమీద తిరగబడటం

పుంసత్వంతో భార్యను తృప్తి పరచలేని పురుషుడు, ఆ సంగతేమీ ఆమె మాట్లాడే అవకాశం లేకుండా ఉండేందుకు, ఒక విధంగా ఆమెతో విరోధం పెట్టుకోవటమే మంచిదిగా భావించటం సహజం. దీని పరిణామమే కస్సుబుస్సుమనటం, అనవసరంగా చిర్రుబుర్రులాడుతూ ప్రతి చిన్నవిషయానికీ విపరీతార్థాల్ని కల్పించి, ఆమెను తిట్టటం, ఒక్కొక్క సందర్భంలో చెయ్యిచేసుకోవటం కూడా జరగవొచ్చు. ఆమె తన పురుషత్వానికి ఒక 'ఛాలెంజ్' అనే భావనలో, రాజమార్గాన తనకు ఓటమి తప్పదు కనుక, యీ దొంగదార్లలోపడి, సామాజికంగానూ, ఆర్థికంగానూ తనకున్న బలాన్ని దుర్వినియోగపరుస్తూ ఆమెను గాయపరిచి తృప్తిపడే మనస్తత్వం ఏర్పడుతుంది.

మొదటిసారి దాంపత్య నిర్వాహణలో తనకు ఓటమి సంభవించిందని తెలుసుకోగానే పురుషుడు మానసికంగా ఎంతో కుంగిపోతాడు. పురుషత్వానికి గర్వపడుతూన్న తను, ఎందుకూ కొరగానివాడుగా, అందునా తన స్త్రీ ముందు అవమాన పడిపోయినంత బాధకు గురవుతాడు. మనసులో యీ అనుమానం వేధిస్తూ వుంటుంది; మరొకసారి ప్రయత్నిస్తే తను విఫలుడవుతాడనే శంక ఉండటమే చాలు - నిజంగా ఓటమిని వరించేందుకు. యీ విధంగా రోజులు గడిచేకొద్దీ తన నపుంసకత్వమే రుజూఅవసాగుతుంది. దాంతోపాటే అతని ధోరణిలో విపరీతమైన 'ఇరిటేషన్' కనిపిస్తుంది, తిరిగి అతుకుపడటం అనుమానమనేంతవరకూ దాంపత్య సౌఖ్యం చెడటంలో ఆశ్చర్యం ఉండదు.

ఈ జాతికిందికి వొచ్చిన ఇద్దరు పురుషులకు తమ భార్యలపట్ల ఎంత కసి ఏర్పడిందో చూడు; తమ అసమర్థతకు బతికివున్న సర్టిఫికెట్లవలె కళ్ళఎదుట తిరుగులాడే తమ స్త్రీలను గొంతు పిసికి చంపేద్దామనే ఆలోచనవరకూ వెళ్ళారు.

తమాషా ఏమంటే - ఏ కారణంవల్లకానీ పురుషుడు ఒక సమయంలో స్త్రీకి రతి సౌఖ్యాన్ని ఇవ్వలేక పోయినప్పటికీ, స్త్రీ తన భర్త వొట్టి దద్దమ్మ అని వెంటనే తేల్చుకోదు. అసలు తమ భావాల్ని వెల్లడి చేయకుండా, కనీసం సూచనగానన్నా తెలియకుండా ఉండేందుకే స్త్రీలు ప్రయత్నిస్తారు; వారి సిగ్గే, వారి భర్తల ప్రవర్తనలపట్ల తమ అభిప్రాయాల్ని మరుగుపరుస్తుంది. దాంపత్య జీవితంలో ముందు ముందు క్రొత్త రుచుల్ని చూడొచ్చనే సహనంతోనే, భార్య భర్తను అపార్థం చేసుకోదు. ఐతే భర్త మాత్రం తనను తాను అపార్థం చేసుకొని, తన స్త్రీ తనను గూర్చి తలచని అపేక్ష విషయాల్ని చర్చించుకొని, నమ్మి తన గొయ్యి తానే తీసుకుంటూ, గాయపడి, ఆమెను నిష్కారణంగా ద్వేషించేంతవరకూ వెళ్తున్నాడు. ఇక తన సమర్థతను చెయ్యి చేసుకోవటం ద్వారా చూపి, ఆమెను భయపెట్టయినా సరే తన ఆధీనంలో ఉంచుకోవాలనే ప్రయత్నాలు చేస్తాడు.

## 3. విడాకులు పొందటం

పై రకం మనస్తత్వమే పెరిగి పెరిగి, ఇక తమ పురుషత్వం భార్యముందు లాభంలేదని నిర్ధారణ చేసుకొని విడాకుల ద్వారా విముక్తి పొందటం మంచిదని తేల్చుకున్నారు. యీ విధంగా తమను తాము కాపాడుకో గలిగామని వారు భావించారు.

## విరాగులవటం

మాటి మాటికీ తమ పురుషత్వం తమ గౌరవాన్ని నిలబెట్టక పోయిందని కుంగి పోతూ, మనస్సు వికలమై, మరోమార్గం కానక, కేవలం మనశ్శాంతిని పొందేం దుకు మత్తైకంగానూ, దైవభక్తి తత్పర తల్లో నిమగ్నులయ్యారు. మొదట్లో యీ వ్యక్తులకూ, లైంగిక అనుభవమంటే వున్న ఇష్టం, రతి సౌఖ్యాన్ని పొందాలనే ఆతృతా అధికంగా వున్నప్పటికీ, తీరా సర్వం సిద్ధంగా ఉన్నప్పుడు తమ చేత కాని తనంతో బాధపడి — చివరకు ద్రాక్షపళ్లు అందని నక్క సామెతగా మనసు మార్చుకుంటున్నారు.

యీ మనుషులు మారాక సెక్సును గూర్చిన వారి అభిప్రాయాలు కూడా పూర్తిగా మారిపోతవి. యీ ప్రపంచమే మాయ అనీ, స్త్రీ వ్యామోహంలో పడి పురుషులు మూర్ఖులవుతున్నారనీ, సంసా రం సాగరం కనుకనే తాము భగవ ధ్యానంలో ఒడ్డు పట్టామనీ, రతి నీచమైనది, తమ పతన కారణమనీ శ్రీరంగనీ తులు వల్లించ సాగుతారు. చివరకు తమకు తాము జవాబు చెప్పుకుంటూ మహా ఋషులన్న కొన్ని వేదవాక్యాల్ని స్మరిం చుకుంటూ, సెక్సుతో మిళితంకాని జీవి తమే అతి పవిత్రమైనదనే నమ్మకంతో ఆత్మద్రోహం చేసుకుంటున్నారు. యీ రకంగా వీరు ప్రస్తుత సమస్యను ఎదు ర్కొలేక పక్కదార్లలో, తప్పించు కుంటున్నారు.

తమాషా ఏమంటే భూలోకంలో వారికి యీ మధ్యనే ఏర్పడిన యీ స్త్రీ విముఖత కారణంగా, వీరిదృష్టి ఊర్ధ్వ లోకాలవైపు మళ్ళుతోంది. పవిత్ర జీవితంతో వీరు సాధిం చేది స్వర్గం. ఐతే ఆ స్వర్గంలో కూడా రంభా, ఊర్వసులు తమకోసం ఎదురు తెన్నులు చూస్తూంటారని వీరికి తెలియ దేమో! ఒకవేళ తెలిసినా, వారికోస మయే యీ కొత్త బురఖా వేసుకొని ఉం డొచ్చు... కాని తమ యీ నపుంసకత్వం మాటేమిటి? బహుశా ఆ లోకంలోకి వెళ్ళగానే కొత్త మనుషులుగా తయారై నిత్య యవ్వనంలో ఉండొచ్చని పురా ణాలు ఘోషిస్తున్నవి కనుక, వాటిని అవసరార్ధం నమ్మటానికి వీరు వెనుదీ యరు.

## 5. మందులకు అలవడటం

ఎదుర్కొన్న సమస్యల్ని స్వశక్తితో సాధించ లేనివారు తాగుడన్నా అల వాటు చేసుకుంటారు; లేని పక్షంలో మందు మాకులన్నా సేవిస్తారు. మరీ పురుషత్వం సన్నగిలింది కనుక, ఏలాగైనా దాన్ని పెంపొందించి యీ సంగ్రామంలో విజయాన్ని సాధించాలనే పట్టుదలతో కనిపించిన మందులన్నీ, ఎంత ఖరీదో కూడా చూడకుండా మింగుతుంటారు. ఐతే త్వరలోనే యీ మందులు నిరుప యోగాలనే సత్యాన్ని అనుభవ పూర్వ

కంగా తెలుసుకో గలుగుతారు. యీ మందులు చేయగలదల్లా — తాత్కాలి కంగా వేడిపుట్టించటం; అంతకు మినహా కొత్త పురుషత్వాన్ని ప్రసాదించలేవు; సరికదా వీటికి అలవడితే వున్న కాస్త పుంసత్వంకూడా పోతుందనేది తథ్యం.

## 6. భార్యలకు కానుక లివ్వటం

తన స్త్రీని దాంపత్యంలో తృప్తి పరచలేని స్థితి వొచ్చిందనగానే పురుష నికి భయం పట్టుకుంటుంది. తన వలెనే స్త్రీ కూడా, స్థబురాలుకాదు కనుకా, ఆమెలో కలిగే సహజ కామవాంఛల్ని తాను తీర్చలేదు కనుకా, ఆమె తన తృప్తికోసం వేరొక పురుషుణ్ని వెతు క్కుంటుందేమోననే భయం పీడించ సాగుతుంది. యీ తలపు రాగానే భార్య మీద విపరీతమైన కోపం వొస్తుంది; దాన్ని తీర్చుకునేందుకు ఆమెను చావ బాదవొచ్చు. ఐతే ఇందువల్ల సమస్య తీరదు సరికదా మరింత విషమస్థితికి దిగు తుంది. ఇదివరకు చూసీ చూడనట్లు, కనీ సం ఎదుటపడి, భర్తగా తనకు కామ తృప్తిని ఎందుకు ప్రసాదించవు అని అడగ లేని స్థితిలోవున్న భార్యను, బాధించి, తెగబడేట్లు చేయటం అవుతుంది. యీ బాధకు ఓర్వలేక ఆమె యీ ఉన్న రహ స్యాన్ని నలుగురి ఎదుటా బైట పెట్టిం దంటే, ఇంతకుముందు తనకూ తన భార్యకు మాత్రమే తెలిసిన తన ప్రతాపం, ఇప్పుడు ఊరంతా తెలుస్తుంది. నపుంసకుడుగా తయారయ్యే ననేది పెద్ద బాధకాదు; ఒక వేళ బాధ ఐనా, దాన్ని అనుభవించక తప్పేది లేదు. కాని పదిమందికీ యీసంగతి తెలుస్తే ఇక తలెత్తుకొని తిరిగే అవకాశం వుండదు. తన లోపాన్ని భరించగల వారు, వాటికి జరిగే ప్రచారాల్ని ఏవిధంగానూ భరించ లేరు. ఇక కుటుంబ గౌరవమూ, తన వ్యక్తి త్వపు విలువలూ ఒడ్డటమే అవుతుంది. అదీ గాక యీరకంగా భార్యపట్ల కఠినంగా ప్రవర్తించేట్లయితే, ఆమెలో ద్వేషం పెరిగి, ఎప్పుడో, ఇక తట్టుకోలేని స్థితిలో మరొక పురుషుని కోసం వెతుక్కుంటుం దేమో నన్న తన అనుమానాన్ని, ఇప్పుడే వెను వెంటనే నిజం చేసినా చేయవొచ్చు. తన సమస్యే కాకుండా, కుటుంబ మంతకూ సంబంధించిన యీ గౌరవాన్ని గమనించిన భర్త సౌమ్యంగా వుండే వేరొక మార్గాన్ని అన్వేషిస్తాడు.

మనిషిమీద వుండే అభిమానాన్నీ, ప్రేమనూ వెల్లడించేందుకు, అందునా స్త్రీలపట్ల ఐతే కానుకల్ని నిష్కార ణంగా, అసందర్భంగా ఇవ్వటమనేది మానవునికి కలకాలంగా తెలిసిన ప్రక్రియే!

లైంగికంగా ఆమె పోగొట్టుకొన్న ఆనందం వేరొక రూపంలో - నగలూ, నాణాలూ, చీరెలూ మొదలైనవాటితో పొందాలని భర్త ఆశయం. ఇక తన అస మర్థతకు యీ బహుమతులు, అపరాధమని అతను సరిపెట్టు కుంటాడు. యీ కాను కలమోజు ఆమె కామ వాంఛల్ని కమ్మి వేయ గలదనీ, అందువల్ల తనను వేధించ కుండటం, వేరొక పురుషునికోసం వెత కటం వాయిదా వేయబడటం జరుగు తుందని ఆశ. ముసలివాడు పడుచుపిల్లను పెళ్ళాడ గలిగేందుకు డబ్బేకదా ప్రధా నం. యీ సూత్రంతో ప్రపంచాన్ని జయించట మనేది నిత్యజీవితంలో మనం

చూస్తూనే వున్నాం. లంచం పెట్టి పనులు చేయించుకోవటం లాటి పద్ధతి ఇది.

ఐతే ఇది ఎంతవరకూ సాధించ బడుతోందనేది వేరొక ప్రశ్న. తాత్కాలికంగా ఆమె మనసు యీ కానుకలవల్ల సంతోషంగా వున్నప్పటికీ, స్వభావ సిద్ధమైన కామవాంఛలు అణుగుత వనుకోటం అసాధ్యం. త్వరలోనే ఆమె యీ కానుకల వెనుకవున్న రహస్యాన్ని గ్రహించ గలుగుతుంది. డబ్బుతో తనను కట్టి పారెయ్యాలనే భర్త నీచాభిరుచిని ఏవగించుకోవటం, అతన్ని దద్దమ్మగా భావించటం, కామవాంఛలు తీర్చుకొనే దొంగ దార్లను వెతికి సాధించటం సర్వ సామాన్యమైన విషయం. ఏడబ్బుతో ఐతే తన భర్త తన ప్రేమను పొందాలని వ్యర్థ ప్రయత్నం చేస్తున్నాడో, తనపట్లవున్న ప్రేమను నటించి తనను మోసం చేస్తున్నాడో, ఆడబ్బుతోనే తనూ, తనకు కావాల్సిన కామ తృప్తిని పొందేందుకు ఎందుకు ప్రయత్నించదు? యీ కారణంగానే పెద్దిళ్ళలో చాటునా, మాటునా జరిగే రహస్య వ్యభిచారం కొనసాగుతూ వుంది.

## 7. ఆత్మగౌరవాన్ని కోల్పోవటం

కొంతమంది పురుషులు తమలో ఏర్పడిన నపుంసకత్వాన్ని చాలా సీరియస్‌గా భావించి, తాము కొరగాని వారుగా తయారయ్యామని భావిస్తారు. ఎంత ప్రయత్నించినా తాను దాంపత్య సౌఖ్యం అనుభవించి, తన భార్యను సుఖపెట్టలేక పొయ్యాడు కదానని కించపడి, మరో మార్గమేదీ కానక, వేరెవ్వరితోనూ చెప్పుకుందుకూ వీలులేక, చివరకు తనను తానే నిందించుకో సాగుతాడు. నిత్యజీవితంలో మరి దేనిమీదా మనసు నిలవదు; గొప్ప నిర్లక్ష్యభావం ఏర్పడుతుంది. జీవితం నిస్సారంగానూ, అర్థరహితంగానూ తోస్తుంది. తాను పరిపూర్ణమైన నపుంసకుడుగా తయారయ్యానని కుంగిపోతూ, బాహ్యప్రపంచంమీద చూపే నిర్లక్ష్యతా, ఏవగింపూ తనమీదనే కేంద్రీకరించుకుంటాడు. తన తక్కువతనాన్నీ, తోటివారి ఎక్కువతనాన్నీ గ్రహించి ఒకరకం 'ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్'ను పెంపొందించు కుంటాడు. స్వనిందకారణంగా, ఆత్మగౌరవాన్నికూడా కోల్పోతాడు.

## 8. జూదగాళ్ళవటం

లైంగికంగా వొళ్ళు జలదరించటం, అందువల్ల కలిగే ఆనందం ఎప్పుడైతే మరిలేదో, దాన్ని వేరొక రూపంలో పొందేందుకే జూదమాడటం ఒకమార్గం. మానసికంగా వేరొక తలపు, మానసిక ఉల్లాసం కలగటంవల్ల ఒకరకం తృప్తి ఏర్పడుతుంది. కేవలం అదృష్టంమీదా, విధిమీదా భారం వేసి ఒక పిచ్చిలోకాన్ని సృష్టించుకోవటం జరుగుతుంది. ఏ యంత్రాంగం ద్వారా తాను ఆనందాన్ని పొందే అర్హత కోల్పయ్యాడో, ఆ యంత్రాంగానికి వేరొక రూపంలో తృప్తిని అందివ్వాలి. జూదరి కేవలం లైంగిక ఆనందాన్ని, జూదంద్వారా పొందగలుగుతున్నా డనలేము, కాని ప్రత్యామ్నాయ తృప్తికోసం ప్రయత్నిస్తూనే వున్నాడు.

## 9. ఆత్మహత్యా ప్రయత్నాలు

సెక్సు సమస్యలు మానవజీవితాల్ని తలక్రిందులు చేయగలిగినంత శక్తివంతమై

వచే సత్యం, మానవచరిత్రనిండా కనిపిస్తుంది. స్త్రీకోసం రాజ్యాల్ని వొదిలిపెళ్ళినవారూ, ప్రాణాల్ని బలిపెట్టినవారూ ఉన్నారు. తమ ప్రణయం సాఫల్యం కాలేదని ఆత్మహత్యలు చేసుకొని బతుకు తెల్లవార్చుకోవటం మనం ఎరగందికాదు. ఏదో జీవరాసుల అవసరం కోసమే యీ సెక్సు ఏర్పడిందనీ, అది చాలా సామాన్య విషయమే కనుక, దాన్నిగూర్చి తీవ్రంగా ఆలోచించవలసిన పనిలేదనుకునే వారూ ఉన్నారు. ఐతే వారి అభిప్రాయాలు 'థియరీ'లో బాగానే ఉంటవికాని, అనుభవపూర్వకమైన జీవితంలో, వారే తలక్రిందులుగా బోర్లపడటం సత్యదూరంకాదు. మాటల్లోనూ, సాహిత్యంలోనూ సెక్సును తప్పించుకోవటం తేలికేకాని, నిత్యజీవితంలో ఇదెలా సాధ్యం?

కొంతమంది వ్యక్తులు చాలా తృప్తికరమైన దాంపత్య జీవితాల్ని గడుపుతూ, నపుంసకులవగానే చాలా కుంగిపోతారు. వీరి యీ కుంగుదల, సెక్సుమీద వుండే వారి నిశ్చితాభిప్రాయాన్ని బట్టి వుంటుంది; ఇలాటి వ్యక్తులకు సెక్సుకువున్న అర్థం చాలాగొప్పది; ఎప్పుడైతే నపుంసకత్వం ఆరంభమౌతుందో ఆనాటినుంచే తనబతుకే నిష్ప్రయోజన మనిపిస్తుంది.

ఇతర ప్రక్రియలేమీ లాభంలేకపోగా, చివరకు తనను తాను భరించలేక, ఆత్మహత్యా ప్రయత్నాలు చేయటం జరుగుతుంది. తన నపుంసకత్వం తాలూకు వేదన భరించలేనంత దుర్భరమౌతుందంటే, వారి అభిప్రాయం ఎంత గాఢమైనదో తెలుసుకోవొచ్చు.

## 10. కుదరనివ్యాధిగ్రస్థుడయ్యాననే బాధకు లోనవటం

ఆరోగ్యంలో ఏదన్నా మార్పురాగానే దాన్ని గూర్చిన ఆందోళన ఆరంభమవటం సామాన్య విషయం. ఇక సెక్సు విషయమైన లోపాలసంగతివేరు. ఎవరితోనన్నా చెప్పుకోవటం, చివరకు డాక్టర్ను చూడంటంకూడా బాధావహంగా వుంటుంది. తన వ్యక్తిగత రహస్యాన్ని ఇతరులు తెలుసుకోరాదనీ, అందునా తన యీ అసమర్థత నలుగురికీ తెలుస్తుందనే భయం పీడించ సాగుతుంది.

కారణాల్ని తనకుతాను ఊహించుకోసాగుతాడు. తనకు మానసికంగానూ, శారీరకంగానూ ఏదో గొప్పవ్యాధి ఆరంభమైందనే నమ్మకం కలిగేందుకు ఎక్కువ కాలం పట్టదు. నిజానికి ఏదన్నా వ్యాధే ఉన్నప్పటికీ అది ఎంత స్వల్పమైనదైనా, తన తలపులవల్ల అసాధ్యమైనదిగానే తోస్తుంది. తనకు తగ్గింది ఒక్క పుంసత్వమే ఐనప్పటికీ, ఎన్నో ఇతర వ్యాధులు కూడా శరీరంలో ఉన్నవనే ఆలోచనల తాకిడి, వొత్తిడి చాలా అధికమై మనిషిని కుంగదీస్తవి.

కొన్నాళ్ళపాటు తన యీ స్థితిని భరించి, ఇక యీ వ్యాధినుంచి బైటపడక తప్పదనే నిశ్చయంతో తప్పనిసరిగా డాక్టర్నుచూస్తాడు. సర్వసామాన్యంగా నపుంసకత్వానికి, తొంభైపాళ్లు మానసిక యంత్రాంగం, పదిపాళ్లు మాత్రం శారీరక యంత్రాంగం కారణమైనప్పటికీ—చికిత్సావిధానంలో జరిగేది, తొంభైపాళ్ళ శారీరక కారణమనే ధోరణే! చాలా ఖరీదైన సెక్సు హార్మోనుల ఇంజక్షన్లనుంచీ,

హిమాలయా యోగిపుంగవుని లేహ్యం వరకూ శరీరంలోకి పంపబడుతుంది. ఇవన్నీ కూడా నిరుపయోగాలనే సంగతి త్వరలోనే రోగికి తెలిసి వొస్తుంది.

తనను యీ ప్రపంచంలో ప్రక్రియ లేదనే వ్యాధి పీడిస్తోందనే నిర్ణయం జరగటంలో ఆశ్చర్యంలేదు. ఇందువల్ల లేని పోని ఇతర అనుమాలుకూడా వేధించసాగుతవి. శరీరమంతా విరగబొడిచినట్లూ, అనేకచోట్ల నెప్పులు మొదలైనవి ఆరంభమౌతవి. అసలు సమస్యపోయి, దాని స్థానే చిలవలూ పలవలూ ఏర్పడిన యీ బ్రహ్మాండమైన సమస్య ఎదురవుతుంది.

యీ పైమనస్తత్వాల్ని సమీక్షించగా కొన్ని నిత్యజీవిత సత్యాలు బయల్పడుతవి. అవి—

1. చాలామంది పురుషులు శారీరకంగానూ, మానసికంగానూ ఏర్పడిన ఏవో లోపాలవల్ల తాము నపుంసకులు అవుతున్నామని భావించేందుకు మారుగా, ఏవో దివ్యశక్తులు తమపట్ల సమ్మోచేసినవనే భావనకు గురవుతూంటారు. యీ కారణంగానే హిమాలయా యోగిపుంగవుని అమూల్య మూలికలూ, తాయెత్తులూ, మంత్ర తంత్రాలవరకూ వెళ్ళటం జరుగుతోంది. కనుక యీ నపుంసకత శారీరకం అనటంకన్న మానసికం అనటమే సబబుగా తోస్తుంది.

2. కొంతమంది పురుషులు, యీ ఆధునిక యుగంలోని శాస్త్రీయ విజ్ఞానం తమకు తిరిగి యవ్వనాన్ని ప్రసాదించగలదనే ఆశతో వైద్యునిచూసి, తమ సర్వస్వాన్నీ ధారపోసయినా సరే పునర్యవ్వన ప్రాప్తికోసం తహతహలాడుతారు. చివరకు నిరాశచేసుకున్నప్పటికీ, తమ మానసిక యంత్రాంగమే కారణమని నమ్మలేరు. యీ మందుమాకులు శారీరక లోపాల్ని సరిచేసినప్పటికీ తమ పురుషత్వం పునరుద్ధరించబడలేదు కనుక, ఇక మిగిలిన కారణమల్లా మానసికమేననే భావనన్నా వారికి రాకుండటం శోచనీయం.

3. ఐతే మరి యీ నపుంసకత్వానికి విరుగుడు ఏమిటనే ప్రశ్న రాకమానదు. ఆ స్త్రీకి విడాకులిచ్చి బైటపడటం తాత్కాలికంగా సమస్యా శృంఖలాలను విడగొట్టుకోవటమే అవుగాక; కాని తాను నపుంసకుడయ్యాననే నమ్మకం కలిగిన వ్యక్తి మరో స్త్రీదగ్గరకూడా తన తత్వాన్ని మార్చుకో గలడని ఎలా చెప్పగలం?

పురుషుని పుంసత్వానికీ స్త్రీ ప్రవర్తనకూ చాలా దగ్గిరి సంబంధం వున్నదనే విషయాన్ని కాదనలేం. ఆమె తాలూకు ఒక చిన్నమాటతో, ఒక్క విదిలింపుతో ఎంత వేడెక్కిన పురుష శరీరమైనా, క్షణంలో చల్లబడటం జరగొచ్చు. కనుక స్త్రీ తన పురుషుని రెచ్చగొట్టి, సుఖపెట్టి, తాను దాంపత్యతృప్తిని పొందటం నేర్చుకోవాలి. రతి పాపహేతువనీ, నీచమనీ భావించే స్త్రీలు తమదాంపత్య జీవితాల్ని దుఃఖమయం చేసుకుంటారు. దాంపత్యం ఒక్క సంతానార్థమే కాదనీ, దాని నుంచి పొందే ఆనందంకూడా వుందనే సత్యాన్ని వారు గ్రహించాలి. ఎంత నపుంసకత్వాన్ని ప్రదర్శించే విటులనైనా, పురుషాగ్రేసరులుగా తయారుచేసి, ఆనందించేట్లు చేయగల వ్యభిచారిణులు ఉన్నారు. వీరు కేవలం వ్యాపారాభివృద్ధికోసమే యీ విధంగా ప్రయత్నిస్తు

న్నారు గాక! కాని పురుషుడు కూడా లొంగిపోతున్నాడు. దీనికంతకూ వారు ప్రణయాన్ని ఒక కళగా నిత్యజీవితంలో ఆరాధించటమే కారణం. దంపతులకే సరైన లైంగిక విజ్ఞానవుంటే, వారి దాంపత్యం సుఖదాయక మవగలదు. (చూ॥ హేవలాక్ ఎల్లీస్ ప్రణయకళ.)

4. తమాషా-పై జాబితాలో చాలా మంది తాగుబోతులుగానూ, జూదరులు గానూ తయారై సమస్యనుంచి దూసుకుందామనే ప్రయత్నంచేశారు; కాని ఒక్కడేఆత్మహత్యా ప్రయత్నంచేశాడు; దీన్నిబట్టి నపుంసకత్వంతో బాధపడే చాలామందికి జీవితపుటాశలు అడుగంట లేదని ఖచ్చితంగా చెప్పగలం. కావలసిందల్లా వారు సమస్యను శాస్త్రీయంగానూ, సక్రమంగానూ అర్థం చేసుకోగలగటం.

జాగర్తగా ఆలోచిస్తే జీవితంలో ఏర్పడే యీ నపుంసకత్వానికి, ఆయా పరిస్థితులు, జీవిత విధానంలోనూ వాతావరణంలోనూ కలిగిన మార్పులూ కారణం. యీ మార్పులన్నీ కూడా మానసిక యంత్రాంగాన్ని పెడదోవలు పట్టించి, తాత్కాలికంగా కామవాంఛల్ని తగ్గిస్తవి. ఐతే ఇందువల్ల ప్రమాదమేమీలేదు. తిరిగి పరిస్థితులు చక్కబడగానే పూర్వపు పురుషత్వం రానేవొస్తుంది. కావలసిందల్లా యీలోగా, యీ సమస్యనుగూర్చి గాఢంగా ఆలోచించి, తలక్రిందులు కాకుండటం. ★


లైంగిక విజ్ఞానం కొరకు చదివి తీరవలసిన పుస్తకాలు.


అత్యుత్తమ శాస్త్రీయ గ్రంథాలకు సామాన్యులకు కూడా అర్థమయ్యే తెనిగింపు.

| | | | |
|---|---|---|---|
| 1. | సిగ్గు | హేవలాక్ ఎల్లీస్ | రూ. 1-0-0 |
| 2. | ఋతుధర్మాలు | .... | రూ. 1-0-0 |
| 3. | లైంగిక విజ్ఞానం | .... | రూ. 1-0-0 |
| 4. | ప్రణయ కళ | .... | రూ. 1-0-0 |
| 5. | స్వరతి | ... | రూ. 1-0-0 |
| 6. | గర్భనిరోధం (సచిత్రం) | .... | రూ. 0-8-0 |

పుస్తకాల ఖరీదుకు రూ. 0-8-0 అధికంగా పంపిన వారికి, రిజిష్టర్డు పోష్టులో పంపబడుతవి.

అభిసారిక కార్యాలయం, మద్రాసు, 17.

సీరియల్ నవల,




ఆ రాత్రి మెదడు ఒక కురుక్షేత్రమే ఐంది. లలిత ఎలాపోతే తనకేం, బైటి ప్రపంచంలో ఎవరెలా ఛస్తే తనకేం, తనూ, తల్లీ యీ రెంటికీ ప్రాధాన్యతను ఇచ్చి ఉండాల్సింది. కాని లలిత తనను దూరంనుంచే ఆకర్షించి, అభిమానించి, తన ఆప్తురాలని అనేకసార్లు రుజూచేసి, మెరుపులాగు మెరిసి చేజిక్కకుండా పోవటాన్ని భరించలేకుండా వున్నాడు. ఎప్పటి కప్పుడు ఆమె తనను విడనాడిందనుకోవటం, అంతలోనే ఆమె మళ్ళీ తనకు చేరువవటం, ఎండమావువలె దూరదూరంగా జరుగుతూ పోతూండటం పరిపాటయింది. ఒకనాటికన్నా యీ ఎండమావు, జలాశయ మౌతుందని నమ్మకం వుండేది; అదికాస్తా భగ్నమైపోయింది.

ఐతే వీటన్నిటినీ తను కల్పించుకున్నాడే కాని వేరు కాదు. వీసమెత్తు సత్యం మీద పర్వత సాదృశ్యమైన ఆశలు ఏనాటికైనా నేల కూలగలవని తనకు తెలియదా? తెలిసివుండీ యీ పద్ధతిని అనుసరించటం ఆనందాన్నిస్తుంది కనుకనే వొదులుకోలేక పొయ్యాడు. ప్రతి వ్యక్తికీ ఒకో మానసిక ప్రపంచం వుంటుంది. బాహ్య ప్రపంచంలో దొరకని, అందని అనేక వస్తువులు, తన ఇష్టానుసారంగా మానసికలోకంలో లభ్యమై, తన సృష్టిగా నిలబడి ఆకాస్సేపూ తనకేమీ తక్కువలేదనే భ్రమను కలిగిస్తవి. యీ ప్రపంచానికీ బాహ్యప్రపంచానికీ సంబంధం లేదనుకోవటం శుద్ధ పొరపాటు. ఎందుకంటే దీని పునాది బాహ్యప్రపంచంలోనే వుంది; అక్కడ లభ్యమవనివి, 'అసంభవా లనుకున్నవాటిని సాధించేందుకే యీ కొత్త సృష్టి జరిగింది.

దాని పునాది ఏనాడైతే బాహ్యప్రపంచంలో కదిలిందో, మొత్తమంతా కూలి పోక తప్పదు. తన యీ పరిస్థితి ఇలాటిదే!

—కాని ఏం చేస్తాడు? ఎంత తంటాలుపడినా రాని పీటముళ్ళు వేసుకున్నా డాయె! యీనాడు లలిత ప్రవర్తనపట్ల ఇంత యీర్ష్య కలుగుతోందంటే, తా నామెను ఎంత గాఢంగా ప్రేమించివున్నాడో తెలియచెపుతోంది. ఐతే అంతా తన పక్షాన్నే తరిచి చూసుకుంటున్నాడు కాని, లలితకూడా ఒక వ్యక్తిత్వ మున్నదనీ, ఆమె ప్రవర్తన వేరువిధంగా ఉంటుందనీ ఎందుకు అనుకోడు? అలా భావించేందుకు భయం! తన ఊహాల్ని ఖండించే వాటిని దరిజేర నివ్వకుండటం తన దౌర్బల్యం.

ఈ నాడు చూసిన దృశ్యం మరోవిధంగా ఆలోచిస్తే తన జీవితాశయాన్ని సాధించేందు కూడా ఉపకరిస్తుందేమో? ముందు తనతల్లి, తరువాత లలిత అని అనేకసార్లు మననంచేసుకుంటూనే ఉన్నాడు. యీ లలిత తక్కువ ప్రాధాన్యానత గలది పైదొలగుతే మిగిలేది, తన మాతృమూర్తే కదా! ఆమెను సుఖపెట్టట మనేదాన్ని రెట్టింపు బలంతో సాధించగలడు.

మానస ప్రపంచంలోని పూర్వపు బొమ్మలన్నింటినీ చెరిపి, తిరిగి కొత్త సృష్టిలో పడ్డాడు. యీసారి తనూ, తన తల్లీ తప్ప వేరొకరికి స్థానంలేకుండా చేసు కోసాగాడు. లలితను శాశ్వతంగా వొదులుకునేందుకు కారణాల్ని బలపరుచు కున్నాడు...ఎంత ప్రయత్నించినా వెధవ ఆశ—వెంట్రుకతో కొండను పెకలిం చేందుకూడా వెనుదీయని ఆశ, మిణుకు మిణుకు మంటూకూడా తనను లొంగ దీసేందుకు ప్రయత్నిస్తూనే వుంది.

—ఇంతా ఏడుస్తే లలిత ఆ యువకుడి సొత్తయిందని తను అనుకోవటం అర్థంలేని సంగతేమో? ఒక యువతి, యువకునితో కలిసి బజార్లో కనిపించినంత మాత్రాన అంతా మించిపోయిందనీ, లలిత అతనిదై పోయిందనుకోవటం భ్రమే కావొచ్చు. నిజం ఏదైనప్పటికీ, ఇలా తలచటం కేవలం లలితను అవమానించటమే అవగలదు. తనతో లలిత మాట్లాడి, స్నేహం చేసినంతమాత్రాన తమకు తెలిసిన యావత్ ప్రపంచమూ తామిద్దరికీ సంబంధాలు కట్టినందుకు తనెంత ఎంత నొచ్చు కున్నాడు! యీ సమాజాన్ని దుమ్మెత్తి పోశాడుకదా! మరిప్పుడు తనుకూడా అలాగే ప్రవర్తించటం ఏమిటి? ఇతరులపట్ల తాను చూసిన పొరపాట్లలాటివే, తానూ పడటం నిజంగా హాస్యాస్పదమే కాకుండా, నిరాధారంగా, అన్యాయంగా లలితను నీచపరుస్తున్నాడు.

తనమీద తనకే మండిపోయింది. ఒకవేళ లలిత స్నేహం ఆ యువకునిమీద ప్రణయమే ఐతే తను ఆనందించటం, కలకాలం వారిద్దరూ సుఖంగా ఉండాలని ఆశించి, ఆశీర్వదించటం తన కనీస బాధ్యత; ఏళ్ళ తరబడిగా సాధిస్తున్నా ననుకున్న తన సంస్కృతికి ఇదొక విషమపరీక్ష. తనకు నిజంగానే లలితమీద అనురాగంవుంటే ఆమె సౌఖ్యపడటాన్నే కోరాలి.

యీ రకం ఆలోచనలు తనకు మనశ్శాంతిని కూడా ఇవ్వగలవు. హృదయంలో పగిలిన అగ్నిపర్వతం తాలూకు లావాలు పూర్తిగా పొంగి పొరలిపోయ్యాక, శాంతే మిగులుతుంది...ఇప్పుడు మనస్సు కొంచెం తేలిగ్గావుంది. ఇకముందు కూడా లలితను గూర్చి తనకు అనుకూలంగా, పిచ్చి పిచ్చిగా ఆలోచించటం మూర్ఖ్యమని మరోసారి అనుకోగలిగాడు. మానవుడు చేసిన తప్పుల్నే ఎందుకు చేస్తాడో తెలిసివొచ్చింది.

త్వరలోనే ఏదోవిధంగా అమ్మకు నచ్చజెప్పి ఆమెనుకూడా ఇంటికి తెచ్చుకుంటే తనకు తగినంత మనశ్శాంతి, తను పోరాడి గెలుచుకున్న ఆశయం, రక్తమాంసాలలో, తన శ్రమకు ప్రతిఫలంగా, బహూకరణగా ఎదుట వుంటుంది. ఏదో శోకమార్గం ఆలోచించి ఆమెను తీసుకొస్తే, ఇక లలితను గూర్చిన వెధవ ఆలోచనలూ ఉండవు...అమ్మనుగూర్చి ఆలోచిస్తూనే క్రమంగా నిద్రకు లొంగిపోయ్యాడు.

## 24

నిర్లిప్తమైన జీవితం, భారంగా కాలచక్రంలో తగులుకొని యీడ్చబడుతోందనిపించేట్లుగా రోజులు గడుస్తున్నవి. లలితను ఆ నాడు యువకునితో చూడకముందు, ఎంతో ఉత్సాహంతో తనూ యీ ప్రపంచంలో ఏదో ఒక్క సత్కార్యాన్ని చేస్తున్నాననే కొత్తశక్తితో ఉన్నాడు; కాని ఆ దృశ్యంచూశాక దిగజారిపోయ్యాడు. మానవుడు రెండు విధాలుగా ఆలోచిస్తాడనే కొత్త విషయం తనపట్ల రుజువైంది. ఒకటి: తన జీవితాన్ని, ఇతరుల జీవితాల్తో పోల్చి చూసుకోవటం—ఇది సహజమే. కాని తన జీవితంలోని రెండు సంఘటనలను, లేదా ఇద్దరు వ్యక్తుల్ని తూచి ఆ భేదాన్నిచూసి జీవిత విధానమే మారిపోయినట్లు గ్రహించటం. తరిచిచూసుకుంటే తను తల్లికన్న, లలితకే ఎక్కువ ప్రాధాన్యతను ఇవ్వనట్లయితే, యీ దిగులుకు కారణమేమిటి?

దెబ్బతిన్నాక, క్రమంగా దానినుంచి కోలుకోవటమనేది మొదటినుంచీ తను అనుసరిస్తూన్న పద్ధతే. కాని ఇదేదో పిడుగుదెబ్బ వలెనే తోచటం, తన జీవితానికి సంబంధం లేదనుకొన్న దానికే బానిసైపోవటం విచిత్ర పరిణామమే కాని, దానికి తాను అతీతుడు మాత్రం కాదాయె. యీ వొచ్చే కష్టాల్ని భరించలే మనుకుంటాం కాని, మరోపక్క భరిస్తూనే వుంటాం. అసలు భరించలేని కష్టాలంటూ ఎవరి జీవితంలోనూ సామాన్యంగా రావు; అలా వొచ్చినవాళ్ళు ఆత్మహత్య చేసుకుంటూనే వున్నారు కదా మరి!

రోజులు గడుస్తూన్నా లలిత తనకోసం మళ్ళీ రాలేదు: ఆమె తనను మరిచిపోయిందనే సంగతి అంతరాత్మ ఘోష పెడుతూనే వుంది. పోనీ లెమ్మని ఎంత తీసిపారేదామన్నా మనసు వొప్పటంలేదు. చివరకు పుస్తకాలకోసం గోపయ్యకూడా రావటంలేదు. తన దగ్గిర్నుంచి తీసుకెళ్ళిన పుస్తకాలు తిరిగి పంపనూలేదు...నయం! అవి పంపినట్లయితే, లలితకూ తనకూ ప్రతి సంబంధమూ తెగిపోయినట్లే అయేది.

కేవలం తన పుస్తకాలన్నా ఆమె దగ్గరవుండి, తనవాడు ఒకడున్నాడనే విషయాన్ని జ్ఞాపకం చేస్తుందనే తృప్తన్నా వుంటుంది.

తనెంతో కలవరపడి పొయ్యాడు; లేకుంటే తాను ఎంతచెడ్డా, ఒక యంత్రం వలెనే రోజులు గడపగలడా? పూర్వం యీ యంత్రానికి గొప్ప ఆలోచనా శక్తి వుండేది...కాదు, దానికా శక్తి వున్నదనే విషయం మొదటిసారిగా లలిత పసికట్టి తనకు తెలియపరిచి, దాన్ని సక్రమంగా పని చేయించగలిగింది. ఆమె దూరమైంది— దాంతోపాటు తన మెదడుకూడా బండ బారిపోయింది. చివరకు అమ్మను చూసేందుకూడా వెళ్ళ బుద్ధికావటం లేదు. ఆమె విచారంగా మాట్లాడుతే, తన గుండె చెదిరిపోతుందని కాదు. ఎందుకంటే ఆ గుండె పగలటమనేది, ఎప్పుడో, ఎక్కడో, తనకు తెలియకుండానే జరిగిపోయింది. ఆ సంగతి తాను స్పష్టంగా, లలిత పరాధీన ఐపోయిందని తేల్చుకున్ననాడే తెలుసుకోగలిగాడు. దాన్ని అతకటమంటూ లేదని తెలుసు; కొత్తది రాదనీ తెలుసు. యీ ఉన్న ముక్కల్తోనే జీవితం వెళ్ళబొయ్యాలి. అందుకనే జీవితం నిస్సారమైంది. యీ నిస్సారంలోనే మధురమైన మాతృ హృదయంమీది మమతకూడా సన్నగిలింది.

నెల పొడుగునా కాయకష్టంచేసి, రక్తాన్ని కన్నీరుగా, చెమటగా మార్చి సంపాయించే కరుకు రూపాయిల్లో, నలభై దాకా బ్యాంకులో వేస్తూనేవున్నాడు. పాసు పుస్తకం చూసినప్పుడల్లా, తన జీవిత చరిత్రే అందులో లిఖించబడిందనిపిస్తూ వుండేది...కాని ఇప్పుడు ఆ సంతోషం కూడాలేదు. యీ విషమ పరిస్థితుల్నుంచి తను బైటపడే మార్గమూలేదు. అవి మారవు; అందుకని తనే మారాలి. ఎట్లా? యీ చిన్నవిషయం తెలుస్తే ప్రపంచం ఇంతఘోరంగా, జీవితం ఇంత నిరాశామయంగా ఉండేది కాదేమో? తను మారినా, జీవితం మళ్ళీ రంగు మార్చుకొని ఒక కొత్త రూపంలో, కొత్త సమస్యగా మారుతూనే వుంది. కేవలం ఎడారిలోని ఎండమావుల వలెనే జీవితం తయారైందని అనేకసార్లు తను అనుకున్నాడంటే, అకారణంగానే అనుకోగలిగిన సాహసం ఏనాటికీ రాదు.

మనుషులందరూ విషపూరితులేననే అభిప్రాయం శుద్ధపొరబాటని లలిత రుజూ చేసింది; ఆ నాటినుంచే మానవత్వంపట్ల తన విశ్వాసం పెరగజొచ్చింది...కాని, ఆ లలితే తననిలా అన్యాయం చేస్తుందని అనుకోలేదు కదా! ఇది కారణంగా, తిరిగి మానవుల్ని ద్వేషించటం అర్థరహితమైందే కావొచ్చు; కాని తాను పరిస్థితులకు తల వొగ్గే మానవమాత్రుడు! సామాన్య మానవుడిలో వుండే రాగద్వేషాలూ, ఆశానిరాశలూ, సుఖపడుదామనే ఆతృతా, మొదలైనవి హృదయాన్నీ, మెదడునూ, రక్తాన్నీ తెకతెకలాడిస్తూనే వున్నది. పోతే తన చదువు సంధ్యలూ, సంస్కృతీ, తెలివితేటలూ, ముఖ్యంగా సమాజంలోని తన స్థానమూ తన ఉద్వేగాల్ని అణగ దొక్కేస్తున్నవి. అందువల్ల ఆ చిచ్చు ఆరినట్లు పైకి కనిపించినా, తననొక పక్కనుంచి దహించివేస్తోంది. ఆ వేడి బైటి ప్రపంచంలోకి పాకకుండా, యీశ్వరుడు గరళాన్ని భరించిన రీతిగా, తనే భరిస్తున్నాడు.

ప్రపంచంలో ఏం జరుగుతోంది, తను ఎక్కడవున్నాడు, ఏం చేయాలనే భావనే మాయమైంది. మనుషుల్లో తప్పనిసరిగా మెలగవలసి వొచ్చినప్పుడు, కేవలం వ్యాపారరీత్యా ఎంతవరకూ అవసరమో అంతవరకే ఉంటున్నాడు. ఆనాడు శర్మగారు తనకూ లలితకూ ఏదో సంబంధమున్న దన్నట్లుగా మాట్లాడినప్పటినుంచీ, ఆయనమీద అసహ్యం కలిగింది. దాంతోపాటు తన పరిసరాల్లో వున్న వాళ్ళందరిమీదా ఏహ గింపే మిగిలింది. ఐతే దాన్ని సాహసించి బైట పెట్టలేడు కనుక, తలొంచుకొని తన పని తాను చేసుకొని పోతున్నాడు. యీ జరిగే, జరగబొయ్యే మార్పులు—అలాటివంటూ ఉంటే—అవి తనకోసం కాదు; ఒకవేళ తనూ ఆ మార్పుల్లో ఒక భాగమే ఐతే, అవి తనమేలుకూ కావు; తన కీడుకే. అందుకని జీవితమంటేనే 'ఇంటరెస్ట్' చచ్చింది.

'జీవితం వ్యాపారమా?' అని తనను తాను ప్రశ్నించుకున్నాడు. కాదనుకో లేకపొయ్యాడు. ప్రతి వ్యక్తీ, తన చుట్టు పక్కలవుండే వ్యక్తుల్ని తనకు అనుకూలంగా, తన సుఖంకోసం ఉపయోగించుకోవాలని చూస్తున్నాడు. ఉట్టి ఉడియంగా, ఎవరూ, ఎవరి జోలికీ రావటం లేదు. ఏదో నిగూఢ స్వార్థమే ప్రపంచంలోని మానవశక్తి అన్నిటినీ నడిపిస్తోం దనిపిస్తుంది. ఐతే, తను నిందించే యీ మనుషుల వలెనే, తనూ ప్రవర్తించటం లేదా?

లేదేమో ననిపిస్తుంది. దీనికి ఒకపక్క తన అసమర్థతే కారణం. మరోపక్క ఒంటరిగా జీవితాన్ని పోరాడాలనే పట్టుదల; ఆశ్చర్యం ఏమంటే—తను శక్తిహీను డవుతూన్నకొద్దీ, యీ పట్టుదల పెరుగుతోంది—జూదరి ఓడుతున్న కొద్దీ పట్టుదలను పెంచుకున్నట్లు! యీ విధంగా తను ఇతరులకు ఉపయోగపడటమే కాని, ఇతర్లు తనకు ఉపయోగపడకపోగా, వెలివేసినట్లు దూర తీరాలకు తరుముతూన్నారు.

—కాస్త లోతుగా ఆలోచిస్తే, యీ తప్పుడు అభిప్రాయాలకు తనలో తానే సిగ్గుపడాల్సి వుంటుంది! తల్లి తనను ఏవిధంగా ఉపయోగించుకోవాలని నానా అవస్థలూ పడుతూ పెంచుకొచ్చింది? ఆమె తన సుఖాన్నే చూసుకొన్నట్లయితే, తనీపాటికి వీధుల్లో అడుక్కొని తినవలసి వొచ్చేది...ఇక లలిత, పరాయి స్త్రీ, తన నుంచి ఏం ఆపేక్షించి, తన దుర్దినాలలో అండగా నిలిచి, మనో ధైర్యాన్నిచ్చి, తనను ముందుకు పొగేట్లు చేసింది? ఏ కారణాన్నీ తను సరిపెట్టుకోలేడు. దీన్నిబట్టి జీవితాన్ని వ్యాపారమనుకుంటే, మానవులు సరుకులే అవుతారు! ఎంత హాస్యాస్పదం!...కాదేమో? జీవితంలో గెలిచినవారు, వ్యాపారంలో గెలిచినవారి వలెనే సంతోషపడుతున్నారు; ఓడినవారు అసలే వ్యాపారాన్నే దుమ్మెత్తి పోస్తున్నారు. యీ రెండువిధాలా సరితూగలేనివారు, తమ అభాగ్యతకు ఏడుస్తున్నారు. తను యీ మూడో తరగతికే చెందాడేమో?

ఐతే లలిత తనను వ్యాపారవస్తువుగా చూసిందనుకోలేడు. అలా అనుకుంటే, యీ నాటిది ఒక సమస్యే కాదు. అవసరమైనంత వరకూ, తనను ఉపయోగించుకొని,

విశిరివేసిందనుకుంటే — అలాటి స్త్రీతో పేచీయే ఉండదు; అసలు అలాటి వ్యక్తికి ఎంత దూరానవుంటే అంత మంచిది కనుక, తానిప్పుడున్న దూరమే తనకు రక్ష!... కాని అలా కాదే! లలిత దేవకన్యనే అభిప్రాయాన్ని తాను విడనాడలేడే! అందు కనే కదా, మనసు ఇంత క్షోభిస్తోంది!

ఎంత నచ్చచెప్పుకున్నా ఆ వైరాగ్యమూ రాదు. ఎలా వొస్తుంది? వైరాగ్యానికి మనస్సే ప్రధాన మనుకోవటం పొరపాటేమో? మనసును మార్చుకో గలిగినా, మిగతా ఇంద్రియాలన్నీ పొందే అనుభూతులు, చుట్టూవున్న ప్రపంచం ఎరలుగాచూపే ఆశలు, ఆ వెధవ మనస్సును తేలిగ్గా మార్చగలవు. ఏళ్ళ తరబడి ఘోర తపస్సుచేసి, యీ ప్రపంచ విధానానికి దూరంగా ఉండగలిగిన విశ్వామిత్ర మహర్షి లాటివాడు కూడా, మనసు రాయిచేసుకున్నా ననుకున్న కఠినుడు సైతం, ఒక్క క్షణంలో మేనక కాళ్లముందు మోకరించాడనేది కాచి వడబోసిన సత్యం. ఇక మానవుడైన తన సంగతి వేరే చెప్పాలా? వాతావరణం మారినంత తేలిగ్గా మనసు మారకుండటమే వొచ్చిన ఇబ్బంది.

ఎలాగో తీరిక చేసుకొని అమ్మదగ్గరకు వెళ్లాలి. ఆమె కన్నీటితో, తనతాలూకు అనేక కల్మషాల్ని కడిగి పారెయ్యగలదు. ఆ దుఃఖం ముందు, ప్రపంచంలో తాను అనుభవిస్తూన్న యీ కష్టాలు, తల వొంచేస్తవి. యీ విధంగా పోల్చుకోవటం వల్ల కూడా మనశ్శాంతి సాధ్యమౌతుంది. అమ్మకు ద్రోహం చేస్తున్నానని మనసారా పరితపించినట్లయితే, ఆ బాధలో మిగతావి మరి కనిపించవు.

యీ ఉద్దేశ్యంతోనే ఒకనాడు బయలుదేరాడు. ఎంత త్వరగా తెముల్చుకుందామనుకున్నా మైలాపూర్ జేరేటప్పటికే చీకటి పడింది. యీ సమయంలో రాత్రి భోజనాల హడావిడిలో తల్లి ఊపిరి తిరక్కుండా వుంటుందని తెలుసు. ఐనప్పటికీ ఎలాగైనా ఆమెను చూసి, పలకరించి, వికలమైన హృదయంతో రాత్రల్లా తలగడా తడిపివేస్తే, అదొక రకం ప్రాయశ్చిత్తమై, తనను సక్రమ మార్గాన నడిపించగలుగుతుంది. మానవుడు కనిపెట్టే అనేక విచిత్ర ప్రక్రియల్లో ఇదీ వొకటి.

అనుకున్నట్లుగానే, చాలా హడావిడిగా అమ్మ వొచ్చింది. అల్లంతదూరంలో వెలిగే విద్యుద్దీపపు కాంతి, బాదం చెట్టు కొమ్మలగుండా దూసుకొని పడుతూన్నప్పటికీ, మనిషి ఆకృతి తప్ప, ముఖ కవళికలు తెలియటంలేదు...కాని ఆమె తనకు దగ్గిరవుతూన్నప్పుడే, ఎంతో చిక్కి శల్యమైపోయిందనీ, అలసటతో, నలిగిపోయిందనీ, ...మృత్యు ముఖంలోకి హడావిడిగా పరుగెడుతోందనీ అనిపించింది. అనుకున్న దానికన్న చాలా హీనస్థితిలోవున్న తల్లిని చూడగానే గుండె బేజారైంది. ఆమె ఏమన్నా అనుకోనీ-తన ఉద్యోగం సంగతి చెప్పేసి, యీ రాత్రే ఆమెను తనతో తీసుకొని వెళ్ళిపోవాలని నిశ్చయించుకున్నాడు, తన ప్రపంచాన్ని తానే సృష్టించుకొని, తన ఆనందాన్ని తానే పొందాలి. బైటి ప్రపంచంలో తాను పొందగలిగినదానికన్న అంతర ప్రపంచంలోంచే పొందగలిగిన దివ్యానుభూతులకు ప్రాధాన్యత నివ్వాలి.

'నాయనా! ఇప్పుడొచ్చావేరా?' అందామె. ఆ కంఠస్వరంలో కూడా ఎంతో బలహీనత, నిరుత్సాహం కనిపిస్తోంది.

కారణం చెప్పాలనుకున్నాడు, కాని యీ సమయంలో చెపితే, ఆమె విని, భరించగలదా అనే సందేహం పీడిస్తోంది.

'ఏం లేదమ్మా-చూసి పోదామనుకున్నాను. అంతే!' అన్నాడు; ఏడుపొక్కటే తక్కువని అమ్మ గ్రహించి ఉండాలి.

'అలా వున్నావేరా బాబూ?' అందామె, చప్పున కంఠస్వరాన్ని మారుస్తూ. ఆ తరువాత తను సరిగ్గా కనిపించనందువల్ల కాబోలు, చేతితో తడివి చూసింది.

'చిక్కిపొయ్యావేరా? చదువుతో రాత్రింబగళ్లు తీరిక లేకుండా వుంటావేం? తగినంత విశ్రాంతి లేకుంటే, మళ్ళీ ఏ మాయదారి జ్వరమో వొస్తుంది. ఆరోగ్యాన్ని జాగర్తగా కాపాడుకో, ఆ మధ్య జబ్బుచేస్తే ఎంత బాధపడ్డావో మరిచి పొయ్యావా?' అంది.

ఏం జవాబు చెప్పగలడు తను? తానింకా చదువుకుంటున్నాననే పిచ్చిభ్రమలోనే వుందామె. ఇప్పుడు అసలు సంగతి చెపితే, యీ స్థితిలో ఆమె గాభరాపడినా ఆశ్చర్యం ఉండదు...ఇక తన స్థితినిచూసి ఆమెకు కలిగే జాలి, ఆమె మీదనే ఆమెకు లేదు. ఆ జాలిని తను చూపాలన్నా ఆమె ఒప్పదు. యీ కసాయి దుకాణంలోనే ఆమె జీవితం అంతమౌతుంది...ఇదంతా తనకోసమని అనుకుంటే, ఆ నేరమంతా తానొక్కడే భరించాలి.

'మాట్లాడవేరా?' అందామె.

'ఏముందమ్మా మాట్లాడేందుకు? చూసి చాలా రోజులైంది కదానని—'

'అంతే కద!' అన్నది తేలికైన హృదయంతో మాట్లాడుతూన్నట్లు.

ఒక్క క్షణమయాక 'సరే నేను వెళ్తాను రాజా! బాబుగారు భోజనంచేసే వేళయింది ... బాబూ! లలిత నన్నెప్పుడన్నా అడుగుతోందా?' అంది తగ్గు స్థాయిలో.

తననే మరిచిపోయిన లలిత, తన తల్లిని గుర్తుంచుకుంటుందా? అదంతా ఇప్పుడు, ఇక్కడ చెప్పగలడా? తన వలెనే తల్లికూడా ఏవేవో పిచ్చి భ్రమలు పెట్టుకుంది. తన కలలన్నీ ఎలాగూ చెరిగిపోయి భరించలేని కఠిన సత్యం మాత్రం మిగిలిపోయింది. ఆ సంగతి చెపితే, తల్లికూడా తనవలెనే ఆకాశంలోంచి భూమిమీద పడిపోతుంది. కనుక అబద్ధమాడన్నా సరే ఆమె ఆనందాన్ని పాడు చేయరాదు.

'ఎప్పుడూ అడుగుతూనే వుంటుందమ్మా!' అన్నాడు.

'అలాగే అనుకున్నాను రాజా! ఎంత మంచిమనిషి!' అందామె.

యీ లలిత విషయం వొచ్చినప్పటినుంచీ చీదరగానూ, అగ్గిమీద గుగ్గిలం పడినట్లుగానూ వుంది తనకు. ఇక అమ్మతో సంభాషణ సాగిస్తే, ఒక అబద్ధానికి ఇంకా అనేక అబద్ధాల్ని జోడించవలసి వుంటుంది.

'సరే పని చూసుకో అమ్మా! నేను వెళ్తాను—' అని మెల్లిగా జారుకున్నాడు. ఆమెకూడా ఏదో పెద్ద భారాన్ని మోస్తున్నట్లు, మెల్లిగా వంటింటివైపు వెళ్ళటాన్ని చూశాడు. పిశాచాలు వెంటాడుతూన్నట్లు స్వరక్షణార్థం నడక వేగాన్ని హెచ్చించక తప్పలేదు.

ఇక యీ జన్మలో తన ఉద్యోగం సంగతి అమ్మకు చెప్పటం పడదా? ఎలాగైనా ఆమెను తోడు తెచ్చుకుంటేనే కాని, మిగతా వెధవ సమస్యలు, అల్పమైన విషయాల, బరువు భారాలు తనకు తగ్గవు. ఏదన్నా సమయం వొస్తుందేమోనని తాను చూస్తున్నాడు. కాని అది రావటంలేదు. నిజం చెప్పేందుకు తనే వొణికి పోతూంటే, ఇక తల్లి ఏమౌతుందనే బాధ పీడిస్తోంది. క్రమంగా ఏదో వొక సందర్భం రాక పోతుందా అనే ఆశమాత్రమే మిగిలింది. మరోసారి వొట్టిచేతుల్తో అపజయాన్ని వరించి, తలవొంచి, మథనపడుతూనే తిరిగిరావటమైంది.

## 25

జీవితానికీ, జూదానికీ చాలా దగ్గిరి సంబంధమే వున్నట్లు తోస్తోంది తనకు. జూదరి అకారణంగా—తెలివితేటల ప్రస్తావనే లేకుండా, అదృష్టముంటే ఓడటం ఎంత సహజమో, తనుకూడా ఒకో పందెంలో ఓడటానికి, తన శక్తి సామర్థ్యాలు సోదిలోకి కూడా రాకుండా పోవటాన్ని గమనిస్తూనే వున్నాడు. మానవ ప్రయత్నాలన్నిటికీ మించిన అదృశ్య శక్తిఏదో పరిపాలిస్తూ జీవితాన్ని తన కంట్రోల్‌లో ఉంచుకొని నడిపిస్తోందని నమ్మేందుకు తగిన కారణాలు తనకున్నవి.

చదువుమాని తాను ఉద్యోగం చేస్తున్నాడు; ఇందువల్ల తాను సుఖపడి, అమ్మను సుఖపెడదామని ఆశ, కాని యీ రెండూ అబద్ధమే ఐనవి. అదే విధంగా లలిత జీవితాంతమూ తనకు తోడునీడగా వుంటుందని ఆశించాడు; కాదు—ఆమె ప్రవర్తనను తనలా అర్థం చేసుకున్నాడు; బహుశా ఆమె తప్పూలేక పోవొచ్చు, కాని తన తప్పు మాత్రం ఏముంది? అదంతా తప్పుడభిప్రాయమని తేలిన తర్వాత కదా, తనిలా భావించ గలుగుతోంది? ముందుగానే తెలుస్తే, అనవసరంగా చేతులు కాల్చుకునేవాడు కాదుకదా! యీ పందెంలోనూ ఓడిపొయ్యాడు. జీవితమంతా ఓటమిలమీదనే దొర్లుతోందా అనిపిస్తుంది...ఇలా ఓడుతూండబట్టే, గెలుచుకోవాలనే ఉత్సాహం, ఆశయాన్ని సాధించాలనే పట్టుదల ఇచ్చే కొత్త శక్తితోనే, ముందుకు సాగ గలుగుతున్నాడేమో?

ఐతే తను జూదరా? సర్వస్వాన్నీ ఒడ్డి జూదమాడగల తాహతు తనకు వుందా? జూదం విలాసయుతమైనది; ప్రపంచంలో ఏ కొందరికో అది ఆనందాన్ని వ్వగలదు. కాని తనలాంటి నిర్భాగ్యులకు మాత్రంకాదు. తనకు ఇష్టమున్నా లేకున్నా-దాంతో సంబంధం లేకుండానే జీవితం జూదరంగమైంది. తను మిన్నకున్నా జీవితం తొడకొట్టి సవాలుచేసి తనను జూదరిని చేస్తూనేవుంది. కనుకనే ఓటమికి విచారించటం కన్న, ఓటమిని ఎదుర్కొని భరించటమే మిగిలింది.

వీటికి తోడు ఆఫీసు వ్యవహారాలు బాగున్నట్లు తోచదు. గతనెల జీతం పది రోజులు ఆలస్యంగా ఇచ్చారు. పత్రిక యజమానులైన ఇద్దరు సోదరులూ మొహాలు మొటమొట్లాడించుకుంటున్నారు. ఏవో గృహ కలహాలు, క్రమంగా మండి, ఆఫీసు వరకూ నాలుకలు చాచినవని అనుమానంగా వుంది. సంపాదక వర్గంలో వారు కలిపించుకోక పోయినా, వారి ధోరణిచూస్తే ఏదో పెద్ద ప్రమాదం వాటిల్లే సూచనలు కనిపిస్తున్నవి. అంత త్వరలో కాకపోయినా, ఆ మంటల వేడికూడా క్రమంగా దగ్గరవుతోందా అనే అనుమానానికి తావుంది. అసలు విషయం ఏమిటని శర్మగార్ని అడగా లనుకున్నాడు; కాని, లలితనూ తననూ అపార్థం చేసుకున్నప్పటి నుంచీ శర్మగారితో చాలా ముభావంగా వుంటున్నాడు. ఇలాటి అనవసర విషయాన్ని ప్రస్తావిస్తే ఆయన ఏమన్నా అనుకుంటాడేమోననే భయంకూడా తనను దూరంగా వుంచేసింది. అయేది అవకమానదు కనుక, దుర్ఘటన సంభవించిననాడే చూసుకోవొచ్చుని సరిపెట్టుకోక తప్పలేదు.

ఇలా వుంటూండగా ఒకనాటి సాయంత్రం—ఇక ఇంటికి వెళ్దామనుకునే సమయంలో ఆదరా బాదరాగా లలిత వొచ్చింది. మొహంచూస్తే చాలా ఆందోళన కనిపించింది. ఏదో ప్రమాదంలో చిక్కుకొని, తన సహాయంకోసం వొచ్చిందని తోచింది. మెట్లెక్కి వొచ్చిన ఆయాసంకూడా తీరకుండానే 'మాస్టారూ! వెంటనే బయలుదేరాలి—' అంది.

యీమెమీద వున్న కసంతా తీర్చుకుందా మనుకున్నాడు, కాని అసలు సంగతేమిటో తెలుసుకోకుండా తొందరపడటం అర్థంలేదు.

'ఎక్కడికి? ఎందుకు? అసలేమిటి?' అన్నాడు.

జేబు రుమాలుతో మొహం తుడుచుకుంటూ ఆమె ఒక కార్డు టేబిల్ మీద పెట్టింది. అది చదువుకునేప్పటికి తనకు మతి పోయినట్లయింది. నిన్న మధ్యాహ్నం తనతల్లి, పొయిదగ్గిర పనిచేస్తూచేస్తూ, స్పృహలేకుండా పడిపోయిందట! వెంటనే రావలసిందని, ఆ ఇంటి యజమానులు కాలేజికి ఉత్తరం రాశారు. భూమి కంపిస్తూన్నట్లు, ఆకాశం విరిగి మీదపడుతూన్నట్లనిపించింది. భూమి సూర్యునిచుట్టూ ప్రదక్షిణ చేస్తుందనే శాస్త్రీయ సత్యం కళ్ళకు కట్టినట్లయింది. క్షణం సేపు నిశ్చలుడయాడు.

'భయపడకండి మాస్టారు!...ఇది ఇవాళ మధ్యాహ్నం వొచ్చివుంటుంది. కాలేజిలోని పోకిరీ కుర్రాళ్ళు, నామీదికి విసిరి పారేశారు! వాళ్ళకీ తెలుసు — మనిద్దరి స్నేహమూను!' అందామె.

తానింకా చదువుతున్నాననే భ్రమలోనే కాలేజి ఎడ్రస్‌కు ఉత్తరం రాసి వుంటారు. లలితనూ, తననూ ఏడిపించాలని విద్యార్థులు చేసిన యీ చిలిపిపని ఒక విధంగా మేలయింది. ఇప్పుడీ తర్కాలతో పనవదు. ముందు ఏం చెయ్యాలన్నా కాళ్లూ చేతులూ వొణుకుతూన్నవి...అసలు అమ్మ ఇంకా బతికివుందో, లేదో!

ఎదుటవున్న వస్తువులన్నీ బూజుబూజుగా కదుల్లాడుతున్నయ్. తన సర్వశక్తులూ క్షణంలో మటుమాయమైనయ్.

లలిత భుజంమీద చెయ్యివేసి కదుపుతూ 'మాష్టారూ! ఎందుకలా వొణుకుతారు? ముందువెళ్ళి అమ్మను తీసుకొనిరండి... నేను డాక్టర్ను తీసుకొని సరాసరి మీ గదికి వొస్తాను...భయపడకండి!' అని ప్రోత్సాహ మిచ్చిందామె.

శాశ్వతంగా తన జీవితపథం నుంచి విరమించిందనుకున్న దేవతామూర్తి, తిరిగి కళ్లఎదుట, తన సహాయార్థం వేచి ఉండటాన్ని క్షణంసేపు నమ్మలేక పొయ్యాడు. లలితను చూస్తే పోయిన శక్తులన్నీ వొచ్చినవి. ఏమైతేనేమి, ప్రపంచమంతా నాశనమైతేనేమి, లలిత ఉండగా తనకు భయమేమిటి? అంతరాత్మ పడగవిప్పి బుసలు కొడుతోంది. ఆ వేడితో తను ప్రపంచంలో సాధించలేనిదేమిటనే మనోధైర్యం కలిగింది.

'బయలు దేరండి మాష్టారూ!' అందామె, బతిమాలే ధోరణిలో.

నిజానికి తను పొందవలసిన అనుభూతుల్ని, తనకన్న ముందుగా ఆమే పొంది, అద్దంలో చూసుకోగలిగిన తన ప్రతిబింబమా అనిపిస్తోంది. లలితపట్ల తనకు ఏర్పడిన సురభిప్రాయాలన్నీ క్షణంలో మాయమైనవి. యీ హడావిడంతా చూసి శర్మగారు కూడా వొచ్చారు. అంతాచూసి పెద్దగా, గోలగా, గుండెలవిసేట్లు ఏడవాలనిపించింది తనకు...కాని, అనుభూతుల్ని సంస్కారంచాటున దాచుకొని తీరవలసిన నాగరికతను అతిక్రమించే సాహసంలేదు. అదీగాక హృదయం దుఃఖపూరితమైనప్పటికీ, దానికింకా విడుదలరాక, భారమవుతోంది.

'అమ్మగారికి బాగాలేదు...నేను వెళ్తాను' అన్నాడు తను, వొణికి పొయ్యే కంఠస్వరంతో.

'అంతా విన్నాను-పదండి...నేనూ వొస్తాను—' అన్నాడు శర్మగారు.

'మీరు త్వరగా రండి ..నేను డాక్టర్ కోసం వెళ్తున్నాను' అని లలిత వెళ్ళిపోయింది. యీ సమయంలో శర్మగారు చూపిన సానుభూతికి హృదయం ద్రవిస్తోంది. మానవులు కనీసం కొన్ని సమయాల్లోనన్నా, తమ మానవత్వాన్ని ప్రదర్శిస్తూంటారు కనుకనే యీ ప్రపంచం అనుకున్నంత దుర్భరమైంది కాదనే నమ్మకం కలుగుతూ వుంటుంది.

ఆ తరువాత ఏం జరుగుతోందోకూడా తెలుసుకోలేని స్థితిలో, తాను కేవలం నామమాత్రుడుగా ఉండిపొయ్యాడు. టాక్సీలో మైలాపూర్ వెళ్ళారు. తన యీ స్థితికి తనను తానే దూషించుకొనసాగాడు. ఒక పక్క శర్మగారు చాలా ధైర్యాన్నిచ్చే వేదాంతం మాట్లాడుతున్నారు. అదంతా సరిగా వినిపించకుండా, అర్థం కాకుండా వుంది. తన అంతరాత్మతో తానే సమాధాన పడేందుకు విశ్వప్రయత్నం చేస్తున్నాడు. తానీవిధంగా నిర్లిప్తంగా ఉన్నట్లయితే, తన తల్లికి ఏం సేవచేయ

గలడు? తన బాధ్యతల్ని మనసారా ఎలా నిర్వర్తించ గలడు? యీ సమయంలో తనేమాత్రం ధైర్యాన్ని కోల్పోయినా, తనంత నీచుడు, పాపి, అసమర్థుడు, బలహీనుడు వేరొకడుండడు. దివ్యశక్తుల్ని నమ్ముకొని లాభంలేదు కనుక, ఒక్కసారిగా యీ ఊబిలోనుంచి బైటపడేందుకు వొళ్లు విదిలించుకున్నాడు. మామూలు మనిషయేందుకు, మూడ్ మార్చుకునేందుకు, చేయవలసిన పనులన్నీ ఒక్కొక్కటిగా, సక్రమంగా చేసేందుకు సిద్ధమయే స్థితిలోకి రాగలిగాడు.

టాక్సీ ఆగగానే ఇంట్లోకి పరుగెత్తాడు. ఏ దుర్ఘటనా జరగనట్లే చాలా మామూలుగా మనుషులు కనిపించారు. ఐనా తనవలెనే ప్రతివారూ విచారంగా ఉంటారని తనెందుకు అనుకోవాలి? ఒకరి ఆనందం వేరొకరికి ఎలా వర్తించదో, అదేవిధంగా ఒకరి విషాదం వేరొకర్ని బాధించదు.

ప్లీడర్ గారు తనవంక ప్రశ్నార్థకంగా చూశారు.

'మా-అమ్మ!' అన్నాడు తను; ఆ పైన మాటలు పెగలలేదు.

'ఓ! నువ్వా—?' అని వేలుపెట్టి చూపుతూ 'ఆ గదిలో వున్నదామె. డాక్టర్ చూసి వెళ్ళాడు—' అన్నాడు.

సంధించిన బాణంనుంచి వెలువడే అంబువలె గదిలోకి పరుగెత్తాడు. అమ్మ ప్రశాంతంగా పడుకొనివుంది. కళ్లు తెరిచేవుంది కాని, అందులో జీవం ఉన్నట్లు తోచదు. అసలా కళ్ళు ఏమైనా చూడగలుగుతున్నయ్యో, చూసినా అర్థం చేసుకో గలుగుతున్నయ్యో తెలియలేదు.

'అమ్మా!' అన్నాడు, మంచంమీద కూలబడుతూ.

మెల్లిగా కళ్ళను తనవైపు తిప్పిందామె. చాలా శ్రమతో చేయెత్తింది. ఆమె చేతిని పట్టుకున్నాడు. మాట్లాడాలని ప్రయత్నించిందికాని, అది ఆమె శక్తికి మించినట్లే తోచినట్లుంది. వొళ్లు కాగిపోతోంది. ఇన్నాళ్ళూ వొళ్లు విరుచుకొని పనిచేసి జీవితాన్ని సాధించాననుకొన్న యీ పిచ్చితల్లిని యీ నాడు జీవితమే జయించి, హేళనగా మొహంలో నవ్వుతూండగా, ఆమె కుంగిపోతున్నట్లు తోచింది...

అమ్మ మాట్లాడితే కొంతలో కొంత నయంగా వుండేది; కాని మాటకూడా పడిపోయిందేమో? అసలేం జబ్బో, దీనికి మందు మాకులంటూ యీ ప్రపంచంలో ఉన్నవో లేవో కూడా తెలియదు. అందులోనూ ఇలాటి విషమ సంఘటనను ఎదుర్కోవటానికి తనకు ఇదే మొదలు.

పక్కనేవున్న శర్మగారు వొణికిపొయ్యే తన భుజంమీద చేయివేశారు. 'భయంలేదు...యీమెను తీసుకొని వెళ్దాం' అన్నారాయన. అప్పుడు కాని, యీమెను ముందు యీ నరకంనుంచి, దాటించెయ్యాలనే సంగతే గుర్తు రాలేదు. ఒకో సంఘటనలో మానవుడు తన మతినే పోగొట్టుకొంటాడు. వేరొక రెవరైనా పక్కన వుండి, దారిచూపనట్లయితే, నడవలేదు. తన యీ దుస్థితిలో ఒకపక్క లలితా, మరోపక్క శర్మగారూ, రెండు రెక్కలవలె ఉండి ముందుకు సాగేట్లు చేయ గలుగుతున్నారు. వీరిద్దరి మేలుకూ తను జన్మంతా కృతజ్ఞత చూపవలసిందే.

యజమాని దగ్గిరికి వెళ్ళి 'అమ్మను తీసుకొని వెళ్తాను—' అన్నాడు తను.

'తీసుకెళ్ళండి...ఇక్కడ మాత్రం ఎవరున్నారూ ఆమెను చూసేందుకు?...ఏం లేదు—ఎంతో అలిసిపోయింది పాపం! నిజానికి యీ వయస్సులో ఆమె పొయ్యిదగ్గిర గంటల తరబడి పనిచేయ కూడదనుకోండి...వారం పదిరోజులు విశ్రాంతి వుంటే మళ్ళీ ఆరోగ్యాన్ని పొందుతుంది...బ్లడ్ ప్రషర్ అన్నాడు, డాక్టర్!' అన్నాడాయన.

పాడిచ్చే పశువును, అది ఇక నిరుపయోగమని తెలుసుకున్నాక, కసాయి దుగాణానికి తోలేందుకు వెనుకాడని మానవ ప్రవృత్తి బాగా అర్థమైంది! అయినా ఏమనీ లాభంలేదు. తమ పరిస్థితులకు తలలొగ్గి తమ యీ దుర్భర స్థితికి తామే బాధ్యులనుకోవటం కన్న, మరో ఆలోచన ప్రస్తుతం అనవసరం. 'ఎద్దుపుండు కాకికిముద్దా?' అనే సామెత గుర్తొచ్చింది.

శర్మగారి సహాయంతో అమ్మను టాక్సీలో గదికి తీసుకొచ్చాడు. అప్పటికే లలిత గది గుమ్మందగ్గిర సిద్ధంగావుంది. తాళంతీసి, మసిబారిన లాంతరు వెలిగించి, చాపమీద పక్కవేసి తల్లిని తీసుకొచ్చి పడుకోబెట్టారు. యీలోగా శర్మగారు టాక్సీవాడికి డబ్బిచ్చి పంపేశారు; తనచుట్టూ కొంత మందున్నా మనుషులంటూ లేకుంటే ఏమయ్యేవాడో, యీనాడు తలుచుకుంటేనే కంపర మెత్తుతూ వుంటుంది.

అమ్మ మాట్లాడేస్థితిలో లేదు. ఎవరేం చేసినా చూస్తూ వూరుకుంటోంది. దిగులుగా, తనకిక శక్తే లేనట్లు, ఏదో అదృశ్య శక్తికి లొంగి పోతూన్నట్లుగా కళ్ళు తేలవేస్తూంటే, తనకు కంపర మెత్తుతూంది. లలితను చూడగానే ఆమె కళ్ళల్లోకి కొత్త వెలుగు వొచ్చినట్లయింది. చిరునవ్వు నవ్వాలనీ, ఏదో మాట్లాడాలనీ ప్రయత్నించింది కాని, పెదవులూ, నోరూ వొణకటం కన్న మరేమీ అవలేదు...అమ్మకు పక్షవాతం వొచ్చి ఒక పార్శ్వమే పడిపోలేదు కదా!

'మాష్టారూ! నేను వెళ్ళేటప్పటికి డాక్టర్ బైటికి వెళ్లాడు. రాగానే ఇక్కడికి రమ్మని చీటీరాసి ఉంచివొచ్చాను...మీరేం భయపడకండి' అందామె.

భయం తన సమస్యల్ని తీర్చలేదు సరికదా, ఉన్నవాటిని అతి భీకరంగా చూపుతుంది; అందుకని భయపడి లాభంలేదు. ఏమౌతుందోననే ఆతృతవల్లకూడా ప్రయోజనంలేదు.

రెండు నిమిషాలపాటు ఆ గదంతా నిశ్శబ్దంలో మునిగిపోయింది.

'యీమెకు విశ్రాంతే పరమౌషధం!' అన్నారు శర్మగారు. ఎంత మూర్ఖుడైనా ఆ సంగతి ఇట్టే చెప్పగలడు. సంవత్సరాల తరబడి బడలిక ఆమె ఫాలభాగం మీది ప్రతి ముడతలోనూ నాట్యమాడుతోంది. విశ్రాంతి ప్రస్తావనేలేని జీవితాన్ని గడపవలసిన అవసరం ఏర్పడిందామెకు! ఆమెమీద ఎవరికీ, చివరకు తనకుకూడా జాలిలేదు; ఇక ఆ విధికి జాలిలేదనుకోవటం దేనికి? ఒకవేళ పొరపాటున ఎవరైనా

జాలి చూపదలచినా ఆమె స్వీకరించలేదు. జీవితాన్ని ఒంటరిగా పోరాడాలనే ఆమె పట్టుదలే కారణం. ఆమె అడుగు జాడల్లో నడిచే తన ధోరణీ ఇదే కదా!

మళ్ళీ నిశ్శబ్దం ఆవరించింది. లలిత అమ్మపక్కనే కూర్చొని, ఆతృతతో చూస్తూవుంది. లలితవుంటే అమ్మ చాలా త్వరలోనే ఆరోగ్యాన్ని పొందుతుందనే నమ్మకం వుంది తనకు. ఇదివరకు తనకు ప్రాణదానం చేసిందామె ... ఇప్పుడు అమ్మనుకూడా బతికించగలదు!

పావుగంటదాకా ఎలాటి శబ్దమూ లేకుండానే గడిచింది. ఎవ్వరూ మాట్లాడటం లేదు; ఆ అవసరమూ లేదు. ఇలాటి పరిస్థితుల్లో మాట్లాడే హక్కు ఒక్క డాక్టర్‌కే వుంది.

మరో పది నిమిషాలు గడిచాక, బైట కారుఆగిన శబ్దం కాగానే లలిత వెళ్ళి డాక్టర్ను వెంటపెట్టుకొని వొచ్చింది. డాక్టర్ కాళ్లమీద పడదామనుకున్నాడు తను! కాని సభ్యత, తనూ ఒక మానవుడేననే హెచ్చరిక అడ్డి నమస్కరింప జేసింది.

డాక్టర్ వొచ్చి పరీక్షచేశాడు. నాడిచూశాడు; ఇంటి వాసాల్ని లెక్కించాడు...రెండు నిమిషాలయ్యాక వేడినీళ్ళు తెమ్మన్నాడు...చప్పున ఇంటి యజమానుల దగ్గిర్నుంచి వేడినీళ్ళు తీసుకొచ్చాడు తను. సిరింజ్ అందులో ముంచి, ఇంజక్షన్ తీశాడు. తను లాంతరు పట్టుకోగా, లలిత సహాయంతో, డాక్టర్ ఒక ఇంజక్షన్ ఇచ్చాడు...ఇక తన పని ఐపోయినట్లుగా బ్యాగ్ సర్దుకున్నాడు.

డాక్టర్ ఏమీ చెప్పకుండానే వెళ్లిపోతూంటే భయంవేసింది; ఇది మాట దక్కే కేసుకాదని తేల్చుకున్నాడేమో? లలిత మొహంచూసి వొచ్చాడు కాని, రేపటి నుంచీ తన మొహంచూసి వొస్తాడా? అసలు అమ్మ స్థితిఏమిటో - ఏదైనప్పటికీ - దాన్ని తెలుసుకుంటే యీ ఆతృతన్నా తగ్గుతుంది.

ఏం చెయ్యాలో తోచని స్థితిలో లలిత డాక్టర్ వెంట వెళ్ళింది. బైట ఏదో గుస గుసలు జరిగినవి; అల్లంతదూరాన, కత్తులు నూరుతున్నట్లుగా శబ్దం! తానా సంగతులన్నీ తెలుసుకొని తీరవలసిన అవసరం వున్నప్పటికీ, ఆ బాధ్యతలనుకూడా లలితే తీసుకుంది.. డాక్టర్ వెళ్ళి పొయ్యాక, వాడిపోయిన మొహంతో వొచ్చిన లలితను చూడగానే అమ్మ మృత్యువుతో పోరాడుతోందనీ, జయం యింకా పక్షంలో లేదనీ తోచింది. ప్రవాహ మధ్యంలో నిస్సహాయంగావున్న తనకు ఇంక దిక్కెవరు?

'మాస్టారూ!' అని ఆమె ప్రశ్నార్థకంగా తన మొహంలోకిచూసి బైటికి నడిచింది. తాను మాట్లాడబొయ్యేది అమ్మ వినకూడదని బహుశా ఆమె అభిప్రాయమై వుంటుంది. అమ్మ యీ మాటల్ని విని అర్థం చేసుకొనే స్థితిలోవుందని లలిత పొరబడుతోందేమో? పోతే శర్మగార్ని వొదిలెయ్యటం బాగాలేదు. ఆయన ఏమనుకున్నా అనుకోవొచ్చు. ఇందులో ఆయన వినకూడని రహస్యాలు ఆశలేవు

తాను ఎవరో క్కాబోయే ప్రమాదానికి అందగా ఉండేందుకు సిద్ధంగావున్న శర్మగారిని గాయపరచటం తప్పని తోచింది. అదీగాక, ఆయన తన అనుభవంతో మంచి సలహా ఇవ్వగలుగుతాడు కూడాను.

అందుకనే శర్మగార్ని కూడా తనతోపాటు పిలిచాడు; ఆయనకూడా తనతో పాటే బైటికి వొచ్చాడు. రోడ్డుమీద వీధి దీపంకింద సమావేశం ఆరంభమైంది.

'ఏం లేదు మాష్టారూ! ఆమె బ్లడ్ ప్రెషర్ అధికంగానే వుంది. క్షణాల్లో తగ్గటం కష్టం. విశ్రాంతి అత్యవసరం...ఇదంతా ఇక్కడ కుదరదు కనుక, నర్సింగ్ హోంకు పంపరాదా అంటాడు డాక్టర్' అంది లలిత.

శర్మగారు త్వరపడి 'అదే మంచిది' అని అంటాడేమోనని భయం వేసింది. కాని ఆయన విని మెదలకుండా ఊరుకున్నాడు.

తనే ఆలోచనలో పడ్డాడు. పూర్వం తనను నర్సింగ్ హోంలో ఉంచారు: దానికైన ఖర్చంతా లలిత ఇచ్చింది. ఇక 'ఇప్పుడు అమ్మను బతికించుకునేందుకు నర్సింగ్ హోంకు తీసుకెళ్ళవొచ్చు; కాని తన దగ్గరవున్న ఐదారు వొందలూ సరిపోతయ్యో, లేదో? పోనీ అన్నిటికీ అలితే ఉన్నదనుకోలేడిప్పుడు. తన లేమిని ఎత్తి చూపుతూ, తనకు సహాయం చేసేందుకు లలిత కానీ, ఇంకోరు కానీ ప్రయత్నిస్తూంటే ఇప్పటికే ఎంతగానో గాయపడిన అంతరాత్మ, గిలగిలా తన్నుకొని ఛస్తుందేమో కూడాను. లేక అప్పుగా ఎక్కడన్నా పైకం తెచ్చేందుకు, తనకు ఇల్లా, వాకిలా, పేరా, ఊరా ఎవరన్నా ఇచ్చేందుకు? అలా ఇచ్చేందుకు ఎవరైనా సాహసిస్తే, అది తిరిగి తమ చేతికి రాదనేసంగతి తెలిసే ఇస్తారు; ఒకవేళ వారలా భావించకున్నప్పటికీ. తను తీర్చలేడు కనుక, పర్యవసానం అదే అవగలదు. అందుకని యీ తీర్చలేని దానికోసం పరుగెత్తి, అభాసు కాలేదు. ఎంతకూ సాధ్యమైనంత వరకూ, తన దగ్గరవున్నదాంట్లో ముడుచుకోవటమూ, లేనట్లయితే బాధపడి తనలేమి ఇతరులకు తెలియకుండా చేసుకోవటమే తాను చేయగలిగింది. అన్నిటినీ మించి లలిత ఆడకూతురు; తండ్రి చాటు యువతి; ఆమెకు స్వేచ్ఛలేదు; అందునా ఆర్థిక స్తోమతు, వ్యక్తిగతంగా లేదు. లోగడ ఆమె చెప్పినట్లు, ఇంట్లోకూడా వొత్తిడి ఆరంభమైందని తెలుసాడు! యీ పరిస్థితుల్లో తన బాధల్ని ఆమెకు అంటగట్టటం అర్థంలేని పని!

ఇదంతా క్షణంలో ఆలోచించుకొని, 'నర్సింగ్ హోంకు దేనికిలే అలితా ఇక్కడే వుంటుంది' అన్నాడు.

లలిత కళ్ళు పెద్దవిచేసి తన అసమ్మతిని తెలియపరుస్తూ అంది: 'ఇక్కడ ఎవరు చూస్తారు మాష్టారూ? మీ దారిన మీరేమో ఆఫీసుకు వెళ్తారు కదా!' అంది.

అలిత చెప్పింది చాలా సబబే కాని, తనస్థితిలో వున్నవాడికి మాత్రం కాదు. అందుకని ఏవిధంగా నన్నా నర్సింగ్ హోంకు తీసుకెళ్లేందుకు వీల్లేకుండా మాట్లాడాలి.

'చూద్దాంలే లలితా! నేనొక వారంరోజుల పాటు సెలవు తీసుకుంటాను -' అన్నాడు తను.

'అంతే లెండి...ఆ రాసే మాటర్ ఏదో ఇంటిదగ్గరే రాస్తే, కుర్రాడు వొచ్చి తీసుకెళ్తాడు. ఎలాగో సర్దుకోవొచ్చు' అన్నాడు శర్మగారు.

శర్మగారుకూడా తన పక్షమే మాట్లాడేప్పటికి, లలిత ఒక్కంతే ఐపో యింది.

'సరే — మీ ఇష్టం. నేనేం చెప్పేది? డాక్టర్ చెప్పిందాన్నిబట్టి అన్నాను-అంతే!' అందామె. ఆమెకు కోపంవచ్చిందని తేలిగ్గా అర్థం ఐంది. ఐనా తానది గమనించనట్లే నటిస్తే తప్ప లాభంలేదు.

'అన్నట్లు లలితా! డాక్టర్ ఏమన్నారు?' అన్నాడు.

'చెప్పానుగా...రోగివిషయం చాలా జాగ్రతలు తీసుకోవాలి. ఇప్పుడిచ్చిన ఇంజిక్షన్‌తో బహుశా తెల్లారేప్పటికి, బాగా తెలివి వొస్తుందన్నాడు. రేపు మళ్ళీ ఇంజిక్షన్ చేస్తానన్నాడు. కొన్నాళ్ళ పాటు - బహుశా రెండు మూడు నెలలపాటు మంచం దిగకూడదన్నాడు. మంచి ఆహారమూ, విశ్రాంతీ చాలా ముఖ్యమన్నాడు...' అందామె.

డాక్టర్ ఆశ కనబరిచినందుకు, కొలబంటు దుఃఖంలో, కొంకొటిబంటి సంతోషం కలిగింది. ఇక మిగిలిందంతా ఆ విధికే వొదిలి, శక్తి వంచన లేకుండా అమ్మకు తాను సేవ చేయటమే!

'—అన్నట్లు మరిచి పొయ్యాను' అందామె ఒక చీటీ అందిస్తూ 'ఇందులో వున్న మందు తేవాలి. యీ రాత్రంతా రెండేసి గంటల కొకసారి ఒకో డోసు వాడాలి. గ్లూకోజ్ నీళ్ళివ్వమన్నాడు...ఆమెకు నిద్రపడితే మాత్రం నిద్రనుంచి లేపవొద్దన్నాడు'

చీటీ అందుకున్నాడు తను.

'మీరు వెళ్ళి మందులు తీసుకొనిరండి మాస్టారూ! నేనుంటాను...మళ్ళీ ఆలస్యమైతే షాపులు కట్టేస్తారు' అంది లలిత.

నిజమే-రాత్రి ఎనిమిదిన్నర ఐ వుంటుంది. లలితను ఇక్కడ ఉంచటం ఏమీ సబబు కాదని తెలుసు తనకు. తన స్వార్థాన్ని చూసుకొని, ఇంతసేపూ ఆ సంగతే గుర్తు రాలేదు.

'లలితా! నువ్వెళ్ళు. చాలా పొద్దెక్కింది. నేను వెళ్ళి మందు తెస్తాను—' అన్నాడు.

'మీరు వెళ్లండి పాపం! చాలా ఆలస్యమైంది. నేను ఉంటాను' అన్నాడు, శర్మగారు.

యీ హెచ్చరికల్ని లలిత తోసిపారెయ్యలేక పోయింది. తనతోపాటే బయలు దేరింది. కొంత దూరం వెళ్ళాక 'మాస్టారూ!' అంది రహస్యం చెప్పే ధోరణిలో, తక్కున ఆగి పొయ్యాడు; ఆమెకూడా ఆగింది.

'ఏంలేదు...మీకేమన్నా డబ్బు కావాలా ?' అంది, భయపడుతూనే.

తనకు మండిపోయిన మాట నిజమేకాని, యీ సమయంలో మంచితనాన్ని కూడా పరాభవించట మౌతుందని పస్తాయించాడు.

'అక్కర్లేదు లలితా ! నా దగ్గరవుంది !' అన్నాడు కాస్త విసురుగానే.

'ప్రస్తుతం నా దగ్గిరా లేదనుకోండి...కాని అవసరమైతే మాత్రం అడగండి' అందామె.

'సరే...సరే !' అన్నాడు విసుగ్గా.

'మరోమాట మాస్టారూ !' అందామె చాలా ప్రశాంతంగానే 'పరిస్థితులు మీకు తెలుసుగా...ఇదవరకల్లే నేను బైటికి రాలేను. యీమధ్య వామీద సి. ఐ. డీలు కూడా పనిచేస్తున్నారులెండి. అందుకని వీలుచూసుకొని వొస్తూంటాను...అమ్మగారికికూడా చెప్పండి...కాని నేను రోజూ రావటంలేదని మీరేమీ అనుకోకండేం !'

నిలువునా నీరైపొయ్యాడు తను. అది రోడ్డు ఐపోయింది కాని, లేకుంటే లలిత కాళ్లమీద పడి, కన్నీటితో ఆ పాదాల్ని కడిగేసినా, తాను ఆమెపట్ల తలిచిన అపచారాలకు ప్రాయశ్చిత్తం జరగదనిపించింది. యీ మధుర మూర్తినిగూర్చి, ఇక ముందు జీవితంలో ఏ విధమైన చెడును అంటగట్టినా, అది తనను పతితుణ్ణి చేస్తుంది !

'అందుకనే మాస్టారూ ! నర్సింగ్ హోంలో ఉంచమన్నాను—' అందామె, తానేదో నేరంచేసి, సంజాయిషీ చెప్పుకుంటూన్న ధోరణిలో. తనకా నోటమాట రాక స్తబ్ధుడవుతున్నాడు.

ఇది వీధి అనీ, తామిద్దరూ ఒకపక్కగా ఇలా నిలబడి మాట్లాడటం చూసే వాళ్ళకు చాలా విచిత్రంగానూ, అసహ్యంగానూ ఉంటుందనీ తోచింది.

'లలితా ! నీ వసలు రావొద్దు...ఏం ఫర్వాలేదు. నీవు రానంతమాత్రాన, నిన్ను అపార్థం చేసుకుంటా ననుకున్నావా ?' అన్నాడు తను.

'అది కాదు మాస్టారూ...'

ఆమెనిక మాట్లాడనిచ్చి, సంభాషణ పెంచటంవల్ల ఆమెకూ, తనకూ కూడా ఆలస్యమౌతుంది. ఏమన్నా ఫిర్యాదులూ, సంజాయిషీలూ వుంటే వేరొక సమయంలో చూసుకోవొచ్చు. ముందు యీమెను పంపేసి, మందులు తీసుకొని అమ్మదగ్గిరికి వెళ్లాలి. ఆ తరువాత తీరిగ్గా ఉన్నప్పుడు లలిత విషయం ఆలోచించవొచ్చు.

'లలితా తర్వాత మాట్లాడుకుందాం...ఆ రిక్షా పిలుస్తాను ... వెళ్ళు!' అన్నాడు. ఆమె మెదలకుండా రిక్షా ఎక్కి కూర్చుంది. రిక్షా కదలగానే 'వొస్తాను మాస్టారూ! అమ్మను కాస్త కనిపెట్టి ఉండండి' అని నమస్కరించింది.

క్షణంసేపు నేలమీద పాతివేయబడిన శిలా విగ్రహంవలె అయింది తనపని ! యీ లలిత లేకుంటే జీవితం ఏనాడో అంతరించి ఉండేదనేది గొప్ప సత్యమేనని ఇప్పుడు అర్థమౌతోంది. యీమెకు తను జీవితంలో కృతజ్ఞతను చూపగలడా ?

యీ విషయం గూర్చి ఆలోచించే సమయమిది కాదనే అంతరాత్మ హెచ్చరికను పాటించి, వేగంగా బజారువైపు వెళ్ళాడు. జేబులో ఇరవై రూపాయిలున్నవి. మందులషాపువాడు ఒకసారి చీటీచూసి, తన మొహంలోకి ఒకసారి చూసి 'ఆరు రూపాయిలు అవుతయ్—' అన్నాడు.

మెదలకుండా డబ్బు చెల్లించి మందులు తీసుకొన్నాడు. ఇంత ఖరీదైన మందులు తన బోటివాడికి తలకు మించినవే కాని మరి మార్గంలేదు. అందులోనూ తన ఏకైక బాంధవిని రక్షించుకునేందుకు ఇవి ఉపయోగపడాలే కాని, తన దగ్గిర వున్నదంతా ఖర్చుపడినా విచారించాల్సింది లేదు!

ఆదరా బాదరా గదికి చేరాడు. శర్మగారు కునికి పాట్లుపడుతూ తనకోసం ఎదురు చూస్తున్నారు. తాను వెళ్ళినప్పుడు ఎలావుందో, అమ్మ ఆదేవిధంగా వుంది.

వొచ్చాక మందు ఇద్దామని ప్రయత్నించాడు. కాని ఆమె నోరు తెరిచి మింగే స్థితిలో లేదని తెలుసుకోగానే కొద్దిగా కూడగట్టుకొన్న ధైర్యం కాస్తా దిగజారి పోయింది. చేసేదిలేక విచారంగా కూర్చున్నాడు. (ఇంకా వుంది)

వెలువడింది! నేడే మీ ప్రతి భద్రపరుచుకోండి!

మానవ జీవితపు లోతుల్ని పరిశోధించి, మన స్తత్వాల్ని
వివరించ గలిగిన కథల సంపుటి

చౌడేశ్వరి దేవి

# బలిదానం

ప్రతి కథా మీ హృదయాన్ని ద్రవింప జేస్తుంది.

88 పేజీలు : ద్వివర్ణ ముఖచిత్రం

వెల 8 అణాలు

9 అణాల స్టాంపులు పంపేవారికి బుక్‌పోస్టులోనూ, 15 అణాల స్టాంపులు పంపేవారికి రిజిస్టర్డ్ పోస్టులోనూ పంపబడుతుంది.

జ్యోతి ఏజెంట్ల దగ్గర దొరుకుతుంది. లేదా
జ్యోతి కార్యాలయం, మద్రాసు_17.

Edited & Published by Dhanikonda Hanumantha Rao at Abhisarika Office, 4, Balu Mudali St., Madras-17. and Printed by M. Venkateswarlu at M. V. S. Press, 72, Govindappa Naicken St., Madras-1.

Regd No. M. 6516 ABHISARIKA (Telugu Monthly) Nov. '55

# అభిసారిక

సచిత్ర విచిత్ర మాసపత్రిక

నంపాదకుడు :

ధనికొండ హనుమంతరావు

★

శాస్త్రీయమైన లైంగిక వ్యాసాలతో, అత్యుత్తమ కథలతో, మనస్తత్వ వివరణలతో, శారీరక శాస్త్ర చర్చలతో, మీరు తెలుసుకోదగ్గ అనేక విషయాలతో, అందాలు చిందే త్రివర్ణ ముఖచిత్రంతో నెలనెలా వెలువడుతుంది.

ప్రతి సంచికా ఒక ప్రత్యేక సంచికే!

★

| | |
|---|---|
| సంవత్సర చందా : | రూ 6–0–0 |
| 6 నెలలకు చందా: | రూ 3–8–0 |

★

అన్నిచోట్ల ఏజెంట్లు కావాలి.

వివరాలకు :

అభిసారిక కార్యాలయం,

4, బాలుమొదలి వీధి,

మద్రాసు-17.

C. NARAYANAN NAIR,
SHOP MERCHANT,
36, HALLS RD EGMORE.
MADRAS-8.

Wrapper Printed at the Asian Printers, Madras-5.